


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 08, సంచిక: 340 | మంగళవారం | 11-11-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




ఉగ్రకుట్ర గుట్టురట్టు 05

ఢిల్లీలో

# భారీ పేలుడు



- ఎర్రకోటకు కూతవేటు దూరంలో కారులో విస్ఫోటనం
- 8 మంది మృత్యువాత?, పలువురికి తీవ్రగాయాలు, అనేక వాహనాలు దగ్ధం
- పేలుడు ధాటికి ఛిద్రమైన మృతదేహాలు
- ఘటనా స్థలిలో భీతావహ వాతావరణం
- ఢిల్లీ సరిహద్దు ప్రాంతాలలో కట్టుదిట్టమైన భద్రత



**న్యూఢిల్లీ:** ఢిల్లీలో చరిత్రాత్మకమైన ఎర్రకోట వద్ద శక్తివంతమైన కారు బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 8మంది మృతి చెందినట్లు సమాచారం. 24 మంది గాయపడ్డారు. ఒక చంటి బిడ్డ సహా మృతదేహాలు ఆ ప్రాంతంలో చెల్లాచెదురుగా పడ్డాయి. ప్రజలు పరుగులు తీశారు. తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకుంది. దీంతో ఢిల్లీ మహానగరంలో హై ఎలర్ట్ ప్రకటించారు. సోమవారం సాయంత్రం జనంతో రద్దీగా ఉన్న సమయంలో ఎర్రకోట మెట్రో స్టేషన్ గేట్ నెంబర్–1 సమీపంలోకి 6.52 గంటలకు కారు వచ్చి ఆగింది. పార్కింగ్ చేసిన ఆ కారు ఆ వెను వెంటనే పేలిపోవడంతో తీవ్ర విస్ఫోటనం సంభవించింది. దీంతో ఆ ప్రాంతం అంతటా భయానకమైన వాతావరణం ఏర్పడింది. చుట్టుపక్కల ఉన్న అనేక వాహనాలు మంటల్లో దగ్ధమయ్యాయి. మంటలు ఎగసి ఎగసి పడ్డాయి. పేలుడు తీవ్ర ఉద్ధృతి వల్ల అనేక మీటర్ల దూరంలో పార్కింగ్ చేసిన వాహనాల తలుపులు ధ్వంసమయ్యాయి. అనేక కిలోమీటర్ల దూరానికి పేలుడుశబ్దం వినిపించింది. గాయపడినవారిని కొద్ది కి.మీ దూరంలో ఉన్న ఎల్ఎన్‌జెపి ఆసుపత్రికి తరలించారు. చాందినీ చౌక్ ట్రేడర్స్ అసోసియేషన్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఈ వీడియోను చూస్తే పేలుడు ఎంత తీవ్రస్థాయిలో ఉందో అందరికీ అర్థమవుతోంది.మృతదేహం ఎగిరివచ్చి ఒక కారుపై పడి ఉన్న దృశ్యం కనిపించింది. మరో వీడియోలో ఒక తరువాయి 2లో



క్షతగాత్రులను పరామర్శిస్తున్న హోంమంత్రి అమిత్ షా

"సాయంత్రం7గంటల ప్రాంతంలో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలోని సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద హ్యుందాయ్ ఐ –20 కారులో పేలుడు సంభవించింది. ఈ పేలుడులో కొంతమంది పాదచారులు గాయపడ్డారు. కొన్ని వాహనాలు దెబ్బతిన్నాయి. కొంతమంది ప్రాణాలు కోల్పోయారని ప్రాథమిక నివే దికలు సూచిస్తున్నాయి. పేలుడు సమాచారం అందిన 10 నిమిషాల్లో నే ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్, ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఎఫ్‌ఎస్ఎల్‌తో పాటు ఎన్ఎస్‌జి, ఎన్ఐఎ బృందాలు వెంటనే సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తాము. ఫలితాలను ప్రజలకు అందిస్తాము.

–కేంద్ర హోం మంత్రి అమిత్ షా

"సాయంత్రం ఢిల్లీలో జరిగిన పేలుడులో ప్రియమైన వారిని కోల్పోయిన వారికి సంతాపం. గాయపడినవారు వీలైనంత త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. బాధితులకు అధికారులు సహాయం అందిస్తున్నారు. హోంమంత్రి అమిత్ షా , ఇతర అధికారులతో పరిస్థితిని సమీక్షించారు.

–'ఎక్స్'లో ప్రధాని నరేంద్ర మోదీ

"ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు వార్త అత్యంత హృదయ విదారకమైంది, ఆందో ళన కలిగించింది. ఈ విషాద ప్రమాదంలో చాలా మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. ఈ దుఃఖ సమయంలో ప్రియమైన వారిని కోల్పోయిన మృతుల కుటుంబాలకు నేను అండగా నిలుస్తా. నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడిన వారందరూ వీలైనంత త్వరగా కోలుకోవాలని నేను ఆశిస్తున్నాను.

– 'ఎక్స్'లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

'జయ జయహే తెలంగాణ' రూపశిల్పి

# అందెశ్రీ అస్తమయం



'మాయమై పోతున్నడమ్మో' పాటతో విస్తృత ప్రజాదరణ

- తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో కీలక పాత్ర పోషించిన
- పాఠశాల విద్య లేకుండానే కవిగా గొప్ప పేరు సాధించిన వైనం
- ప్రధాని మోదీ, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి
- నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలకు సిఎం ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' రూపశిల్పి, ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ సోమవారం కన్నుమూశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉదయం ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన తుదిశ్వాస విడిచారని 'బ్రాట్ డెడ్'గా వైద్యులు ధృవీకరించారు. అందె శ్రీ వయస్సు 64 సంవత్సరాలు. ఆయనకు భార్య మల్లు బాయి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆదివారం రాత్రి భోజనం తర్వాత మామూలుగానే పడుకున్నారని, రాత్రి ఏం జరిగిందో తెలియదని, ఉదయం లేచి చూసే సరికి బాత్ రూమ్ వద్ద కింద పడిపో యి ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం కుటుంబ సభ్యులు అందెశ్రీని గమనించి ఆస్పత్రికి తీసుకొచ్చారని, అప్పటికే ఆయన గుండెపోటుతో మరణించారని గాంధీ ఆసుపత్రి హెచ్ఒడి (జనరల్) సునీల్ కుమార్ చెప్పారు. అందెశ్రీని ఆసుపత్రికి తీసుకురావడానికి ఐదు గంటల ముందే చనిపోయి ఉండొచ్చన్నారు. మూడు రోజులుగా అనారోగ్యంగా ఉన్నప్పటికీ ఆయన తరువాయి 2లో



అందెశ్రీ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించిన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి తదితరులు.

## రాజకీయాల్లో మహిళా సమానత్వం లేదు

- సుప్రీంకోర్టు పరోక్షవ్యాఖ్య
- మహిళా రిజర్వేషన్ల అమలుపై ఆదేశాలు ఇవ్వలేం
- పిటిషన్‌పై కేంద్రం స్పందన కోరిన ధర్మాసనం



**న్యూఢిల్లీ:** మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కోరుతూ దాఖలైన ఒక పిటిషన్‌ను పరిశీలించేందుకు సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం ప్రతిస్పందన కోరింది. 2023లో కేంద్ర ప్రభుత్వం నారీశక్తి వందన్ చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకా రం లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలలో మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించాలి. దేశం లో మహిళలే అతిపెద్ద మైనారిటీ అని జస్టిస్ బి.వి. నాగరత్న,జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధ ర్మాసనం వ్యాఖ్యానిస్తూ, మహిళా రిజర్వేషన్ల అ మలుపై 'మీ అభిప్రాయం ఏమిటో చెప్పండి' అని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి ఒక నోటీసు జారీ చేసింది. ఈ చట్టం అమలుపై విశేషాధికారాలు ఉ న్నందువల్ల ఈ విషయంలో అత్యున్నత న్యాయస్థానం తదుపరి ఎలాంటి ఆదేశాలువ జారీ చేయలేదని కూడా ధర్మాసనం తరువాయి 12లో

## పాత విధానంలోనే మస్టర్లు

- సింగరేణిలో సొంతింటి పథకం అమలుకు ఏర్పాటైన కమిటీలో యూనియన్ ప్రతినిధులకు ప్రాతినిధ్యం
- సింగరేణి కార్మికులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం
- మెడికల్ బోర్డు కొనసాగింపు
- యాజమాన్యంతో గుర్తింపు సంఘం చర్చలు ఫలప్రదం



ప్రజాపక్షం/హైదరాబాద్

సింగరేణి సంస్థలో 150 మస్టర్ల ఆబ్సెంటిజం సర్కులర్ విషయంలో ఎలాంటి ఒత్తిడి కార్మికులపై లేకుండా గతంలోని పాత విధానాన్నే కొనసాగించడానికి సింగరేణి కాలరీస్ కంపెనీ యా జమాన్యం అంగీకరించింది. సొంత ఇంటి పథకాన్ని అమలుపరచడానికి ఏర్పాటైన అధికారిక కమిటీలో యూనియన్ ప్రతినిధులకు కూడా ప్రాతినిధ్యం కల్పించి విధివిధానాలు నిర్ణయించి త్వరగా సమస్యను పరిష్కరించేందుకు కూడా యాజమాన్యం ఒప్పుకున్నారు. సింగరేణి సంస్థ స్ట్రక్చర్ కమిటీ సమావేశం సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో జరిగింది. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బల రాం సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షులు, కొత్తగూ డెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, డైరెక్టర్ గౌతమ్ పొట్రు, ఇతర డైరెక్టర్లు వెం కశ్వర్లు, సూర్యనారాయణ, తిరుమల్ రావు, సంబంధిత జనరల్ మేనేజర్లు, గుర్తింపు సం ఘం అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామ య్య, కొరిమి రాజ్‌కుమార్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు తరువాయి 2లో

## ఫిలిప్పీన్స్‌లో సూపర్ టైఫూన్

132 గ్రామాలు మునక
నిరాశ్రయులుగా 14 లక్షల మంది



**మనీలా:** సూపర్ పవర్ తుఫాను 'ఫంగ్–వాంగ్' ఫిలిప్పీన్స్‌ను అతలాకుతలం చేసింది. ఈ తుఫానువల్ల నలుగురు మరణించారు. తుఫాను ప్రభావం వల్ల 14 లక్షలమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వారందరినీ అత్యవసర షెల్టర్లకు తరలించారు. సోమవారం సాయంత్రం నాటికి ఇంకా 3.18 లక్షలమంది సహాయ శిబిరాల్లోనే తలదాచుకున్నారు. ఆదివారం ఉదయమే తూర్పు ఫిలిప్పీన్స్ ఈస్ట్రన్ బైకోల్ ప్రాంతాన్ని సూపర్ తుఫాను కబళించిన తర్వాత తైవాన్ దిశగా దూసుకువెళ్ళింది. ఫంగ్–వాంగ్ తుఫానువల్ల ఉత్తర ఫిలిప్పీన్స్ ప్రాంతం తీవ్రంగా నష్టపోయింది. గంటకు 230 కి.మీ వేగంతో గాలులు వీయడంతో భారీనష్టం వాటిల్లింది. తూర్పు ప్రాంతంలో దాదాపు 132 కు పైగా గ్రామాలు వరదనీటిలో మునిగిపోయాయి. 1000 ఇళ్ళు ధ్వంసమయ్యాయి. ఫిలిప్పీన్స్‌కు కష్టాలమీద కష్టాలు ఎదురవుతున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే మరో సూపర్ పవర్ తుఫానును ఎదుర్కొంది. అంతకుముందు తరువాయి 12లో

## 'జూబ్లీహిల్స్' పోలింగ్‌కు రంగం సిద్ధం



నేడు ఉదయం 7నుండి సాయంత్రం 6గంటల వరకు ఓటింగ్

- ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి
- సిబ్బందికి ఇవిఎంలు, పోలింగ్ సామాగ్రి పంపిణీ
- 58మంది అభ్యర్థులు 4,01,365 మంది ఓటర్లు
- ఈసారి సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్‌లతో నిఘా : ఎన్నికల అధికారి కర్ణన్



ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో సిబ్బందికి ఈవిఎంలు, పోలింగ్ సామాగ్రిని పంపిణీ చేశారు. సోమవారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు ఈవిఎంలతో సహా సిబ్బంది చేరుకున్నారు. నేటి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులతో కలిసి సోమవారం కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. అలాగే పలు పోలింగ్ కేంద్రాలను సైతం ఆయన సందర్శించి, ఏర్పాట్లను తనిఖీ చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 4 లక్షల 1,365 మంది ఓటర్లు ఉన్నారు. 58 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. ఎన్నికల కోసం 407 పోలింగ్ కేంద్రాలను తరువాయి 2లో

## 122 స్థానాలు 3.7 కోట్ల మంది ఓటర్లు

నేడు బిహార్ తుది దశ పోలింగ్



- 1,302 మంది అభ్యర్థులు, 45వేలకు పైగా పోలింగ్ స్టేషన్‌లు
- 4 లక్షలకుపైగా సిబ్బందితో పటిష్ట భద్రత
- అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్న ఓటర్లు

**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా రెండవ, చివరి దశ ఎన్నికల పోలింగ్ మంగళవారం జరగనుంది. మొత్తం 122 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 3.70 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరగనుంది. నితీష్ కుమార్ ప్రభుత్వంలోని అరడజనుకు పైగా మంత్రులు సహా 1,302 మంది అభ్యర్థుల భవితవ్యం ఇవిఎంలలో నిక్షిప్తం కానుంది. నేడు ఎన్నికలు జరగనున్న జిల్లాల్లో పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, సీతామరి, మధుబాని, సుపాల్, అరారియా, కిషన్‌గంజ్ ఉన్నాయి. ఇవన్నీ నేపాల్‌తో సరిహద్దులను పంచుకుంటాయి. అసెంబ్లీ ఎన్నికల రెండవ విడత కోసం బిహార్ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. 4 లక్షలకు పైగా సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నారని అధికారులు తెలిపారు. ఎన్నికలు జరిగే జిల్లాల్లో ఎక్కువ భాగం ముస్లిం జనాభా అధికంగా ఉన్న సీమాంచల్ ప్రాంతంలో ఉన్నాయి. ఇది మైనారిటీల మద్దతుపై ఆధారపడిన భారత కూటమికి, చొరబాటుదారులను రక్షిస్తోందని ఆరోపిస్తున్న పాలక ఎన్‌డిఎకు అధిక పోటీగా మారింది. బరిలో ఉన్న ప్రముఖ అభ్యర్థులలో తరువాయి 12లో



ఎమ్మెల్యే అనర్హత కేసులో

## 17న స్పీకర్‌పై ధిక్కార పిటిషన్ విచారణ

**న్యూఢిల్లీ :** పార్టీ మారిన 10 మంది బిఆర్ఎస్ ఎంఎల్‌ఏల మీద అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలన్న కోర్టు ఆదేశాలను పాటించనందుకు తెలంగాణ స్పీకర్‌పై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. బిఆర్ఎస్ తరపు న్యాయవాది దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను సుప్రీం కోర్టు ఈ నెల 17న విచారించనుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ బెంచ్ జూలై 31న 10 మంది భారత రాష్ట్ర సమితి ఎంఎల్‌ఏల అనర్హత అంశాన్ని మూడు నెలల్లోగా నిర్ణయించాలని అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశించింది. మూడు నెలల గడువులోపు స్పీకర్ చర్య తీసుకోలేదని, కాబట్టి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఈ ఏడాదిలోనే పుతిన్ భారత్ పర్యటన

**మాస్కో:** రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ ఏడాదిలోనే భారత్‌లో పర్యటిస్తారని క్రెమ్లిన్ వర్గాలు అంచనావేశాయి. దీనికి సంబంధించి ప్రస్తుతం తాము క్రియాశీల ఏర్పాట్లు చేస్తున్నామని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దీమ్రీ పెస్కోవ్ సోమవారం ఉదయం మాస్కోలో చెప్పినట్లు టాస్ వార్తాసంస్థ వెల్లడించింది. ''భారత్‌లో పుతిన్ పర్యటనకు వీలుగా మేం ప్రస్తుతం చాలా చురుగ్గా సన్నాహాలు చేస్తున్నాం, ఇది రెండు దేశాలకు చాలా అర్థవంతమైన ప్రయోజనాలు కలిగించే పర్యటనగా ఉంటుందని ఆశా భావం వ్యక్తం చేస్తున్నాం'' అని దీమ్రీ పెస్కోవ్ చెప్పారు. సకాలంలో కుదుర్చుకోవడానికి వీలైన ప్రణాళికాబద్ధమైన ప్రతిపాదిత ఒప్పందాలన్నింటినీ తర్వాత ప్రకటిస్తామని అన్నారు. ఎకనామిక్ టైమ్స్ కూడా ఒక కథనం ప్రచురిస్తూ, పుతిన్ భారత్ పర్యటన ద్వారా జరిగే ఒప్పందాలవల్ల రష్యాలో భారతీయుల సంఖ్య గణనీయంగా పెంచడానికి దోహదం చేయగలవని పేర్కొంది.



## సెనేట్‌లో రాజీ ఒప్పందంతో
# ముగిసిన షట్‌డౌన్

**వాషింగ్టన్:** షట్‌డౌన్‌ను ముగించేందుకు రాజీ మార్గంలో అమెరికా సెనేట్ తొలి అడుగు వేసింది. షట్‌డౌన్‌ను ముగించే లక్ష్యంతో రూపొందించిన ఒప్పందాన్ని సెనేట్ ఆమోదించింది. వారాంతంలో జరిగిన చర్చల తర్వాత ఉదారవాద డెమోక్రాట్ల గ్రూపు రిపబ్లికన్ల ప్రతిపాదనను అంగీకరించారు. వారితో జతకలిసి ఒప్పందానికి అనుకూలంగా ఓటు వేశారు. దీంతో అమెరికా చరిత్రలో 41 రోజుల సుదీర్ఘమైన షట్‌డౌన్ ప్రతిష్టంభన ముగిసేందుకు రంగం సిద్ధమైంది. ఐతే తుది ఆమోదానికి ఇంకా చాలా రోజులు పడుతుంది. హెల్త్ కేర్ సబ్సిడీలను పొడిగించడానికి ఎలాంటి హామీలు లేకుండా ముందుకు వెళ్ళేందుకు డెమోక్రాట్లు అంగీకరించారు. ప్రభుత్వానికి నిధులు సమకూర్చేందుకు ఒక రాజీ ఒప్పందంగా 60–40 తేడాతో సెనేట్ ఓటు వేసింది. ఖర్చులకు సంబంధించిన మూడు వార్షిక బిల్లులను రాజీ మార్గంలో ముందుకు తీసుకువెళ్ళేందుకు ముగ్గురు మాజీ గవర్నర్లు చొరవ చూపించి అంగీకారం తెలియజేయడంతో ఆరు వారాల ప్రతిష్టంభన విచ్ఛిన్నానికి మార్గం సుగమమైంది. సెనేట్ మెజారిటీ లీడర్ జాన్ థునే తక్షణం ఒప్పందాన్ని ఆమోదించారు. వెంటనే ఓటింగ్ ప్రక్రియ ప్రారంభానికి పిలుపు ఇచ్చారు. షట్‌డౌన్ కొనసాగడంవల్ల దేశవ్యాప్తంగా విమానాల రాకపోకలకు తీవ్ర నష్టం కలుగుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సెనేట్ కొత్త ప్రతిపాదనకు ఆమోదం తెలియజేసినప్పటికీ కూడా ఈ బిల్లులను అమెరికా దిగువసభ ఆమోదించాలి. అక్కడి నుండి ఈ బిల్లులు దేశాధ్యక్షుడు ట్రంప్ సంతకంకోసం ఆయన మీదకు చేరుకోవాలి. ఈ తతంగం అంతా పూర్తయ్యేలోపు డెమోక్రాట్ల అభ్యంతరాలు,ప్రక్రియలో జాప్యం ఉంటే తుది ఆమోదానికి ఇంకా ఇంకా ఆలస్యం జరుగుతుంది. ప్రభుత్వాన్ని నడపడానికి అక్టోబరు ఒకటో తేదీ నాటికి నిధులు ఖాళీ ఐపోవడంతో షట్‌డౌన్ అమలులోకి వచ్చింది. ఒకవైపు 41 రోజులుగా అమెరికాలో షట్‌డౌన్ అసాధారణ సమస్యలు సృష్టిస్తుండగా, జనవరి నెల 30 వరకూ నిధులు కేటాయించే లక్ష్యంతో ఎట్టకేలకు సెనేటర్లు ముందుకు వెళుతున్నారు. మూడు సంవత్సరాల పాటు ఆర్థికంగా లోటు లేకుండా ఉండేలా చేసే ప్యాకేజీ కూడా ఇందులో ఉంది. ఈ షట్‌డౌన్ వల్ల దేశవ్యాప్తంగా 14 లక్షలమంది ఫెడరల్ ఉద్యోగులు వేతనాలు లేకుండా సెలవులపై వెళ్ళి ఇళ్ళల్లో కూర్చున్నారు. ప్రయాణికులతో పాటు ఇటు లక్షలమంది ప్రజలకు ఆహార కష్టాలు కూడా విపరీతంగా పెరిగిపోతాయి. ఒక్క ఆదివారంనాడే దాదాపు 10,000 విమానాలు తీవ్ర జాప్యంతో నడిచాయి. దీనివల్ల అనేక ముఖ్యమైన కార్యకలాపాలన్నీ స్తంభించిపోయాయి. షట్‌డౌన్ వల్ల ఎక్కువమంది ఉద్యోగులు వేతనాలు లేకుండా సెలవులపై ఇళ్ళకు వెళ్ళి గడుపుతున్నారు. ఎమర్జెన్సీ విభాగాల ఉద్యోగులు కూడా వేతన చెల్లింపులు లేకుండానే తీవ్రమైన ఒత్తిడి మధ్య పనులు నిర్వహిస్తున్నారు. విమానయానరంగంలో ఉద్యోగులపై ఒత్తిడి పడితే ప్రాణాలకే నష్టం జరుగుతుంది. అందువల్ల వారిపై ఒత్తిడిని తగ్గించేందుకు అనేక చర్యలు తీసుకున్నారు. ఎఫ్ఎఎ ఆదేశం మేరకు ఎయిర్ ట్రాఫిక్ తగ్గించేందుకు శనివారం 1500, ఆదివారం 2,900 విమానాలు రద్దు అయ్యాయి. సోమవారం ఉదయం 1600 ఇమానాలు రద్దయ్యాయి. మంగళవారం కూడా దాదాపు 1000 విమానాలు రద్దవుతాయి.

## 'మాధేష్' ముఖ్యమంత్రి నియామకంపై నేపాల్‌లో ఏడు పార్టీల నిరసన ప్రదర్శన

### సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రతిపక్షాలు డిమాండ్

**కాఠ్మండు:** నేపాల్‌లోని మాధేష్ రాష్ట్రంలో రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నేపాలీ కమ్యూనిస్టుపార్టీలతోపాటు నేపాలీ కాంగ్రెస్‌పార్టీ సోమవారం నిరసన ప్రదర్శన చేసింది. రాజకీయ పార్టీ అభిప్రాయాలను మన్నించకుండా తమకు ఇష్టమైనవారిని ముఖ్యమంత్రిగా నియమించడాన్ని ఈ ఏడుపార్టీలు ఉమ్మడిగా వ్యతిరేకించాయి. వీధుల్లో నిరసన ప్రదర్శనలు జరిపాయి. ప్రతిపక్షాల విజ్ఞప్తిని తోసిపుచ్చి మాధేష్ రాష్ట్ర అధిపతి సుమిత్ర దేవి భండారీ సోమవారం ఉదయం యుఎంఎల్ పార్లమెంటరీపార్టీ నాయకుడు సరోజ్ కుమార్ యాదవ్‌ను ముఖ్యమంత్రిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహంతో నిరసన ప్రదర్శనలు చేపట్టాయి. నేపాలీ కాంగ్రెస్, సిపిఎన్ (మావోయిస్టు సెంటర్)తోపాటు సిపిఎన్ (యూనిఫైడ్ సోషలిస్ట్), లోక్‌తాంత్రిక్ సమాజ్‌వాదీపార్టీ, జనమత్‌పార్టీ, జనతా సమాజ్‌వాదీపార్టీ, నాగరిక్ ఉన్ముక్త్‌పార్టీల నాయకులు కార్యకర్తలు మాధేశ్ భవన్ వెలుపల భారీ ప్రదర్శన చేశారు. మాధేష్ ముఖ్యమంత్రి జితేంద్ర సోనాలీ శాసనసభలో విశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోకముందుగానే తనకు మద్దతు లేదంటూ ముందుగానే ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. కానీ రాష్ట్రాధిపతి మాత్రం ప్రతిపక్షాలను పెడచెవినపెట్టి సరోజ్ కుమార్‌ను ముఖ్యమంత్రిగా నియమించారు. రాజ్యాంగంలోని 168(2) ప్రకారం సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

## పదవులు కోల్పోయిన బిబిసి డిజి,సిఇఓ

### ఆరేళ్ళక్రితం ట్రంప్ ప్రసంగం ఎడిట్ చేసినందుకు..!





**లండన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రసంగాన్ని ఎడిట్ చేసిన బిబిసి డైరెక్టర్ జనరల్ టిమ్ డేవి దాదాపు ఆరేళ్ళ తర్వాత తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆయనతోపాటు వార్తల విభాగం అధిపతి ,న్యూస్ సిఇఓ డెబోరా టర్నెస్‌కూడా పదవిని వదులుకున్నారు. ఆదివారంరాత్రి పొద్దుపోయాక వీరిద్దరు రాజీనామాలుచేశారు.ట్రంప్ వారిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ట్రంప్ ప్రసంగాన్ని సవరించిన తీరుతెన్నులపై పలువురు విమర్శలు చేయడంతో టిమ్ డేవి డైరెక్టర్ జనరల్ పదవిని వదులుకోవాల్సి వచ్చింది. టిమ్ డేవి, టర్నెస్ ఇద్దరూ సంస్థను వదిలివెళ్ళాలని నిర్ణయించుకున్నారని బిబిసి ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ తప్పులపై బిబిసి అధ్యక్షుడు సమీర్ షా సోమవారంనాడు పార్లమెంటరీ కమిటీకి లిఖితపూర్వకంగా క్షమాపణలు తెలియజేస్తారని భావిస్తున్నారు. దీనికి సంబంధించి బయటకు పొక్కిన బిబిసి మెమోను టెలిగ్రాఫ్ పత్రికల ప్రచురించింది.''మొత్తంమీద బిబిసి చాలా బాగా పనిచేస్తూ ఉంటుంది, కానీ తప్పులు జరిగాయి, ఈ తప్పులకు నేను బాధ్యత వహిస్తున్నాను, నా తర్వాతఈపదవిలోకి వచ్చేవారు మరింత బాధ్యతాయుతంగా, విజయవంతంగా పనిచేస్తారని ఆశిస్తున్నా'' అని టిమ్ డేవి బోర్డుకు రాసిన లేఖలో పేర్కొన్నారు.వ్యవస్థాగతంగాబిబిసివార్తల్లో ఎలాంటి వివక్షా లేదని పేర్కొన్నారు. టిమ్ డేవి ఇరవై సంవత్సరాలుగా బిబిసిలో పనిచేస్తున్నారు. ఏడు సంవత్సరాలు ఆయన బిబిసి స్టూడియోస్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. గతంలో వాషింగ్టన్‌లోని యు. ఎస్ క్యాపిటల్ హిల్‌పై ట్రంప్ అనుచరులు వందల మంది దాడి చేశారు. అల్లర్లకు పాల్పడ్డారు. ఈ దాడికి ముందుగా 2021 జనవరి 6న ఆనాటికి అధ్యక్ష పదవిలో ఉన్న ట్రంప్ తన అనేచరులను, అభిమానులు,పార్టీకార్యకర్తలను ఉద్దేశించి ప్రసం గం చేశారు. ఆ ప్రసంగాన్ని టిమ్ డేవి, డెబోరా టర్నెస్‌లు ఎడిట్ చేశారు. శాంతియుతంగా నిరసనతెలియజేయాలనిట్రంప్ విజ్ఞప్తి చేసిన భాగాన్ని ప్రసంగం నుండి వారు తొలగించారన్నది ప్రధాన అభియోగం. బ్రిటన్ ప్రభుత్వ నిధులతో పనిచేసే జాతీయ ప్రసార సంస్థ ఈ విషయంలో విమర్శలకు గురైంది. ఐతే ఐదేళ్ళ తర్వాత ట్రంప్ రెండో విడత అధికారంలోకి వచ్చాక వారు పదవులు కోల్పోయారు.

### రోహింగ్యాల వలస బోటు బోల్తా
## ఏడుగురు మృతి : 50 మంది గల్లంతు



**కౌలాలంపూర్:**ఎలాంటిఅధికారిక పత్రాలు లేకుండా అక్రమంగా వలస వెళ్ళేందుకు ప్రయత్నిస్తుండగాథాయ్‌లాండ్–మలేసియా సరిహద్దు ప్రాంతంలో పడవ బోల్తా పడింది. ఐతే వీరిలో ఏడుగురు మరణించారు. 13 మందిని గస్తీ దళాలు కాపాడాయి. వీరిలో 11 మంది రోహింగ్యాలు, ఇద్దరు బంగ్లాదేశీయులు ఉన్నారు. సోమవారం సాయంత్రం నాటికి తెలిసిన సమాచారం ప్రకారం ఏడుగురు మరణించినట్లు ధృవీకరించారు. పడవలో ఇంకా 50 మంది ఉన్నారని అంచనా. వారి జాడ కనిపెట్టేందుకు వరుసగా రెండోరోజు సోమవారం కూడాప్రయత్నాలు కొనసాగుతున్నాయి. దాదాపు 256 చదరపు నాటికల్ మైళ్ల విస్తీర్ణం పరిధిలో గాలింపు కొనసాగుతున్నది. మయన్మార్‌లోని రాఖైన్ రాష్ట్రం నుండి ఒక సమూహంగా 300 మంది పెద్ద సడవలో వలస మార్గంలో బయలుదేరారు. తర్వాత వారంతా చిన్న చిన్న పడలలోకి మారారు. వారిలో ఎక్కువమంది రోహింగ్యాలే. వీరంతా మయన్మార్ నుండి రెండు వారాల క్రితం బయలుదేరారు.ఇందులోని ఒక పడవలో 70 మంది ప్రయాణిస్తుండగా రిసార్టు ప్రాంతంలంకావీ దీవిలో బోల్తా పడటంతో అనేక మంది గల్లంతు అయ్యారని మలేసియా తీరప్రాంత గస్తీ దళాలు చెబుతున్నాయి. మిగిలిన పడవలకోసం కూడా గాలిస్తున్నారు. మయన్మార్‌లో రోహింగ్యాలు తీవ్ర అణచివేతకు గురవుతున్నారు. 2017 ఆగస్టు నుండి రోహింగ్యాలను మయన్మార్ తరిమి కొడుతున్నది. వీరిలో లక్షలాదిమంది బంగ్లాదేశ్‌లో ఆశ్రయం పొందుతున్నారు. మయన్మార్ ప్రభుత్వం పౌరసత్వాన్ని తిరస్కరించడంతో వివక్ష తట్టుకోలేక రోహింగ్యాలు అక్రమ మార్గాలలో వలసలకు పాల్పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారు.

## పాత విధానంతోనే మస్టర్లు
(మొదటి పేజీ తరువాయి)

కె.సారయ్య, కె.వీరభద్రయ్య, వైవి రావు, ముస్కే సమ్మయ్య, మడ్డి ఎల్లా గౌడ్ కేంద్ర కార్యదర్శులు అక్బర్ అలీ వంగ వెంకట్ పాల్గొన్నారు. సమావేశంలో అంగీకరించిన అంశాలు ఈ విధంగా ఉన్నాయి. హైదరాబాదులో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఏర్పాటుకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయినందున త్వరలోనే సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభిస్తారు. అలాగే గోదావరిఖనిలో క్యాతలాబ్(గుండె జబ్బుల) హాస్పిటల్ కూడా వచ్చేనెలలోపు ప్రారంభిస్తామని తెలియజేశారు. బదిలీ వర్కర్లుగా అపాయింట్మెంట్ అవుతున్న ఉద్యోగులందరూ ఇకనుంచి జనరల్ అసిస్టెంట్ గ్రిగా నియమించబడతారు. పెరిక్స్ (అలవెన్స్)లపై పడే ఇన్‌కమ్ టాక్స్ నుయాజమాన్యమే భరించాలనే విషయాన్ని ప్రభుత్వ అనుమతి తీసుకుని పరిష్కరించుటకు ఒప్పుకున్నారు. మెడికల్ బోర్డును యధాతథంగా కొనసాగించుటకు నిర్ణయం తీసుకున్నారు. జేఎంఓ 62, ఫోర్‌మెన్ (మెకానికల్) 12, ఫోర్‌మెన్ (ఎలక్ట్రికల్) 41, సూపర్వైజర్ (సివిల్) 1, ఆఫీస్ సూపరిండెంట్ 4, స్టాఫ్ నర్స్ 86, జూనియర్ అకౌంటెంట్ 1లకు A1 గ్రేడ్ వారికే కాకుండా ఏ గ్రేడ్‌లో ఐదు సంవత్సరాల సర్వీస్ కలిగిన పై వారందరికీ రిక్రూట్మెంట్ ద్వారా ఆఫీసర్ క్యాడర్ E1 గ్రేడ్ ఇచ్చుటకు ఒప్పుకున్నారు. డెసిగ్నేషన్స్ మార్పు విషయమై మార్చ్ లోపల కోల్ ఇండియా కమిటీ రిపోర్ట్ ప్రకారము మార్చుటకు నిర్ణయం జరిగింది. మారుపేర్ల విషయమై ఒక్కొక్క కేసును విడివిడిగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. పర్సనల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు 9 మందికి రిక్రూట్మెంట్ ద్వారా ఆఫీసర్ క్యాడర్ E1 గ్రేడ్ ఇచ్చుటకు అంగీకరించారు. అన్ని గనులలో కార్మికులకు కప్ బోర్డ్లు మరియు లాకర్స్ ఏర్పాటు చేయుటకు సర్క్యులర్ జారీ చేస్తారు. 1000లోపు పెన్షన్ పొందుతున్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ అయిన 2016 రూపాయలను ఇప్పించుటకు నిర్ణయం తీసుకోవడం జరిగింది.

## భారీ పేలుడు
(మొదటి పేజీ తరువాయి)

చంటిబిడ్డ రోడ్డుపై పడి ఉన్న దృశ్యం హృదయ విదారకంగా ఉంది. వెంటనే ఎనిమిది అగ్నిమాపకదళ బృందాలు రంగంలోకి దిగి రాత్రి 7.29 గంటల సమయానికి మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. ఆరు కార్లు, రెండు ఇ–రిక్షాలు, ఒక ఆటోరిక్షా మంటల్లో దగ్ధమయ్యాయి. ఘటన వార్త తెలిసిన వెంటనే జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్‌ఐఎ రంగంలోకి దిగింది. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. కొద్ది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఐటిఓ వరకూ ఈ పేలుడు శబ్దం వినిపించింది.

**అది స్విఫ్ట్ కారే, అందులో ఏదో ఉంది.. ప్రత్యక్షసాక్షి కథనం**

''మెట్రో స్టేషన్ గేట్ నెంబర్–1 వద్ద పేలుడు సంభవించింది, ఈ పేలుడు ఉద్ధృతి చాలా తీవ్రంగా ఉంది, గాయపడినవారంతా తీవ్ర భయకంపితులైపోయారు'' అని ఢిల్లీ అగ్నిమాపకదళం సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ధ్వంసమైన కార్ల లోంచి మంటలు ఎగసిపడటం పేలుడు తీవ్రతను చాటి చెబుతున్నది. పెద్ద పెద్ద శబ్దాలతో సమీపంలో ఉన్న కార్లన్నీ ధ్వంసమయ్యాయి. నుదుటి మీద తీవ్రంగా గాయపడిన ఒక ప్రత్యక్షసాక్షి కథనం ప్రకారం, ఒక కారు నుండే ఈ పేలుడు సంభవించిందని, బహుశా అది స్విఫ్ట్ కారు అయ్యి ఉండవచ్చుననీ చెప్పారు, ''నా ఆటో ఎదురుగా ఒక స్విఫ్ట్ కారు పార్కింగ్ చేసి ఉంది, ఆ కారులో ఏదో ఉంది, ఆకస్మికంగా ఆ కారు పేలిపోయింది'' అని ఆయన చెప్పారు. ''నేను గురుద్వారలో ఉన్నాను, ఒక శక్తిమంతమైన శబ్దం నాకు వినిపించింది, కానీ అదేమిటో నేను ధృవీకరించుకోలేకపోయాను, కానీ అది చాలా పెద్ద శబ్దం, మాకు దగ్గరగా ఉన్న అనేక వాహనాలు ధ్వంసం అయ్యాయి'' అని మరో ప్రత్యక్షసాక్షి చెప్పారు. చాందినీ చౌక్ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజయ్ భార్గవ్ ఈ ఘటనపై స్పందిస్తూ, పేలుడు జరిగిన ప్రదేశానికి తమ దుకాణం 800 మీటర్ల సమీపంలోనే ఉందని చెప్పారు. తమ దుకాణ భవనం పేలుడు శబ్దంతో దద్దరిల్లిపోయిందన్నారు. ఈ పేలుడుతో మార్కెట్‌లో తీవ్ర గందరగోళ పరిస్థితులు తలెత్తాయన్నారు. ఈ శబ్దం విని మార్కెట్‌లో ఉన్న ప్రజలు పరుగులు తీయడం ప్రారంభించారన్నారు.



## అమెరికా ప్రాతినిధ్యం లేకుండా కాప్–30 సమావేశాలు ప్రారంభం




**బెలెం:** బ్రెజిల్ అమెజాన్ ప్రాంతం బెలెంలో ఈనెల 21వ తేదీ వరకూ జరిగే కాప్–30 సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఈ ఏడాది అమెరికా ప్రతినిధులు ఈ సమావేశాలలో పాల్గొనడంలేదు. భూతాపాన్ని నియంత్రించేందుకు 30 సంవత్సరాలుగా పోరాడుతున్నప్పటికీ ఎలాంటి ఫలితాలు రాకపోవడంపై సదస్సులో పాల్గొనే దేశాలు ముఖ్యంగా బ్రెజిల్, భారత్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు వాతావరణ నియంత్రణ చర్యలు తీసుకోవడానికి గ్లోబల్ ఫండ్ సమకూర్చే అంశంపై కూడా ఈసారి ఎక్కువగా చర్చలు జరుగుతాయి. శరవేగంగా కార్యాచరణతోపాటు చర్యలు తీసుకోవడం,మరింత ఐక్యంగా ముందుకు సాగడం ఈ ఏడాది చర్చల్లో ప్రధానాంశాలు. ఐతే ఈ చర్చలలో అమెరికా భాగస్వామ్యం కావడంలేదు.

ఈ ఏడాది కాప్–30 సదస్సుకు ఆంద్రీ కొరియా డీ లాగో అధ్యక్షత వహిస్తున్నారు. ట్రంప్ పాలనాయంత్రాంగం ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు ఉన్నతస్థాయీ ప్రతినిధి బృందాన్ని పంపలేదు. దీనిపట్ల డీ లాగో విచారం వ్యక్తం చేశారు. అసలు చెప్పాలంటే ప్రపంచంలో అమెరికా దేశమే వాతావరణంలోకి అత్యధికంగా కాలుష్య వాయువులను ప్రసరింపజేస్తోంది. విపరీతమైన వేడిని వాతావరణంలోకి వదులుతోంది. కార్బన్ కాలుష్యం వాతావరణంలోకి ప్రవేశపెట్టడంలో చైనా ఇప్పుడు మొదటిస్థానంలో ఉంది. ఐతే గడచిన 100 సంవత్సరాలుగా వాతావరణంలో కార్బన్‌డయాక్సైడ్ పోగుపడి ఉంది. ఇందులో అత్యధికభాగం అమెరికా నుండి వచ్చినదే అని ఆయన అన్నారు. ఈ ఏడాది సమావేశాల్లో ప్రతినిధులు గ్రూపులుగా ఏర్పడి ఉమ్మడి ఆలోచనల కృషి చేస్తారు. దీనిని బ్రెజిలియన్ భాషలో ''మితిరావు'' అని పిలుస్తున్నారు.

**లావోస్ మహిళకు క్లైమేట్ యాక్షన్ అవార్డు**

వాతావరణ మార్పుల నియంత్రణలో కార్యాచరణకు కృత్రిమ మేథను విస్తారంగా ఉపయోగించే విషయంపై సదస్సులో సోమవారం సాయంత్రం చర్చ జరిగింది. అతి తక్కువస్థాయిలో అభివృద్ధ చెందే దేశాలు, చిన్న చిన్న దీవులు, ప్రత్యేక ప్రాంతాలలో కృత్రిమ మేథను విస్తారంగా ఉపయోగిస్తారు. ఈ ఏడాది ఈ సదస్సులో వాతావరణ సమస్య పరిష్కారానికి ఉద్దేశించిన నవీన ఆవిష్కరణల విభాగంలో 600 మంది ఆవిష్కర్తలు పాల్గొన్నారు. వీరిలో లావోస్ పిడిఆర్‌కు చెందిన లీసా లువాంగ్‌రాత్ 2025 క్లైమేట్ యాక్షన్ అవార్డు విజేతగా నిలిచారు. రైతులకు నీటి లభ్యతను సమకూర్చి నీటి సరఫరాను పర్యవేక్షించడంతో స్మార్ట్ ఫార్మింగ్ కార్యకలాపాలను నిర్వహించడంలో ఆమె సమకూర్చిన ఎఐ డెవైజ్ ఎంతగానో దోహదం చేస్తుంది. రెండు రోజులపాటు జరిగే కాప్–30 సదస్సులోని అన్ని విభాగాలలో లువాంగ్‌రాత్ పాల్గొంటారు. ఐక్యరాజ్యసమితి ఎఫ్‌సిసిసి టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ కమిటీ, క్లైమేట్ టెక్నాలజీ అండ్ నెట్‌వర్క్, కొరియా ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ ఏజన్సీ భాగస్వామ్యంతో, బ్రెజిల్, ఎంట్రప్రైజ్ న్యూరోసిస్టమ్‌ల సహకారంతో ఈ ఏడాది క్రైమేట్ యాక్షన్ కమిటీ అవార్డును నిర్వహిస్తున్నారు.

## అందెశ్రీ అస్తమయం
(మొదటి పేజీ తరువాయి)

వైద్యున్ని సంప్రదించలేదని, నెల రోజుల నుంచి బిపి మాత్రలు వేసుకోలేదని డాక్టర్ సింధూర వెల్లడించారు. అందెశ్రీ మృతి పట్ల ప్రధాని మోదీ, రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు ప్రముఖులు, సాహితీవేత్తలు, మాజీ ముఖ్యమంత్రులు, మంత్రులు, రాజకీయ పార్టీల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందెశ్రీ మరణం తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటని వారు విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అందెశ్రీ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

**నేడు అంత్యక్రియలు**

అందెశ్రీ అంత్యక్రియలు మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం ఎన్ఎఫ్‌సి నగర్‌లో మంగళవారం జరగనున్నాయి. అందెశ్రీ అంత్యక్రియలను పూర్తి ప్రభుత్వ అధికార లాంఛనాలతో నిర్వహించాలని, ఈ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. అంత్యక్రియలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరుకానున్నారు.

**జీవిత సంగ్రహం**

అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. ఆయన 1961 జులై 18న సిద్దిపేట జిల్లా రేబర్తిలో జన్మించారు. గొర్రెల కాపరిగా జీవన ప్రస్థా నం ప్రారంభించారు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేశారు. పాఠశాల చదువు లేకుండానే కవిగా రాణించారు. అందెశ్రీ తన పాటలు, రచనలతో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఉద్యమ సమయంలో ఆయన గీతాలు ప్రజల్లో స్ఫూర్తిని రగిలించాయి. 'మాయమైపోతున్నడమ్మా' గీతంతో విస్తృత ప్రజాదరణ పొందారు. ఈ పాట ఆయనకు విస్తృతమైన కీర్తిని తెచ్చిపెట్టింది. కాకతీయ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అందెశ్రీ కలం నుంచి జాలువారిన 'జయ జయహే తెలంగాణ'ను తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం 'రాష్ట్ర గీతం'గా గుర్తించింది. ఆయనకు ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రూ.కోటి పురస్కారం అందించింది.

**అందుకున్న పురస్కారాలు**

ఎటువంటి పాఠశాల విద్య అభ్యసించకుండా, కేవలం తన ప్రతిభతోనే గొప్ప కవిగా అందెశ్రీ పేరు తెచ్చుకున్నారు. ఆశు కవిత్వం చెప్పడంలో అందెశ్రీ దిట్ట. 2006లో గంగ సినిమాకు ఆయనకు నంది పురస్కారం లభించింది. 2014లో అకాడమి ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్ డాక్టరేట్ వరించింది. 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం అందుకున్నారు. 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారం లభించింది. అందెశ్రీ లోకానాయక్ పురస్కారాన్ని అందుకున్నారు.

**తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలింది: సిఎం రేవంత్**

అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందని సిఎం పేర్కొన్నారు. రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ' రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జయ జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందన్నారు. అందెశ్రీ తో కలిసి పంచుకున్న ఆలోచనలు, ఆయనతో తనకున్న అనుబంధాన్ని సిఎం గుర్తు చేసుకున్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర గీతం కొత్త స్వరాలతో రూపకల్పన చేసుకున్నామన్నారు. తెలంగాణ సాహితీ శిఖరం నేలకూలిందంటూ సిఎం సంతాపం తెలిపారు. స్వరాష్ట్ర సాధనలో, జాతిని జాగృతం చేయడంలో ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచి ఉంటుందన్నారు. ఈ విషాద సమయంలో అందెశ్రీ కుటుంబ సభ్యులకు సీఎం రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**అందెశ్రీ మరణ వార్త దిగ్భ్రాంతిని కలిగించింది: ఎపి సిఎం చంద్రబాబు**

అందెశ్రీ మృతి పట్ల ఎపి సిఎం చంద్రబాబు సంతాపం వ్యక్తం చేశారు. 'ప్రముఖ కవి, రచయిత, తెలంగాణకు రాష్ట్ర గీతాన్ని అందించిన డాక్టర్ అందెశ్రీ మరణ వార్త దిగ్భ్రాంతి కలిగించింది. తెలుగు సాహితీ లోకానికి ఇది తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ అందెశ్రీ కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని సిఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

**సాహితీ వనంలో మహావటవృక్షం కూలింది: భట్టి విక్రమార్క**

అందెశ్రీ మరణం సాహితీ వనంలో మహావటవృక్షం కూలిందని, ఆయన మృతికి డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. అందెశ్రీ ఆకస్మిక మృతి తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని ఆయన అన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన రచించిన జయజయహే తెలంగాణ గీతం జాతి గొంతుకై అందరిని ఒక్కతాటి మీదకు తీసుకువచ్చిందన్నారు.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కెసిఆర్**

అందెశ్రీ మృతి పట్ల మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్ రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధన సాంస్కృతిక ఉద్యమంలో అందెశ్రీ క్రియాశీల పాత్ర పోషించారని కొనియాడారు. తన పాటలతో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని పేర్కొన్నారు. అందెశ్రీ మృతిపట్ల భారత రాష్ట్ర సమితి నేతలు కేటీఆర్, హరీశ్రవు సంతాపం వ్యక్తం చేశారు.

## రంగం సిద్ధం
(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో నాలుగు ఈవిఎంలను ఏర్పాటు చేశారు. 3 వేల మంది పోలింగ్ సిబ్బంది, 2 వేల మంది పోలీసులతో కలిపి మొత్తం 5 వేల మంది పోలీసులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల విధుల్లో ఉన్నారు. మొత్తం 407 పోలింగ్ కేంద్రాల్లో 226 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు. 103 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో భద్రత కట్టుదిట్టం చేశారు. 45 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 230 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశారు. ఎంసిసి నిబంధనలు అతిక్రమించిన 27 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇప్పటి వరకు రూ.3,60,50,952 నగదును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. జూబ్లీహిల్స్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉపఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్, బిఆర్ఎస్ నుంచి మాగంటి గోపినాథ్ భార్య మాగంటి సునీత, బిజెపి అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి ఈ ఎన్నికలో తలపడుతున్నారు. ఈ మూడు ప్రధాన పార్టీలు ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అగ్రనాయకుల ప్రచారంతో సవాళ్లు ప్రతిసవాళ్లతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రాజకీయం హీటెక్కింది. ఎలాగైన ఉప ఎన్నికలో గెలవాలని కాంగ్రెస్, బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీలు తీవ్రంగా శ్రమించాయి. మరి జూబ్లీహిల్స్ ప్రజలు ఎవరికి పట్టం కట్టనున్నారో చూడాల్సిందే.

**డ్రోన్‌లతో పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ : జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్**

ఈసారి డ్రోన్‌ల ద్వారా పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణ జరుపతామని జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ వెల్లడించారు. అంతకు ముందు ఆయన పోలీసు అధికారులతో కలిసి డ్రోన్‌ల పని తీరును పరిశీలించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డ్రోన్‌లతో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎప్పటికప్పుడు వేగవంతంగా చర్యలు తీసుకునేందుకు డ్రోన్‌లతో ఏర్పాటు చేసే నిఘా ఉపయోగపడుతుందని చెప్పారు. నగర పోలీసులతో పాటు అదనంగా కేంద్ర బలగాల సేవలను కూడా ఎన్నికల బందోబస్తుకు వినియోగిస్తున్నట్లు కర్ణన్ చెప్పారు. కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో పోలింగ్ సామాగ్రి పంపిణీ ప్రక్రియ జరిగిందన్నారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లకు తరలివెళ్లారని చెప్పారు. ఎలాంటి ఇబ్బంది ఎదురైన వెంటనే పరిష్కరించేందుకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేశామని కర్ణన్ చెప్పారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 5,536 క్వింటాళ్ల సిఎంఆర్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని ముడిమానిక్ గ్రామంలోని విజయ దుర్గా ఆగ్రో ఇండస్ట్రీస్‌లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రబీ సీజన్‌కు సంబంధించిన దాదాపు 5,536.800 క్వింటాళ్ల సిఎంఆర్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 13,842 బ్యాగుల స్టాక్ తక్కువగా ఉందని గమనించారు. దీని విలువ రూ.1,28,45, 376. మిల్లర్‌పై తదుపరి చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా పౌర సరఫరాల శాఖకు విజిలెన్స్ అధికారులు సిఫారసు చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న నిధుల దుర్వినియోగాన్ని నివారించడానికి విజిలెన్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కట్టుబడి ఉందని విజిలెన్స్ డిజి శిఖాగోయల్ తెలిపారు.

## బ్యాంకులను ప్రైవేటీకరించే దేశ ద్రోహులను వదిలిపెట్టం

ప్రజలతో కలిసి బలమైన పోరాటాలు నిర్మిస్తాం

కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వివిఎస్ బోస్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిజెపి ప్రభుత్వం, కార్పొరేట్ అనుకూల శక్తులు, అమెరికా అడుగులకు మడుగులొత్తేవారు జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరణ చేస్తామంటే దేశ ప్రజలు చూస్తూ ఊరుకోరని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వివిఎస్ బోస్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్‌లో మీడియాతో సోమవారం మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయీకరణ కాలంలో నాటి పోరాటాలను తిరిగి నిర్మిస్తుందని, నాటి త్యాగధనుల స్ఫూర్తితో బ్యాంకుల ప్రైవేటీకరణను అడ్డుకోవటానికి అవసరమైన త్యాగాలతో కూడిన పోరాటాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు. ప్రజా ధనాన్ని ద్రోహుల నుండి కాపాడటానికి చేసిన పోరాటమే నిజమైన దేశభక్తి అని సూచించారు. అసలైన దేశ భక్తి అంటే ఏమిటో చూపిస్తామని అన్నారు. బ్యాంకుల ప్రైవేటీకరణ ఆపండి లేకపోతే ప్రజల తిరుగుబాటును ఎదుర్కోవటానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. దేశానికి స్వాతంత్ర్యం 1947లో వచ్చింది. బ్యాంకుల జాతీయీకరణ 1969లో జరిగిందని, ఈ మధ్య కాలంలో బ్యాంకులలో ప్రజలు దాచుకున్న డబ్బులకు లెక్కాపత్రం లేకుండా అక్రమంగా మింగేసిన దుర్మార్గుల నుండి ప్రజా ధనాన్ని రక్షించాలనే మహత్తరమైన ఉద్దేశంతో భారత కమ్యూనిస్టు పార్టీ బ్యాంకులను జాతీయం చేయాలని నినాదంతో ఉద్యమం చేపట్టిందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.యస్.బోస్ గుర్తు చేశారు. దేశంలోని కార్మిక సంఘాలను, బ్యాంకు ఉద్యోగులను, అభ్యుదయ వాదులను కలుపుకొని అనేక పోరాటాలు చేసిన ఫలితమే 1969లో నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ బ్యాంకులను జాతీయం చేసిందని ఆయన అన్నారు. ఆనాటి జాతీయీకరణ విధానం జీర్ణించుకోలేని కొంత మంది దుర్మార్గులు నాటి నుండి "గోతికాడ నక్క లాగ" కాచుకొని నేడు జాతీయ బ్యాంకులను ప్రైవేటీకరణ చేస్తామని చెప్పటం తీవ్రమైన దేశ ద్రోహ చర్యని ఆయన అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ మన దేశంలో నేడు పటిష్టంగా ఉందన్నా, 2008లో ప్రపంచంలో ఆర్థిక మాన్యం ఏర్పడినపుడు మన దేశంలో ఏలాంటి సంక్షోభం లేకుండా నిలబడిరదన్నా దానికి కారణం మన జాతీయ బ్యాంకులు అనేది తిరుగులేని వాస్తవమన్నారు. ప్రజలు బ్యాం కులలో దాచుకున్న వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన ప్రజా ద్రోహులను ఏమీ చేయటం చేతగానీ ప్రభుత్వం, అలాంటి వారి మేలు కోసమే బ్యాంకులను ప్రైవేటుపరం చేయడానికి చూస్తుందన్నారు. జాతీయ బ్యాంకులంటే ప్రజా బ్యాంకులు కాబట్టి ప్రజలు ఇలాంటి ప్రజా వ్యతిరేక చర్యలను ఏకకంఠంతో ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యంలో ఎలాంటి పాత్రలేనివారు, బ్రిటీష్ పాలనలో ఉన్న బ్యాంకింగ్ వ్యవస్థను మరల మన దేశంలో తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ప్రజా బ్యాంకులను ప్రైవేటువారికి అప్పచెపుతూ ప్రజలను మోసం చేస్తూ ప్రజా ద్రోహానికి పాలకులు పాల్పడుతున్నారు. బ్యాంకులలో ప్రైవేటు బ్యాంకు కానీ, ప్రజా బ్యాంక్ కానీ ఉండే డబ్బు ప్రజలదనేది అందరు అర్థం చేసుకోవాలన్నారు. 'ప్రజాధనం ప్రజల కోసమే కార్పొరేట్ దొంగల కోసం కాదు' అనే నినాదాన్ని వాస్తవ రూపంలోకి తీసుకువస్తాం అని హెచ్చరించారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ఎస్‌టియు కౌన్సిల్ సమావేశం




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలకు కట్టుబడి పిఆర్‌సి పట్ల సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎస్‌టియు టియస్ రాష్ట్ర అధ్యక్షులు బీమనాధుని రవి, ప్రధాన కార్యదర్శి జి.సదానందం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్, కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో రెండురోజుల పాటు ఎస్‌టియు వార్షిక కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఆర్‌సి గడువు ముగిసి రెండేళ్లయిందని, ఇప్పటికైనా సిఎం చొరవ తీసుకుని 50 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే సిపిఎస్‌ను రద్దు చేశాయని చెబుతూ, మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరు ద్ధరించాలన్నారు. ఉద్యోగుల హక్కులకు భంగం కలగకుండా చూసే బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. పెండింగ్ బిల్లుల క్లియరెన్స్‌లో ఆర్థికశాఖ అలసత్వం సరికాదని, ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ రూపొందించి, ఎంఇఒ, డిప్యూటీ ఇఒ, డైట్ లెక్చరర్ పోస్టులకు పదోన్నతులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ఉద్యోగులంతా ప్రభుత్వానికి సహకరిస్తున్నారని, ప్రభుత్వం అదే రీతిలో ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన ప్రయోజనాలు ఇంకా అందకపోవడంతో పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కెజిబివి, ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా హెల్త్ కార్డులు, గురుకుల, కెజిబివి, ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అదనపు కలెక్టర్లను జిల్లా విద్యాశాఖ అధికారులుగా నియమించడాన్ని ఎస్‌టియు వ్యతిరేకిస్తున్నదని, జిపిఎఫ్, సిపిఎస్ ఖాతాలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్, కొత్త జిల్లాల్లో గ్రూప్ ఇన్సూరెన్స్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ కార్యదర్శి ప్రత్యేక సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర నాయకులు అట సదయ్య, జుట్టు గజేందర్, ఎ.వి.సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, హన్మంత్ రెడ్డి, రాధ జయలక్ష్మి, శీతల్ చౌహాన్, రంగారావు, అన్ని జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

### ఎస్‌టియు నూతన అధ్యక్షునిగా సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా జట్టు గజేందర్





ఎస్‌టియు కౌన్సిల్ సమావేశంలో 2026–2027 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పూర్వ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జగన్మోహన్ రావు, సీనియర్ నాయకులు పున్న గణేష్, మోదిని శ్రీశైలం, వహిదుల్లా ఉస్సేని వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు జి.సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా జట్టు గజేందర్ (నిర్మల్), ఆర్థిక కార్యదర్శిగా సయ్యద్ సాబేర్ అలీ (సంగారెడ్డి)తో పాటు వివిధ జిల్లాల నుండి 8 రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు, 16 ఉపాధ్యక్షులు, 8 అదనపు ప్రధాన కార్యదర్శులు, 16 కార్యదర్శులు, 8 ఆర్థిక కమిటీ సభ్యులను కౌన్సిల్ ఎన్నుకున్నది.

## అజారుద్దీన్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర మైనార్టీ, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ మంత్రిగా మహ్మద్ అజారుద్దీన్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలోని తన ఛాంబర్‌లో తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఫకీర్ రిహబిలిటేషన్ దస్త్రంపై ఆయన తొలి సంతకం చేశారు. అనంతరం అజారుద్దీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. సిఎం రేవంత్ రెడ్డికి అజారుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్‌కు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మ ణ్, వాకిటి శ్రీహరితో పాటు పలువురు మంత్రులు, కాంగ్రెస్ నాయకులు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా గత నెల 31న అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. అనంతరం నవంబర్ 4న అజారుద్దీన్‌కు శాఖలను కేటాయించారు.



## టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించిన కేంద్ర మంత్రి బండి

కలెక్టర్లకు చెక్కులు అందజేసిన బిజెపి జిల్లాల నేతలు



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సోమవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ పరీక్ష ఫీజు చెల్లించారు. ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 12 వేల మంది విద్యార్థులు పదవ తరగతి చదువుకుంటున్నారు. వీరిలో కరీంనగర్ జిల్లాలో 4363, సిరిసిల్ల జిల్లాలో 3948, సిద్దిపేట జిల్లాలో 1013, జగిత్యాల జిల్లాలో 1434, హన్మకొండ జిల్లాలో 690 మంది విద్యార్థులున్నారు. వీరందరి పక్షాన పరీక్ష ఫీజు మొత్తాన్ని బండి సంజయ్ చెల్లించారు. కేంద్ర మంత్రి తరపున కరీంనగర్ జిల్లాలో చదివే విద్యార్థులు పరీక్ష ఫీజు మొత్తాన్ని బిజెపి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బోయినపల్లి ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి చెక్ రూపంలో అందజేశారు. సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆద్వర్యంలో కలెక్టర్ గరీమా అగర్వాల్‌ను కలిసి చెక్ అందజేశారు. సిద్దిపేట జిల్లా విద్యార్థుల పక్షాన బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జగిత్యాల, హనుమకొండ జిల్లాల విద్యార్థుల పక్షాన ఆయా జిల్లాల బిజెపి నేతలు కలెక్టర్లను కలిసి పరీక్ష ఫీజు మొత్తాన్ని చెక్ రూపంలో అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా దారిద్రరేఖకు దిగువన ఉన్న వారే కావడం, వారిలో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్ష ఫీజు సైతం చెల్లించలేకపోతున్నారని తెలుసుకున్నా బండి సంజయ్ ఈ మేరకు తన వేతనం నుంచి ఆ మొత్తాన్ని చెల్లిస్తానని ఇటీవల ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారు. అనుకున్నట్లుగా ఆ మొత్తాన్ని చెక్ రూపంలో అందజేశారు. అతి త్వరలోనే మోదీ గిఫ్ట్ పేరుతో సర్కారీ స్కూళ్లలో 9వ తరగతి చదువుకునే విద్యార్థులకు సైతం సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో మోదీ కిట్స్ పేరుతో 1 నుంచి 6వ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగ్, నోట్ బుక్స్, జామెట్రీ బాక్స్, పెన్ను, పెన్సిళ్లు, స్టీల్ వాటర్ బాటిల్‌ను పంపిణీ చేయనున్నట్లు ఇప్పటికే బండి సంజయ్ ప్రకటించిన విషయం తెలిసిందే.

## భోజనం వికటించి విద్యార్థినులకు అస్వస్థత



**ప్రజాపక్షం/జమ్మికుంట :** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 17 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. పిల్లలకు వాంతులు, కడుపునొప్పి వస్తుందని తెలపడంతో గమనించిన ఉపాధ్యాయులు జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పిల్లలకు వైద్య పరీక్షలు చేసిన వైద్యు లు ఎలాంటి ప్రమాదం లేదని, పూర్తిస్థాయిలో కోలుకునే వరకు వైద్యం అందిస్తామని తెలిపారు. మధ్యాహ్న భోజనం సమయంలో కోడిగుడ్లు తిన్న తర్వాత వాంతులు వస్తున్నట్లు కొంత మంది ఉపాధ్యాయులకు తెలిపారు. ఒకేసారి పిల్లలందరూ వాంతులు కడుపునొప్పి వస్తుందని తెలపడంతో హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే మధ్యాహ్న భోజనం వికటించి పిల్లలందరికీ ఈ పరిస్థితి ఏర్పడిందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు హడావుడి చేసి వెళ్లే అధికారులు తిరిగి పాఠశాల వైపు చూడడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు జమ్మికుంట బాలికల పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలుసుకున్న కేంద్రమంత్రి బండి సంజయ్ కలెక్టర్‌తో మాట్లాడి పిల్లల పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం కోసం అవసరమైతే కరీంనగర్ ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మాజీ మంత్రి, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ జరిగిన సంఘటనపై ఆరా తీసి అస్వస్థతకు గురైన పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జరిగిన సంఘటనపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం ఇంత అధ్వాన్నంగా ఉంటే ఎలా? అని ప్రశ్నించారు. రోజుకో సంఘటన జరుగుతున్నా ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాసుపత్రి వద్ద పిల్లల పరిస్థితిపై విద్యార్థి సంఘ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆరా తీశారు. విద్యార్థినులు అందరూ కోలుకోవడంతో సాయంత్రం డిశ్చార్జి చేసినట్లు జమ్మికుంట ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

## సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలు

మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సున్నితమైన పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర బలగాలను పెట్టాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. మహిళా పోలీస్ అధికారులను, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లను అక్కడ నియమించి లోపలికి వెళ్లే ఓటర్ల గుర్తింపు కార్డులను గుర్తించిన తర్వాతనే పోలింగ్ బూత్‌లోకి అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు హరీశ్ రావు నేతృత్వంలోని బిఆర్‌ఎస్‌కు చెందిన మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వి.శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, ఎంపి వద్దిరాజులతో కూడిన ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా ఫేక్ ఓటర్ ఐడీలను తయారు చేసిన విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్టు హరీశ్‌రావు వివరించారు. యూసుఫ్ గూడాలో కాంగ్రెస్ కార్యాలయాన్ని ఆనుకొని పోలింగ్ బూత్‌ను ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. అనేకసార్లు క్యాబినెట్ సమావేశం జరిగిందని, అసెంబ్లీ సమావేశాలు జరిగాయని, అయినా ఆరు గ్యారంటీలపై ఎప్పుడూ సమీక్ష చేయలేదన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఎన్నికల కమిషన్‌ను కోరారు.

## అందెశ్రీకి పలువురు ప్రముఖుల నివాళి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ రచయిత, కవి, అందెశ్రీకి రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, కవులు, కళాకారులు, సాహితీవేత్తలు, మేధావులు, ప్రజాసంఘాల నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. హైదరాబాద్ లాలాపేటలోని ఆయన నివాసం సమీపంలోని ప్రొఫెసర్ జయశంకర్ ఇండోర్ స్టేడియంలో సోమవారం అందెశ్రీ భౌతికకాయాన్ని వారు సందర్శించి పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు.

**సిపిఐ నేతల ఘన నివాళి**

ప్రొఫెసర్ జయశంకర్ ఇండోర్ స్టేడియంలో అందెశ్రీ భౌతిక కాయంపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, జాతీయ సీనియర్ నాయకులు చాడ వెంకట్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, కార్యవర్గ సభ్యులు మంద పవన్, ఆర్.అంజయ్య నాయక్, చంద్రశేఖర్, ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ్ తదితరులు పుష్పగుచ్ఛాలుంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ అందెశ్రీ మరణం తెలంగాణకు తీరని లోటన్నారు. సహజ కవి, చదువు లేకపోయినా జీవితాన్ని, సమాజాన్ని, మనుషులను అధ్యయనం చేసిన మనిషి అని కొనియాడారు. జయజయహే తెలంగాణ పాటను రాష్ట్ర గీతంగా గుర్తించారని, ఇలా అనేక పాటలు రాశారని, ఇప్పటికీ ఆ పాటలు జనం నోళ్లలో నానుతున్నాయన్నారు. గుండెపోటుతో మరణించడం ఆయన కుటుంబానికే కాకుండా యావత్ రాష్ట్రానికి శోకాన్ని మిగిల్చిందన్నారు. 'తెలంగాణ ఉద్యమం ఆట పాట మాటతో ప్రారంభమైంది. ఈ ఉద్యమంలో అందెశ్రీ రచించిన పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసారు' అని పల్లా వెంకట రెడ్డి అన్నారు. చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ అందెశ్రీ అంటే ఒక సాహితీ సంస్థ అన్నారు. చిన్నప్పటి నుంచి బడుగుబలహీన వర్గాల ఆకాంక్ష జ్యోతిగా ఉన్నారని, గొర్ల కాపరిగా, చదవులేకపోయినా సమాజాన్ని చదువుకున్నారని, 2012లో కళాకరులతో కలిసి మెలిసి చైతన్యం పెంపొందంచారని, ఆయన సాహితీ ఉద్యమానికి తీరని లోటు అన్నారు. అందెశ్రీ రాసిన జయజయహే పాటను కెసిఆర్ గుర్తించలేదని, సిఎం రేవంత్ రెడ్డి గుర్తించడం అరుదైన గౌరవం అన్నారు. అందెశ్రీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. అందె శ్రీ తెలంగాణ ఉద్యమానికి తన పాటలతో ఉత్తేజాన్ని కలిగించారని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం నివాళులు అర్పించారు. పల్లె నర్సింహ మాట్లాడుతూ అందెశ్రీ దూరం కావడం కళాకారులకు, రచయితలకు బాధకారమన్నారు. అందెశ్రీ రాసిన బొమ్మ చెక్కితే బొమ్మరా అనే పాటను తాము వేదికలపై ఆలాపించామని గుర్తుచేసుకున్నారు. 'మాయమై పోయాడమ్మా అందెశ్రీ, మరపురాని రూపమేనమ్మ అందెశ్రీ' అని పల్లె నరసింహ్ నివాలులు అర్పించారు. ప్రగతి శీల కవి, నంది అవార్డు గ్రహీత వామపక్షాల పక్షపాతి అందెశ్రీ అకాలమరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస రావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ తమ సంతాప సందేశంలో పేర్కొన్నారు.

**మంత్రులు, ప్రముఖుల శ్రద్ధాంజలి**

ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ భౌతికకాయాన్ని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్, వాకిటి శ్రీహరి, మాజీ గవర్నర్లు సిహెచ్. విద్యాసాగర్‌రావు, బండారు దత్తాత్రేయ, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాచమచంద్రారావు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రులు టి.హరీష్‌రావు, జి.జగదీష్‌రెడ్డి, ప్రజా కవి గోరటి వెంకన్న తదితరులు నివాళులు అర్పించారు.

**మాయమైపోయిన అందెశ్రీ : చాలా బాధాకరం: డాక్టర్ కె.నారాయణ**

'మాయామై పోతున్నడమ్మా మనసున్న మనిషి' ప్రముఖ విప్లవకవి వాగ్గేయకారుడు అందెశ్రీ మాయమై పోయాడు. చాలా బాధాకరం. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి అందెశ్రీ ఊపిరయ్యాడు. అందెశ్రీ వామపక్ష పక్షపాతి. నేను అభిమానించే ప్రముఖుడు. అందెశ్రీ అకాల మరణాన్ని తెలంగాణ ప్రజలు జీర్ణించుకోవడం కష్టతరమే. తెలంగాణ వేగుచుక్క రాలిపోవడం ప్రగతిశీల ఉద్యమాలకు, కళా ప్రపంచానికి తీరని లోటు' అని సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

**తెలంగాణ సాహితి దిగ్గజాన్ని కోల్పోయాం : టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్**

తెలంగాణ కవి, ఉద్యమకారులు, సాహితీవేత్త అందెశ్రీ మరణం తెలంగాణ కు తీరని లోటు అని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అని పేర్కొన్నారు. 'ఆయన ఆకస్మిక మరణం నన్ను తీవ్రంగా కలచివేసింది. తెలంగాణ సాహితి దిగ్గజాన్ని కోల్పోయామన్నారు. అందెశ్రీ మరణించినా అందెశ్రీ పాటకు మరణం లేదని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి అన్నారు.



**ప్రజల మట్టి మనిషి అందెశ్రీ: కోదండరామ్**

జయ జయహే తెలంగాణ పాట సృష్టికర్త ప్రజల మట్టి మనిషి ప్రజా గొంతుక రచయిత గాయకుడు అందెశ్రీ అని టిజెఎస్ తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం కొనియాడారు. అందెశ్రీ మరణం తెలంగాణ సమాజానికి తీరనిలోటని, తెలంగాణ ఆటపాట ఉన్నంతకాలం అందెశ్రీ ఉంటాడని, ఆయన అందించిన జయ జయహే తెలంగాణ పాట తెలంగాణ సమాజ రూపురేఖల్ని మార్చివేసిందని పేర్కొన్నారు.

**అందెశ్రీ కృషి చిరస్థాయిగా నిలుస్తుంది**

ప్రత్యేక రాష్ట్ర సాధనలో రచయిత అందెశ్రీ చేసిన కృషి చిరస్థాయిగా నిలిచే ఉంటుందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ధనసరి అనుసూయ సీతక్క, జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సంతాపాన్ని తెలిపారు. అందెశ్రీ తనకు అత్యంత ఆప్తుడని, ఆయన అకాల మరణం వ్యక్తిగతంగా తమను తీవ్రంగా కలచివేసిందని సంతాపాన్ని తెలియజేశారు. ఈ మేరకు మంత్రులు సంతాప సందేశాలను విడుదల చేశారు. అందెశ్రీ పాటలు ప్రస్తుత సమాజానికి యువతకు ఎంతో స్ఫూర్తి అని ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మలిదశ ఉద్యమ కెరటమై, రాష్ట్ర సాధన ఆకాంక్షను కోట్లాది ప్రజల గుండెల్లో బలంగా నిలిపిన చారిత్రక గీతాన్ని అందించిన మహనీయుడు 'అందెశ్రీ' అని మంత్రి శ్రీధర్‌బాబు కొనియాడారు. అందె శ్రీ అకాల మరణం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు అన్నారు. గొర్రెల కాపరిగా, భవన నిర్మాణ కూలీగా జీవితం మొదలుపెట్టిన అందెశ్రీ అక్షర యాత్ర చేశారని ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రజా వాగ్గేయకారుడు అందెశ్రీ ఆకస్మిక మరణం తెలంగాణ పల్లె పాటకు, ప్రజా గీతానికి తీరని లోటని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు జోహార్లు సమర్పించారు. పాటగా పుట్టి, పాటగా పెరిగి, బతుకంతా పాట కవిత్వమై జీవించిన అందెశ్రీకి జోహార్లు అని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ సంతాపాన్ని తెలిపారు. ఎపి మంత్రులు నారా లేకేష్, పార్థసారథి, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహా అధ్యక్షులు కాలేరు సురేష్ కూడా సంతాపాన్ని తెలిపారు.





**'అందె శ్రీకి' అరసం సంతాపం**

ఉద్యమసూర్యుడు అందెశ్రీ అస్తమించిన వార్త దిగ్భ్రాంతికి గురి చేసిందని, అందెశ్రీ నేటి కాలపు శ్రీశ్రీ అని ఆయన సాహిత్యం జనసాహిత్యమని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, సమన్వయ కార్యదర్శి కెవిఎల్, ఉపాధ్యక్షులు బొమ్మగాని నాగభూషణం, హైదరాబాద్ జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఎస్.సూర్య ప్రకాష్, గడ్డమీది చంద్రమోహన్ గౌడ్‌లు సంతాపాన్ని, ఆయన కుటుంబానికి సానుభూతిని తెలిపారు.

**'అందెశ్రీ మరణం పేద ప్రజలకు తీరనిలోటు: పశ్య పద్మ**

ప్రజా కవి అందెశ్రీ మరణం నిరుపేద ప్రజలకు తీరని లోటు అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ అన్నారు. బడుగు జీవుల జీవన స్థితిగతులల్లో మంచి మార్పులు రావాలని, అందుకు తాడిత పీడిత ప్రజలను చైతన్యవంతం చేయడానికి కలాన్ని, గళాన్ని ఆయుధంగా వినియోగించుకున్న ప్రజా కవి అందెశ్రీ అని కొనియాడారు. అందెశ్రీ భౌతికకాయంపై పశ్యపద్మ పూల మాలవేసి జోహార్లు అర్పించారు. పశ్యపద్మతో పాటు మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ సదాలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ ఛాయాదేవి, నాయకులు పుష్పా, ఫైమిద తదితరులు పూలమాలతో నివాళ్ళు అర్పించారు.

శ్రీ మల్లిఖార్జున స్వామి దేవస్థానము
గ్రా. & మం. ఐనవోలు, హనుమకొండ జిల్లా.
లేఖ నెం. SMSD/109/2025 | ఈ- టెండర్ వేలము ప్రకటన-2 | తేది: 05.11.2025
దేవాదాయ ధర్మాదాయ శాఖ, హనుమకొండ జిల్లా, గ్రా& మం: ఐనవోలు నందు వేంచేసియున్న శ్రీ మల్లికార్జునస్వామి వారి దేవస్థానము నందు 2026 సం॥రము జాతర సందర్భంగా వివిధ వేలములు ఈ-టెండర్ నిర్వహంచుటకు నిర్ణయించనైనది. ఈ-టెండర్స్‌లో పాల్గొన తలచిన వారు తేది: 10-11-2025 నుండి 17-11-2025 సా.5:30గం.ల వరకు ఆన్‌లైన్ http://www.tender.telangana.gov.in website నందు టెండర్ షెడ్యూల్స్ పొందగలరు. పూర్తి వివరముల కొరకు ఫోన్ నెం. 9866440753, 9652516722 సంప్రదించగలరు.
DIPR R.O. No. : 10417-PP/CL/ADVT/1/2025-26, Date: 10-11-2025 | సం/- కార్యనిర్వహణాధికారి



# జనరల్
STATE & REGIONAL NEWS

## జూబ్లీహిల్స్‌లో నకిలీ ఓటర్‌కార్డుల వీడియోలపై అధికారులు సీరియస్

### టొలిచౌక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో నకిలీ, డూప్లికేట్ ఓటర్ కార్డులు ఉన్నాయంటూ సోషల్ మీడియా వేదికలలో ప్రచారం అవుతున్న వీడియోలను ఎన్నికల అధికారులు గమనించారు. ప్రాథమిక పరిశీలనలో ఆ వీడియోల్లో కనిపిస్తున్న ఓటర్ కార్డులు పాత ఫార్మాట్‌లోని వర్టికల్ ఎపిక్ కార్డులు అని, ఆ కార్డులు గతంలో జారీ చేయబడ్డవని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా హారిజాంటల్ ఫార్మాట్‌లోని కొత్త ఎపిక్ కార్డులు జారీ అవుతున్నాయని తెలిపారు. ఈ వీడియోల ప్రచారం విషయంలో అధికారాలు సీరియస్‌గా తీసుకొని, టోలిచౌకి పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 219/2025 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ వీడియోల మూలం, వాటి ప్రచార ఉద్దేశం వంటి అంశాలపై పోలీసులు సమగ్ర విచారణ చేపడతారని సమాచారం. ఇదిలావుంటే, జిల్లా ఎన్నికల అధికారి ఏర్పాట్లను సమీక్షించారు.




## వెల్ఫేర్ బోర్డు నిధులు
# కార్మికుల సంక్షేమానికే వినియోగించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వెల్ఫేర్ బోర్డు నిధులు కార్మికుల సంక్షేమం కోసమే వినియోగించాలని భవన నిర్మాణ కార్మిక సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. భవన నిర్మాణ కార్మిక సంఘాల (జెఎసి) రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాల్లో జరిగింది. ఈ సమావేశానికి పంగూరు రాములు (సిఐటియు), పల్లా దేవేందర్ రెడ్డి (ఎఐటియుసి), సాంబశివుడు (టియుసిఐ), జి. అనూరాధ, జి. నాగయ్య (ఐఎఫ్‌టియు), చంద్రమౌళి (స్ఫూర్తి కార్మిక సంఘం), సాయికుమార్ (టిఎఫ్‌టియు), ఎం. ప్రవీణ్ కుమార్ (ఎఐటియుసి), విజయ్ (ఐఎఫ్‌టియు), వై. హన్మేష్ (టియుసిఐ) తదితరులు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. వక్తలుగా పాలడుగు భాస్కర్ (సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), ఎస్. బాల్‌రాజ్ (ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి), కె. సూర్యం (టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు), ఎం. శ్రీనివాస్ (ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి), కామెల్ల బలన్న (బిఎస్‌ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు), కుమార్ (స్ఫూర్తి సంఘం రాష్ట్ర అధ్యక్షులు), పరమాత్మచారి (హెచ్‌ఎంఎస్), గణేశ్ (బిఆర్‌టియు), కె. యాదగిరి, విష్ణువర్ధన్ రెడ్డి (సెంట్రింగ్ యూనియన్) పాల్గొన్నారు. సమావేశ ప్రారంభంలో ప్రముఖ కవి అందెశ్రీకి నివాళులు అర్పించారు. అనంతరం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని అన్ని సంఘాల నాయకులు ఏకగ్రీవంగా ఆమోదించారు. వెల్ఫేర్ బోర్డు నిధులు కార్మికుల సంక్షేమం కోసం మాత్రమే వినియోగించాలని తీర్మానాన్ని జెఎసి ఏకగ్రీవంగా ఆమోదించింది.

### సిఎస్‌సి హెల్త్ టెస్ట్‌ల పేరుతో రూ.500 కోట్లు దుబారా : ఎస్.బాల్‌రాజ్

ఎఐటియుసిరాష్ట్ర కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ మాట్లాడుతూ సిఎస్‌సి హెల్త్ టెస్ట్‌ల పేరుతో ప్రభుత్వం రూ.500 కోట్లు దుర్వినియోగం చేసిందని విమర్శించారు. కార్మికులపై బలవంతంగా టెస్ట్‌లు చేయిస్తున్నారని, టెస్ట్‌ల ఫలితాలు కూడా నకిలీగా తయారు చేస్తున్నారని మండిపడ్డారు. కార్మికుల శ్రమతో ఏర్పాడిన వెల్ఫేర్ ఫండ్‌ను అనేక రకాలుగా దుర్వినియోగం చేస్తున్నారని అలన్నారు. ఈ టెస్ట్‌లను వెంటనే రద్దు చేసి, బదులుగా కార్మికులకు హెల్త్ కార్డులు అందచేసి, అన్‌లిమిటెడ్ ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

### వెల్ఫేర్ బోర్డు నిధుల దుర్వినియోగం ఆపాలి : పాలడుగు భాస్కర్

పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ నెంబర్ 12ను రద్దు చేయాలని, వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు బదిలీ చేయడం చట్టవిరుద్ధమని విమర్శించారు. రూ.346 కోట్లు అక్రమంగా మూడు ప్రైవేట్ కంపెనీలకు బదిలీ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సహజ మరణ పరిహారం రూ.5 లక్షలకు పెంచాలని, పెన్షన్, గృహ వసతి, పిల్లలకు స్కాలర్షిప్ వంటి పథకాలు ప్రభుత్వమే బోర్డు ద్వారా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### అధికారుల అవినీతి పట్ల ఆగ్రహం

టియుసిఐ రాష్ట్ర అధ్యక్షుడు కె. సూర్యం మాట్లాడుతూ 1996 కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు నిధులు అడ్వజరీ కమిటీ నిర్ణయం ప్రకారమే ఖర్చు చేయాలన్నారు. కానీ బిఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ ఇష్టానుసారం నిధులు దారి మళ్ళించాయని విమర్శించారు. 12 లక్షల కార్మికుల లేబర్ కార్డులు రెన్యూవల్ చేయకుండా వారి హక్కులు హరించారన్నారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఎం. శ్రీనివాస్ మాట్లాడుతూ బీమా కంపెనీలకు లాభం కలిగించేలా నిబంధనలు రూపొందించారని, కార్మికుల సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్నారని అన్నారు. బోర్డు నిధులు దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం నేరుగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపు

రౌండ్ సమావేశం భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త పోరాటాలకు పిలుపునిచ్చింది.
ఈనెల 13 లోపు : జిల్లాల వారీగా రౌండ్ టేబుల్ సమావేశాలు.
ఈ నెల 17 లోపు : కార్మికశాఖ మంత్రికి వినతి పత్రాల సమర్పణ.
నవంబర్ 25 : జిల్లా కలెక్టరేట్‌ల వద్ద జెఎసి ధర్నాలు.
డిసెంబర్ 5 : ఛలో హైదరాబాద్ కార్యక్రమం.

## ఢిల్లీ పేలుళ్లతో రాష్ట్రాలను అలర్ట్ చేసిన కేంద్రం

### రాష్ట్రంలో హైఅలెర్ట్..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో తెలంగాణ పోలీసులు పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు డిజిపి శివధర్ రెడ్డి ముందు జాగ్రత్త చర్యగా రాష్ట్రంలో హై అలర్ట్ ప్రకటించారు. అనుమానిత వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశ రాజధాని ఢిల్లీ నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. సోమవారం సాయంత్రం ఎర్రకోట మెట్రోస్టేషన్ సమీపంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి ఎనిమిది మంది మృతి చెందగా.. 24 మంది గాయపడ్డారు. దేశ రాజధానిలో పేలుడుతో కేంద్ర హోంమంత్రిత్వశాఖ అప్రమత్తమైంది. పలు రాష్ట్రాలను సైతం అప్రమత్తం చేసింది. ఈ క్రమంలో హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా హై అలెర్ట్ ప్రకటించిన విస్తృత సోదాలు నిర్వహిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందలు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో రద్దీ ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు, నాకాబందీ చేపట్టాలని డిజిపి అన్ని పోలీసు స్టేషన్‌లకు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ నగరంతో పాటు యావత్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లకు కీలక ఆదేశాలు జారీ అయ్యాయి. సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో సైతం పోలీసులు అప్రమత్తమయ్యారు. పలుచోట్ల పోలీసులు తనిఖీలు చేపట్టారు. అలాగే, పాతబస్తీలో పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ, నాకాబందీ ఏర్పాటు చేసినట్లు సిపి సజ్జనార్ పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా.. మరేవైనా వస్తువులు కనిపించినా సమాచారం ఇవ్వాలని సజ్జనార్ కోరారు.

## ‘రాజీవ్ స్వగృహ’ 163 ప్లాట్లకు బహిరంగ వేలం

### ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్వగృహ కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి చేసిన లే అవుట్లలో నివాస భవనాల నిర్మాణానికి అనువైన ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. హైదరాబాద్ నగరానికి సమీపంలో ఉన్న తొర్రూర్, బహూదూర్ పల్లి, కుర్మల్ గూడ ప్రాంతాల్లోని 163 ఓపెన్ ప్లాట్లను ఈనెల 17, 18 తేదీల్లో బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం వెల్లడించారు. అవుటర్ రింగ్ రోడ్‌కు అతి చేరువలోని తొర్రూర్ ప్రాంతంలో 200 నుంచి 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న125 ప్లాట్లు, కుర్మల్‌గూడలో 200300 చదరపు గజాల విస్తీర్ణంలోని 25 ప్లాట్లు, బహదూర్‌పల్లిలో 200 1000 గజాల్లోని 13 ప్లాట్లను విక్రయానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎటువంటి వివాదాలు లేని, ఈ ప్లాట్లలో తమ అభిరుచులకు అనుగుణంగా ఇండ్లను నిర్మించుకోవచ్చని, ఈ లే అవుట్లలో ఇప్పటికే మౌలిక వసతుల కల్పన కూడా పూర్తయింది. ఈ ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మేనేజింగ్ డైరక్టర్ గౌతం తెలిపారు. పెద్దఅంబర్ పేట్ లోని అవికా కన్వెన్షన్‌లో ఈనెల 17,18 తేదీల్లో తొర్రూర్ ప్రాంతంలోని 125 ప్లాట్లకు, 18 వ తేదీ మధ్యాహ్నం నుంచి బహదూర్ పల్లి, కుర్మల్ గూడల్లోనిప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లువెల్లడించారు.

### తొర్రూర్ లో సందడి ..

రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఓపెన్ ప్లాట్ల విక్రయాలపై అనేక మంది ఆసక్తి కనబరుస్తున్నారు. తొర్రూర్ లోని ప్రాజెక్టు సైట్ లోని ప్లాట్లను స్వయంగా చూసుకుని నచ్చిన ప్లాట్ల నంబర్లను నోట్ చేసుకుంటున్నారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల గురించి వాకబు చేస్తూ, ఇప్పటికే లే అవుట్‌ల లో ఇండ్లు కట్టుకునినివసిస్తున్నవారితోమాట్లాడటం తోపాటు, ప్లాట్ల వాస్తును చూసుకుంటున్నారు. తొర్రూర్ లే అవుట్ లో ఉన్న 885 ప్లాట్లలో విడతల వారీగా ఇప్పటివరకు 517 ప్లాట్లను విక్రయించారు. మిగిలిన వాటిలో 125 ప్లాట్లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు.

## కోకాపేట్, మూసాపేట్‌లలో ప్లాట్ల ఇ-వేలం



ఈనెల 17న టి-హబ్‌లో హెచ్‌ఎండిఏ ప్రీ-బిడ్ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఏ) నగరంలోని అత్యంత కీలకమైన ప్రాంతాలైన కోకాపేట్, మూసాపేట్‌లలో ఖాళీగా ఉన్న ప్లాట్లను ఈవేలం వేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ వేలం ప్రక్రియలో భాగంగా, ఆసక్తి గల డెవలపర్లు, బిల్డర్లు, పెట్టుబడిదారులకు పూర్తి వివరాలు అందించేందుకు నవంబర్ 17న ప్రీబిడ్ సమావేశాన్ని నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. ఈవేలంలో మొత్తం 9 ప్లాట్లు అందుబాటులో ఉండనున్నాయి.

### వేలం వేయనున్న ప్లాట్ల వివరాలు..

– కోకాపేట్ నియోపొలిస్ లేఔట్ (సర్వే నెంబర్ 239, 240) : 6 ప్లాట్లు
– కోకాపేట్ గోల్డెన్ మైల్ లేఔట్ : 1 ప్లాట్
– మూసాపేట్ గ్రామం (కూకట్‌పల్లి మండలం, వైజంక్షన్ సమీపంలో) : 2 ప్లాట్లు

### ప్రీ-బిడ్ సమావేశం వివరాలు..


ఈ మూడు ప్రాంతాలకు చెందిన ప్లాట్ల వేలంపై ఆసక్తి ఉన్నవారందరికీ ఒకే వేదికపై ప్రీబిడ్ సమావేశం నిర్వహించనున్నారు. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీ, రాయదుర్గ్ టి హబ్‌లో ఈనెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పాల్గొనడం ద్వారా, ఈఆక్షన్ ప్రక్రియ, ప్లాట్ల పూర్తి వివరాలు, నిబంధనలు, షరతులపై సమగ్ర సమాచారం పొందవచ్చని హెచ్‌ఎండిఏ అధికారులు తెలిపారు. డెవలపర్లు, బిల్డర్లు, పెట్టుబడిదారులు ఇతర ఆసక్తి కలిగిన వ్యక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆక్షన్ తేదీలు, రిజిస్ట్రేషన్ విధానం, ఇతర పూర్తి వివరాల కోసం హెచ్‌ఎండిఏ అధికారిక వెబ్‌సైట్ www.hmda.gov.in ను సందర్శించాలని అధికారులు, తదితరులు సూచించారు.

## విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ కృషి

### సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్వాతంత్ర్య భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి దేశ విద్యా రంగానికి పునాదులు వేసిన ఘనత మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కే దక్కుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కొనియాడారు. మౌలానా ఆజాద్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగానే గ్రామీణ, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన ఉచిత విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని సిఎం రేవంత్ తెలిపారు. దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి (జాతీయ విద్యా దినోత్సవం) సందర్భంగా విద్యారంగ ప్రగతికి ఆజాద్ చేసిన సేవలను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా, వయోజన అక్షరాస్యత, సార్వత్రిక ప్రాథమిక విద్య, 14 సంవత్సరాల్లోపు బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్య, వృత్తి శిక్షణలతో పాటు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ ఏర్పాటు వంటి విభిన్న విధానాలతో దేశంలో విద్యారంగాభివృద్ధికి ఆజాద్ ఎంతగానో కృషి చేశారని సిఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. ఆయన జయంతి రోజును (నవంబరు 11న) జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. ఐటిఐలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేశామని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ఉపాధ్యాయులు, లెకర్చర్ల నియామకంతో రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పాటుపడుతున్నామని అన్నారు. జాతీయోద్యమంలో పాల్గొనడంతో పాటు అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షునిగా ఆజాద్ ఎనలేని సేవలు అందించారని సిఎం కొనియాడారు. జాతీయోద్యమంలో హిందూ ముస్లింల ఐక్యతను కోరుకొని, దేశ విభజనను వ్యతిరేకించారని సిఎం గుర్తు చేశారు. స్వాతంత్ర్య అనంతరం మైనార్టీలకు గొంతుకగా నిలిచారన్నారు.

## చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్‌కు ఉర్దూ అకాడమీ ‘జీవిత సాఫల్య పురస్కారం’



**విజయవాడ :** ప్రముఖ చరిత్రకారులు, బహుగ్రంథ రచయిత ప్రస్తుత సయ్యద్ నశీర్ అహమ్మద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉర్దూ అకాడమీ ప్రతి ఏడాది మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకుని జరుగు విద్యా దినోత్సవం సందర్భంగా ప్రకటిస్తున్న ‘జీవిత సాఫల్య’ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ ముఖ్య కార్యనిర్వహణాధికారి షేక్ మహమ్మద్ గౌస్ పీర్ ప్రకటించారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిం జనసముదాయాలు నిర్వహించిన పాత్రను వివరిస్తూ గత మూడు దశాబ్దాలుగా విశేష కృషి చేస్తున్న నశీర్ 25 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలను రచించి వెలువరించారు. ఈ గ్రంథాలు ఉర్దూ భాషతోపాటుగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడం, గుజరాతి భాషలలో వెలువడ్డాయి. నశీర్ అహమ్మద్ కేవలం చరిత్ర గ్రంథ రచన, ప్రచురణతో సరిపెట్టుకోకుండా స్వాతంత్ర్య సమర యోధుల త్యాగమయ, సాహసోపేత పోరాటాలను, స్వాతంత్ర్య సాధనలో వారి పాత్రను ప్రజలకు, ముఖ్యంగా యువత, విద్యార్థులకు తెలియపరృస్తూ పలు ప్రచార కార్యక్రమాలను దేశంలోనే కాకుండా విదేశాలలో కూడా అవిశ్రాంతంగా నిర్వహిస్తున్నారు. సుమారు మూడు దశాబ్దాలుగా సయ్యద్ నశీర్ అహమ్మద్ అవిశ్రాంతంగా సాగిస్తున్న కృషికి గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉర్దూ అకాడమీ 2025 ఏడాదికి గాను ఆయనకు ప్రతిష్టాత్మక ‘జీవిత సాఫల్య‘ పురస్కారం ప్రకటించింది. ఈ పురస్కారం క్రింద 25,000 రూపాయలు నగదు, జ్ఞాపికతో సయ్యద్ నశీర్ అహమ్మద్‌ను మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేస్తున్న పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పురస్కార గ్రహీతలను సత్కరించనున్నారు.

## వరి,పత్తి,సోయా,మొక్కజొన్న కొనుగోళ్లు
# నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అన్ని పంటల కొనుగోలు ప్రక్రియ వేగంగా చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయం త్రం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,వ్యవసాయ,మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావుతో కలిసి హైదరాబాదు నుంచి,అన్ని జిల్లాల కలెక్టర్లు,సంబంధిత అధికారులతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సమావేశంలో భాగంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, వరి, పత్తి, సోయా,మొక్కజొన్న పంటల కొనుగోలు ప్రక్రియ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిపడినన్ని గన్ని సంచులు, తూకపు, తేమ యంత్రాలు, టార్పలిన్‌లుఅందుబాటులోఉంచుకోవాలన్నారు. ఇప్పటివరకు ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు,అంచనా కొనుగోలు,ఇప్పటివరకు కొనుగోలుచేసిన పంట,ఇంకనూ ప్రారం భించాల్సిన కొనుగోలు కేంద్రాలు,కొనుగోలు చేయాల్సిన పంట,తదితర అంశాల వివరాలను పలువురు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంట కొనుగోలుకు ఈ నెల కీలకమని, అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు.వాతావరణ పరిస్థితులు మారే అవకాశం ఉన్నందున రైతులకు నష్టం వాటిల్లకుండా నిర్ణిత గడువులోగా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.వాతావరణ వివరాలను రైతులకు తెలియజేస్తూ,పంట ధాన్యం నష్టపోకుండా చూడాలని చెప్పారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ,సకాలంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.కలెక్టర్లు స్వయంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తూ,కొనుగోలు ప్రక్రియ సరిగ్గా జరిగేలా పర్యవేక్షించాలని తెలిపారు.పంటతల తేమ శాతం విషయంలో రైతులకు ఉపశమనం కలిగేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతామని అన్నారు.కౌలు రైతులకు తమ పంటను అమ్ముకునే విషయంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.వెంట వెంటనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ చేయాలని తెలిపారు.పంటల కొనుగోలులో రాబోయే 3,4 వారలు అత్యంత కీలకమని మంత్రి వివరించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కూడా అన్ని పంటల కొనుగోలు ప్రక్రియ ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహిస్తున్నామని అన్నారు.ఇంకా ఏవైనా పంటల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనట్లుయితే వెంటనే ప్రారంభించాలన్నారు.పంటల తేమ శాతం విషయంలో రైతులకు వెసులుబాటు కలిగించాలని అధికారులను ఆదేశించారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా అన్ని సౌకర్యాలు కల్పించాలని వివరించారు.టార్పలిన్‌లు,గన్ని సంచులు సరిపడిన్నని అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. పంటలన్నింటినీ రైతులు ప్రభుత్వానికే అమ్మేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలనిన వివరించారు.రోజువారీగా కొనుగోలు చేసిన పంటల వివరాలు తమకు అందజేయాలని తెలిపారు.కొనుగోలు చేసిన వరి ధాన్యపు వివరాలు ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియ రోజువారీగా పూర్తి చేసి,రైతులకు సకాలంలో డబ్బులు జమ అయ్యే విధంగా చూడాలని అన్నారు.పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం జిల్లాలోనికి అమ్మేందుకు తీసుకు రాకుండా ఉండేలా అన్ని అంతర్రాష్ట్రాచెక్ పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలన్నారు.వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులక ఇబ్బందులు కలిగితే పౌర సరఫరాల టోల్ ఫ్రీ నెంబర్ 9182958858 ను సంప్రదించాలని సూచించారు.పంటల కొనుగోలుకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి,రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్ణీత సమయంలో పంటల కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు.

## ఎస్‌ఆర్‌ఎస్‌పి స్టేజ్-2కి ఆర్‌డిఆర్ ఎస్‌ఆర్‌ఎస్‌పిగా నామకరణం

### జిఓ విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఎస్‌ఆర్‌ఎస్‌పి స్టేజ్ 2 కి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి (ఆర్‌డిఆర్) పేరుగా తెలంగాణ ప్రభుత్వం నామకరణం చేసిం ది. ఈ మేరకు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ జిఓను విడుదల చేశారు. 284 కిలో మీటర్ల నుండి 346 కిలో మీటర్ల వరకు ఉన్న ఎస్‌ఆర్‌ఎస్‌పి స్టేజ్ 2 కాకతీయ ప్రధాన కాలువకు ఆర్‌డిఆర్ ఎస్‌ఆర్‌ఎస్‌పి స్టేజ్2 కాలువగా నామకరణం చేసినట్లు వివరించారు. గత నెల 1వ తేదీన (అక్టోబర్) ఆయన అనారోగ్యంతో మృతి చెందగా దశదిన కర్మ సందర్భంగా నిర్వహించిన సంతాప సభకు సిఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రోడ్లు భవనాలు, సిని ఫోటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎస్‌ఆర్‌ఎస్‌పి స్టేజ్2 కాల్వ నిర్మాణం కోసం రైతులపక్షాన రాంరెడ్డి దామోదర్ రెడ్డి చేసిన పోరాటాన్ని ప్రస్తావిస్తూ ఆ కాలువకు ఆయన పేరును పెట్టాలని సిఎంను కోరారు. ఇందుకు స్పందించిన సిఎం రేవంత్ రెడ్డి 24 గంటల్లో జిఓను విడుదల చేస్తామంటూ సభలో ప్రకటించారు. దీనికి కట్టుబడి అదే రోజు జిఓను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ జిఓ కాపిని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డికి సంబంధిత అధికారులు సోమవారం అందజేశారు.దామోదర్ రెడ్డి తనయుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డిలు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి తాను ఇచ్చిన మాట ప్రకారం 24 గంటల్లో ఎస్‌ఆర్‌ఎస్‌పి స్టేజ్2 కు ఆర్‌డిఆర్ ఎస్‌ఆర్‌ఎస్‌పి గా నామకరణం చేస్తూ జిఓ విడుదల చేయడంపట్ల, సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. సూర్యాపేట, తుం గతుర్తి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కార్మికుల కోసం కాంగ్రెస్‌ను గెలిపించండి

### ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ప్రజలు, కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మోగుళ్ళ రాజిరెడ్డి విజ్ఞప్తి చేసారు. గత పదేళ్లలో కార్మిక కార్మికుల సంక్షేమాన్ని బిఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, మరోవైపు స్వాతంత్ర్యానంతరం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కి కార్మిక వ్యతిరేక కోడ్ తీసుకువచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. ఈ నేపథ్యంలో కార్మిక వ్యతిరేక పార్టీలైన బిఆర్‌ఎస్, బిజెపి లను ఓడించాలని, కార్మిక సంక్షేమ చర్యలను అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఉద్యోగులు,కార్మికులంతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసంఘటిత కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపటట్టిందని, కార్మికులు, ఉద్యోగులకు కనీస వేతనం కోసం కనీస వేతన బోర్డును ఏర్పాటు చేసిందని, ఆయన గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి మంరింత బలోపేతం చేస్తే ముఖ్యంగా హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎస్.బి కార్మికులు, ఉద్యోగుల సమస్యలు మరింత త్వరగా పరిష్కారమవుతాయన్నారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని హెచ్‌ఎండబ్ల్యూఎస్ & ఎస్.బి కార్మికులు, ఉద్యోగులు జూబ్లీ హిల్స్ ప్రజలతో కాంగ్రెస్ ఓటు వేయించాలని ఆయన కోరారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమం, భద్రత కోసం అనేక కార్మిక చట్టాలను తీసుకవచ్చిందని, దేశంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి లక్షలాదిమందికి ఉపాధి, ఉద్యోగ భద్రత కల్పించిందని గుర్తు చేసారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని, ప్రైవేటైజెషన్ పేరుతో ఉన్న ఉద్యోగాలను కొల్లగొట్టిందని, అభివృద్ధి నిలిచిపోయిందని తెలిపారు. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో సినీ కార్మికుల తోపాటు భావన నిర్మాణ కార్మికులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల తోపాటు సంక్షేమ ఫలాలు అందించడానికి ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారని చెప్పారు.

## పార్కులు, ప్రభుత్వ స్థలాలు కాపాడాలి


### హైడ్రా ప్రజావాణికి 47 ఫిర్యాదులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్కుల నామరూపాలు లేకుండా చేస్తున్నారు. పార్కుల్లో ఆలయాలు నిర్మించేసి, ఆ పక్కనే చిన్న షాపులు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. లేఔట్‌లలో పార్కులకోసం కేటాయించిన స్థలాలన్నిటికీ ఫెన్సింగ్‌లు వేసి కాపాడాలంటూ పలువురు సోమవారం హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలాలకు కూడా కాపాడాలని కోరారు. అమీన్‌పూర్ పెద్దచెరువు, రావిర్యాల చెరువుల విస్తీర్ణం ఏటా పెరుగుతూ, ఎగువ భాగంలో ఉన్న నివాసాలను ముంచెత్తుతున్నాయని ఆయా ప్రాంతాల ప్రజలు ఫిర్యాదు చేశారు. మూసేసిన తూములు తెరిపించడంతో పాటు అలుగు ఎత్తును కూడా తగ్గించాలని కోరారు. గతంలో వ్యవసాయ వినియోగం వల్ల నీటి నిలువలు తగ్గేవని,ఇప్పుడుమురుగునీటితోనిండిఎగువున ఉన్న ప్రాంతాలు మునుగుతున్నాయని వాపోయారు. ఇదే పరిస్థితి రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని రావిర్యాల గ్రామంలో కూడా ఉందని ఫిర్యాదు చేశారు.

## ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మ్యాగజైన్- సదస్సులో.. ప్రసంగించిన జలమండలి ఇడి మయాంక్ మిట్టల్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీ మెరిడియన్ హోటల్‌లో నిర్వహించిన 11వ వార్షిక సదస్సు ఎస్‌టిపి, సీవరేజ్ నిర్వహణ, కార్యక్రమంలో జలమండలి ఈ.డి. మయాంక్ మిట్టల్ ప్రసంగించారు. జలమండలిలో అమలవుతున్న వివిధ పథకాలను ప్రజెంషన్ ద్వారా వివరించారు. ఇందులో హైదరాబాద్ నగరంలోని ప్రస్తుత సీవరేజ్ శుద్ధి సామర్థ్యం, ప్రస్తుతం అమలు చేస్తున్న ఎస్‌టిపిల ఆధునీకరణ, పునరుద్ధరణ చర్యలు, సంస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలతో పాటు భవిష్యత్ అవకాశాలు వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు.దేశవ్యాప్తంగా ఉన్న నీటి, సీవరేజ్ నిర్వహణ సంస్థల ప్రతినిధులున్నారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## బంగ్లాదేశ్‌లో పేరుమోసిన నేరస్థుడు కాల్చివేత

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో పేరుమోసిన నేరస్థుడు మామున్‌ను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం ఉదయం నడిరోడ్డుపై కాల్చి చంపారు. కొత్వాలీ పోలీస్ జోన్ అసిస్టెంట్ కమీషనర్ ఫజుల్ హక్ ఈ విషయం ధృవీకరించారు. దేశంలో పేరుమోసిన కొందరు నేరస్థులను అరెస్టు చేసేందుకు పోలీసులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో మామున్‌ను ఢాకా నేషనల్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి గేటు ఎదుట ఎవరో కాల్చి చంపారని, కత్తులతో పొడిచారని చెప్పారు. తర్వాత అతడిని ఆసుపత్రికి తరలించారు. గుండెలపై తూటాలు దిగడంతో అతగాడు మరణించాడని ప్రకటించారు.రెండేళ్ళక్రితం ఈ నేరగాడు పోలీసుల నుండి తప్పించుకున్నాడు. బార్‌కు వెళ్ళి తిరిగి ఇంటికి బయలుదేరిన సమయంలో దాదాపు ఎనిమిదిమంది అతడి కారును అనుసరించారు. కారుపై కాల్పులు జరిపారు. తర్వాత మామున్ కారు దిగి పరుగెత్తుతుండగా అతడిని వెంబడించి కత్తులతో పొడిచి చంపారు.

## ఎస్ఆర్ఐ కాదు 'ఓట్ బంది' : మమతా బెనర్జీ



**కోల్‌కత్తా:** పశ్చిమబెంగాల్‌లో సోమవారం కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ఓట్ల సవరణ(ఎస్ఐఆర్)ను 'ఓటుబంది' అని పశ్చిమ బెంగాల్‌ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. తక్షణమే దీనిని ఆపేయాలని ఎన్నికల సంఘాని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఎస్ఐఆర్ నిర్వహించాలనే తొందర ఎందుకో తనకు అర్థం కాలేదని బెనర్జీ అన్నారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరుతో ప్రజలను వేధిస్తోందని, నోట్ల రద్దు 'నోటుబంది' లాగా, ఎస్ఐఆర్ 'ఓటుబంది' అని, ఇది సూపర్ ఎమర్జెన్సీకి మరొక రూపం అని సోమవారం సిలిగురిలో విలేకరులతో మాట్లాడుతూ ఆమె అన్నారు. ఈ రెండు లేదా మూడు నెలల్లో పూర్తి చేయలేమని, దీనిని బలవంతంగా నిర్వహిస్తున్నారని మమతా బెనర్జీ ఆరోపించారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడినందుకు బిజెపి తనను జైలుకు పంపవచ్చు లేదా తన గొంతు కోయవచ్చు అని ,కానీ ప్రజల ఓటు హక్కులను నిరోధించవద్దని ఆమె అన్నారు. జిఎస్‌టి ఒక పెద్ద తప్పిదమని, తక్షణమే దానిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సభ లోపలే సమస్యలు లేవనెత్తాలి: స్పీకర్ ఓం బిర్లా

**న్యూఢిల్లీ :** అన్ని రాజకీయ పార్టీలుపార్లమెంటు బయట కాకుండా సభలోనే సమస్యలను లేవనెత్తుతాయని తాము ఆశిస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా అన్నారు. పార్లమెంటు ప్రజా సమస్యలపై చర్చకు వేదిక అని, రాజకీయ పార్టీలు సమావేశాలను అడ్డుకోకుండా, దానిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సోమవారం మాట్లాడుతూ, సభ కార్యకలాపాలకు ప్రణాళికాబద్ధమైన అంతరాయం కలిగించడం ప్రజాస్వామ్యం మంచి పద్ధతులలో ఒకటి కాదని అన్నారు. డిసెంబర్ 1 నుండి 19 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలు15 సమావేశాల పాటు కొనసాగుతాయి. బిహార్లో ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటర్ల జాబితాల సవరణ అంశంపై ప్రతిపక్షం సభ కార్యకలాపాలను అడ్డుకోవడంతో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిశాయి. ఈ సారి సమావేశాలు తక్కువ రోజులు నిర్వహించడంపై ప్రశ్నించగా, పార్లమెంటు సమావేశాన్ని ఏర్పాటు చేయడం ప్రభుత్వ ప్రత్యేక హక్కు అని, ఎన్ని రోజులనేది అధికారిక ఎజెండాపై ఆధారపడి ఉంటుందని బిర్లా అన్నారు.

## డిసెంబరు 9,11 తేదీల్లో

# కేరళ స్థానిక సంస్థల ఎన్నికలు

### 21వ తేదీన నామినేషన్ల ముగింపు
### వచ్చేనెల 13న ఓట్ల లెక్కింపు





**తిరువనంతపురం:** కేరళ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు డిసెంబరు 9,11 తేదీలలో జరుగుతాయి. ఒకరోజు విరామంతో రెండు విడతలుగా ఈ ఎన్నికలు జరుగుతాయని కేరళ రాష్ట్ర ఎన్నికలసంఘంసోమవారం ప్రకటించింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణం అమలులోకి వస్తుంది. ఈ నెల 21వ తేదీతో నామినేషన్ల దాఖ లు గడువు ముగుస్తుంది. తిరువనంతపురం, కొల్లాం, పట్టణంథిట్ట, కొట్టాయం, అలప్పురుు, ఇడుక్కి, ఎర్నాకుళం జిల్లాలలో వచ్చేనెల తొమ్మి దో తేదీన ఎన్నికలు జరుగుతాయి. త్రిస్సూర్, పాలక్కాడ్, మలప్పురం,వాయ్‌నాడ్, కోళీకోడ్,కన్నూర్, కాసరగడ్ జిల్లాలో వచ్చేనెల 11వ తేదీన పోలింగ్ జరుగుతుంది. ఉదయం ఏడు గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమై సాయంత్రం ఆరుగంటలకు ముగుస్తుంది. పోలింగ్ ప్రక్రియ ముగిసిన రెండోరోజు డిసెం బరు 13వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. హైదరాబాద్‌కు చెందిన ఇసిఐఎల్ (ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) ఓటింగ్ యంత్రాలను తయారుచేసి కేరళ ఎన్నికల సంఘానికి సరఫరా చేస్తోంది. ఇసిఐఎల్ఇంజనీర్ల పర్యవేక్షణలో ఓటింగ్ యంత్రాల తనిఖీలు ఇప్పటికే పూర్తిచేశారు. పోలింగ్ రోజున ఉదయం 6 గంటలకు నమూనా ఓటింగ్ పరిశీలన జరుగుతుంది. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసుకోవడానికి 11 రోజులు గడువు ఉండగా, ఈనెల 22న నామినేషన్లను పరిశీలిస్తారు. 24వ తేదీతో నామినేషన్ల ఉపసంహారణకు గడువు ముగుస్తుందని కేరళ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఎ.షాజహాన్ చెప్పారు. 1200 స్థానిక సంస్థలకుగాను 1,199 స్థానిక సంస్థలలో ఎన్నికలు జరుగుతాయి. మత్తన్నూర్ పురపాలక సంఘ పాలకమండలి పదవీకాలం 2027 వరకూ ఉన్నందువల్ల దీనిని ఎన్నికల ప్రక్రియ నుండి మినహాయించారు. 941గ్రామ పంచాతీలలో ఉన్న 17,337 వార్డులకు, 152 బ్లాక్ పంచాయతీలలో ఉన్న 2,267 వార్డులకు, 14 జిల్లా పంచాయతీలలో ఉన్న 346 వార్డులకు, 86 పురపాలకసంఘాలలోఉన్న 3,205 వార్డులకు, ఆరు నగరపాలక సంస్థలలో ఉన్న 421 వార్డులకు ఎన్నికలు జరుగుతాయని షాజహాన్ చెప్పారు.

### 2.84 కోట్లు పైగా ఓటర్లు

కేరళ రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన కారణంగా 1200 స్థానిక సంస్థలలో ఉన్న మొత్తం వార్డులసంఖ్య 21,900 నుండి 23,612కు పెరిగాయి. దీంతో కొత్తగా ఏర్పడిన వార్డుల సరిహద్దులకు అనుగుణంగా ఈ ఏడాది ఆగస్టునెలలో ఒకసారి, అక్టోబరునెలలో మరొకసారి మొత్తం రెండుసార్లు ఓటర్ల జాబితాలను సవరించారు. ఓటర్ల తుది జాబితాలను అక్టోబరు 25వ తేదీన ప్రచురించినట్లు షాజహాన్ చెప్పారు. కేరళలో మొత్తం 2,84,30,761 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,34, 12,470 మంది ఉన్నారు. 1,50, 18,010 మంది మహిళలుఉన్నారు.281మందిట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. అదేవిధంగా ప్రవాస భారతీయులకోసం విడిగా ఒక ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. ఈ జాబితాలో 2,481మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,484 మంది పురుషులు, 357 మంది మహిళలు ఉన్నారు. ఈ నెల 14న అనుబంధ ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. రాజకీయపార్టీలకు వీటిని ఉచితంగా అందజేస్తారు.ఎన్నికల నిమిత్తం రాష్ట్రవ్యాప్తంగా 33,746 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశా రు. వీటిల్లో గ్రామ,బ్లాక్, జిల్లా పంచాయతీ వార్డుల నిమిత్తం 28,127 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పురపాలక సంఘాలలో 3,604 పోలింగ్ కేంద్రాలు, నగర పాలక సంస్థలలో 2,015 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియ ని మిత్తం 50, 693 కంట్రోల్ యూనిట్లు, మరో 1,37,922 బ్యాలె ట్ యూనిట్లను సిద్ధం చేశారు. ప్ర స్తుతం ఉన్న స్థానిక సంస్థల ప్రతినిధుల పదవీకాలం పూర్తయిన తర్వాత కొత్తగా ఎన్నికైన ప్రతినిధులు పదవీ బాధ్యతలు తీసుకుంటారు. ఎన్నికైన కౌన్సిలర్లు, కా ర్పొరేటర్లు, సభ్యులందరూ తప్పనిసరిగా ప్రమాణ స్వీ కారం చేయాలి. ప్రమాణ స్వీకారం ఎప్పుడు జరిగేదీ, మొదటి సమావేశాలు ఎప్పుడు జరిగేదీ రాష్ట్ర ప్రభుత్వమే తేదీలను నిర్ణయిస్తుంది. ఈ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు తదుపర చర్యలు తీసుకుంటారు. ప్రమా ణ స్వీకారం తర్వాత ఎన్నికల సంఘం నిర్ణయించిన తేదీల ప్రకారం సభ్యులు అధ్యక్షులను, ఉపాధ్యక్షులను, స్థాయీసంఘాలను ఎన్నుకుంటారు.

## బిహార్‌లో మహాఘట్బంధన్‌దే సర్కార్

### ఎన్‌డిఎ వద్ద కేవలం అసభ్యకరమైన భాష, తప్పుడు వాగ్దానాలే ఉన్నాయి : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల చివ రి దశ పోలింగ్ వేళ కాంగ్రెస్ కీలక వ్యాఖ్య లు చేసింది. ఈసారి రాష్ట్రంలో మహాఘట్బంధన్ ప్రభుత్వం కచ్చితంగా ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. రాష్ట్ర అభివృద్ధికి ఇండియా కూట మి స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను కలిగి ఉందని స్పష్టం చేసింది. ఎన్‌డిఎ నాయకుల వద్ద అసభ్యకరమైన భాష, తప్పుడు వాగ్దానాలు మాత్రమే ఉన్నాయని విమర్శించింది. ఎన్నికల సందర్భంగా మహాఘట్బంధన్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలవుతాయని పేర్కొంది. 20 ఏళ్ల నిస్సహాయ పాలన నుంచి మహాఘట్బంధన్ ప్రభుత్వం బిహార్‌కు విముక్తి కల్పిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. రాష్ట్రంలో వలసలు ఆగిపోతాయని, యువత భవిష్యత్తు నుండి చీకటి తొలగిపోతుందని, ప్రతి ఇంటికి ఉషోదయం వస్తుందన్నారు. అన్యాయాన్ని అంతం చేస్తామని, బిహార్‌ను సామాజిక న్యాయంతో మారుస్తామని ఖర్గే ఎక్స్‌లో హిందీలో పోస్టు చేశారు. దళితులు, మహాదళితులు, గిరిజనులు, వెనుకబడిన, అత్యంత వెనుకబడిన, ఆర్థికంగా బలహీన వర్గాలు, మైనారిటీలు తిరిగి వారి హక్కులను పొందుతారని కాంగ్రెస్ చీఫ్ అన్నారు. మహిళలు, రైతులు, యువత, సమాజంలోని ప్రతి వర్గం ఆర్థిక అభ్యున్నతిని అనుభవిస్తారని ఆయన అన్నారు. బిహార్ ప్రజలు రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చడానికి బయలుదేరారని, తాము రాష్ట్రానికి పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని హామీ ఇస్తున్నామని, దానిని సాధ్యం చేసి చూపిస్తామని ఖర్గే మహాఘట్బంధన్ చేసిన కొన్ని హామీలను ఎక్స్‌లో పంచుకున్నారు. రాష్ట్రాన్ని 20 ఏళ్లు విధ్వంసానికి గురి చేసిన ఎన్‌డిఎ నాయకులు ఇప్పుడు అసభ్యకరమైన భాష, తప్పుడు వాగ్దానాలు మాత్రమే చేశారని, బిహార్ అభివృద్ధి, న్యాయం కోసం ఇండియా కూటమి స్పష్టమైన, దృఢమైన రోడ్‌మ్యాప్‌ను కలిగి ఉందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. ఈసారి బిహార్‌లో మహాఘట్బంధన్ ప్రభుత్వం కచ్చితంగా ఏర్పడుతుందన్నారు. బిహార్‌లోని ప్రతి ఇంటికి ఉద్యోగాలు, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం వంటి మహాఘట్బంధన్ 20 హామీలను రమేష్ వెల్లడించారు.

## ఎన్నికల సంఘం కార్యాలయం ఎదుట ఎన్ఎస్‌యుఐ నిరసన



**న్యూఢిల్లీ :** న్యూఢిల్లీలోని భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) కార్యాలయం ఎదుట ఎన్ఎస్‌యుఐ సోమవారం నిరసన చేపట్టింది. హర్యానాలో పెద్ద ఎత్తున ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు ఎన్నికల సంఘం ,అధికార బిజెపి నుండి జవాబుదారీతనం కోరుతూ ఎన్ఎస్‌యుఐ కార్యకర్తలు ఇసి కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు.కాగా, ఢిల్లీ పోలీసులు ప్రదర్శనను అడ్డుకున్నారు. ఎన్ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ తన రాజ్యాంగ విధిని నిర్వర్తించడంలో విఫలం అయిందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్య సంరక్షకురాలి ఉండటానికి బదులుగా, హర్యానాలో ఓటు దొంగతనానికి వీలు కల్పించడానికి బిజెపితో కుమ్మక్కైంది అని ఆయన అన్నారు.

## లింగ ఆధారిత గణాంకాలు వెల్లడించరా?

### ఎన్నికల కమిషన్‌పై తేజస్వీ యాదవ్ మండిపాటు



**పాట్నా :** భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)పై ఆర్‌జెడి నేత, ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ మండిపడ్డారు. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల మొదటి దశకు 6వ తేదీన ఓటింగ్ ముగియగా, ఇప్పటికే ఓటు వేసిన ఓటర్ల లింగం వారీ డేటాను వెల్లడించలేదని విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్‌జెడి నేతృత్వంలోని ప్రతిపక్ష సంకీర్ణం ఓట్ల దొంగతనాన్ని అనుమతించదన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నాయకత్వంలో ఎన్నికల కమిషన్ సరిగ్గా పనిచేయడం మానేసిందని తేజస్వీ ఆరోపించారు. ఎన్నికల కమిషన్ లేదా కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కుమ్మక్కై సమస్యలను సృష్టించడానికి ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాము ఓటు దొంగతనం లేదా అవకతవకలను అనుమతించబోమన్నారు. బిహార్‌లో ఎన్నికల విధుల కోసం బిజెపి పాలిత రాష్ట్రాల నుండి మొత్తం 208 కంపెనీల భద్రతా సిబ్బందిని మోహరించారని యాదవ్ పేర్కొన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల నుండి భద్రతా సిబ్బందిని ఎందుకు మోహరించారని ప్రశ్నిస్తూ, వారిపై తాము నిశితంగా నిఘా ఉంచుతున్నామని చెప్పారు. దాదాపు 68 శాతం మంది పోలీసు పరిశీలకులు బిజెపి పాలిత రాష్ట్రాల నుండి వచ్చిన వారేనన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సహా బయటి వ్యక్తులు హిహార్‌ను నియంత్రించాలనుకుంటున్నారని, దీనిని రాష్ట్ర ప్రజలు అనుమతించరని ఆర్‌జెడి నాయకుడు బిజెపి కేంద్ర నాయకులను విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ తన ఎన్నికల ప్రచారాల సమయంలో బిహార్‌లో నిరుద్యోగం, వలసల వంటి సమస్యల గురించి మాట్లాడలేదని, ప్రతికూల రాజకీయాలలో పాల్గొన్నారని ఆరోపించారు. సామ్రాట్ చౌదరి, డాక్టర్ దిలీప్ జైసావల్, మంగళ్ పాండేల అవినీతి ఆరోపణల గురించి తాను ఏమీ చెప్పలేదని ఆర్‌జెడి నాయకుడు పేర్కొన్నారు. హులాస్ పాండే, ఆనంద్ మోహన్, సునీల్ పాండే, మనోర్మ దేవి వంటి వారితో ప్రధాని వేదిక పంచుకున్నారు, వారు నిజాయితీపరులైన రాజకీయ నాయకులా? కోట్లాది రూపాయల సృజన్ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన విపిన్ శర్మను ఆయన పాట్నాలో కలిశారన్నారు. బిహార్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని యాదవ్ విశ్వాసం వ్యక్తం చేస్తూ, నవంబర్ 18న ప్రమాణం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. శాంతిభద్రతల విషయంలో రాజీ పడబోమని, ఇండియా కూటమి అధికారంలోకి రాగానే నేరస్థులు, మతతత్వ శక్తులు, అవినీతిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## ఎపి, రాజస్థాన్ ప్రమాదాలను సుమోటోగా స్వీకరించిన 'సుప్రీం'

### స్థాయీ నివేదిక ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఎఐకి ఆదేశం

**న్యూఢిల్లీ :** ఇటీవల ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌లోలో ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. రాజస్థాన్‌లో రోడ్డు ప్రమాదంలో ఈ ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎపిలో బస్సు దహనమై మరో 19 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. రెండు ఘటనలను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. జస్టిస్ జెకె మహేశ్వరి, విజయ్ విష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం జాతీయ రహదారుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేసింది. రాజస్థాన్‌లోని జాతీయ రహదారులపై ఉన్న ధాబాలు, ఇతర సంస్థల సంఖ్యను వివరిస్తూ రెండువారాల్లోగా వివరణాత్మక స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయాలని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఎఐ)ని ఆదేశించింది. రహదారి పరిస్థితులపై నివేదికను కూడా ఇవ్వాలని చెప్పింది. ఈ కేసులో సీనియర్ న్యాయవాది ఎఎస్ నాదకర్ణిని అమికస్ క్యూరీగా నియమించిన ధర్మాసనం.. స్టేటస్ నివేదికను దాఖలు చేయడానికి రాజస్థాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని పార్టీగా చేర్చాలని ఆదేశించింది. రాజస్థాన్ ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు అడ్వకేట్ జనరల్ శివ్ మంగళ్ శర్మ.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కోర్టుకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అలాగే, కర్నూలు రోరడ్డు ప్రమాదాన్ని సైతం కోర్టు పరిగణలోకి తీసుకుంది. జాతీయ రహదారి భద్రత, రోడ్డు పక్కన ఉన్న నిర్మాణాల నియంత్రణ కోసం సమన్వయ విధానం అవలంభించడానికి ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని పార్టీగా చేయాలని ఆదేశించింది. నేషనల్ హైవేలపై ప్రమాదాలు కేవలం డ్రైవింగ్ లోపాలు మాత్రమే కాకుండా.. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల జరుగుతున్నట్లుగా కోర్టు పేర్కొంది. ఈ క్రమంలో ఈ వ్యవహారంపై ద్విసభ్య ధర్మాసనం స్పందించింది.

# ఉగ్ర కుట్ర గుట్టురట్టు

## 2,900 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం

### ముగ్గురు వైద్యులు సహా ఎనిమిది మంది అరెస్టు





**శ్రీనగర్/ఫరీదాబాద్:** ఉగ్రనిరోధక చర్యల్లో జమ్ముకశ్మీర్ పోలీసులు భారీ పురోగతి సాధించారు. హర్యానా పోలీసులతో కలిసి నిర్వహించిన సం యుక్తఆపరేషన్‌లో అంతరాష్ట్ర, అంతర్జాతీయ ఉగ్ర మాడ్యూల్ గుట్టురట్టు చేశారు. జైషే మహమ్మద్, అన్సార్ ఘజ్వత్ – ఉల్ – హింద్, కశ్మీర్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లకు సంబంధించిన వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ ముఠా ముట్టును బయటపెట్టారు. ముగ్గురు వైద్యులు సహా 8 మందిని అరెస్టు శారు. పెద్ద ఆయుధాలు, మందుగుండు సామాగ్రితో పాటు 2,900 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. 15 రోజుల ఆపరేషన్ తర్వాత అరెస్టు చేసిన వారిలో ఫరీదాబాద్‌లో కశ్మీర్‌కు చెందిన డాక్టర్ ముజమ్మిల్ గనై, లక్నోకు చెందిన డాక్టర్ షాహీన్‌ను కస్టడీ విచారణ కోసం విమానంలో శ్రీనగర్‌కు తరలించారు. షాహిన్ కారులో ఎకె47 రైఫిల్ దొరికినట్లు అధికారులు తెలిపారు. అయితే ఎప్పుడు చేశారో అనే విషయాన్ని కచ్చితంగా వెల్లడించలేదు. ఈ చర్యతో నిషేధిత జైషే మహమ్మద్ (జెఇఎం), భారతదేశంలో ఐసిస్ అనుబంధ సంస్థ అయిన అన్సార్ ఘజ్వత్ – ఉల్ – హింద్ (ఎజియుహెచ్) అనే రెండు ఉగ్రవాద గ్రూపుల విధ్వంసక కుట్రలను పోలీసులు విజయవంతంగా తిప్పికొట్టారు. 2,900 కిలోల పేలుడు పదార్థంలో అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, సల్ఫర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో అమ్మోనియం నైట్రేట్ అని అనుమానించబడిన 360 కిలోల మండే పదార్థం, కొన్ని ఆయుధాలు, మందుగుండు సామగ్రిని ఫరీదాబాద్‌లోని గనైలో అద్దెకు తీసుకున్న వసతి గృహం నుండి స్వాధీనం చేసుకున్నట్లు జమ్ముకశ్మీర్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రదేశాల నుండి స్వాధీనం చేసుకున్న వాటిలో మందుగుండు సామగ్రితో కూడిన చైనీస్ స్టార్ పిస్టల్, బెరెట్టా పిస్టల్, ఎకె 56 రైఫిల్, ఎకె క్రింకోవ్ రైఫిల్, రసాయనాలు, కార కాలు, మండే పదార్థం, ఎలక్ట్రానిక్ సర్క్యూట్లు, బ్యాటరీలు, వైర్లు, రిమోట్ కంట్రోల్, టైమర్లు, మెటల్ షీట్లు ఉన్నాయి. న్యూఢిల్లీకి ఆనుకుని ఉన్న హర్యానా పట్టణంలోని అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గనై, శ్రీనగర్‌లో జైషే మహ్మద్‌కు మద్దతుగా పోస్టర్లు వేసిన కేసులో జమ్ముకశ్మీర్ పోలీసులు అతన్ని మోస్ట్ వాంటెడ్ వ్యక్తిగా పేర్కొన్న తర్వాత అరెస్టు చేశారు. అరెస్టు అయిన ఎనిమిది మందిలో, ఏడుగురు కశ్మీర్‌కు చెందినవారే. ఆరిఫ్ నిసార్ దార్ అలియాస్ సాహిల్, యాసిర్–ఉల్–అష్రఫ్, మక్సూద్ అహ్మద్ దార్ అలియాస్ షాహిద్ శ్రీనగర్‌లోని నౌగామ్ నివాసులు. మౌల్వి ఇర్ఫాన్ అహ్మద్ షోపియాన్‌కు చెందిన వ్యక్తి. జమీర్ అహ్మద్ అహంగర్ అలియాస్ ముత్లాషా గందేర్‌బాల్‌లోని వకురా ప్రాంత నివాసి. పుల్వామాలోని కోయిల్ ప్రాంతానికి చెందిన డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్ గనై అలియాస్ ముసైబ్, కుల్గాంలోని వాన్‌పోరా ప్రాంతానికి చెందిన డాక్టర్ అదీల్ ఉండగా, డాక్టర్ షాహీన్ లక్నోలో నివసిస్తున్నారు. గనై, అదీల్ ఫోన్లలో అనేక పాకిస్తానీ నంబర్లు దొరికాయని అధికారులు తెలిపారు. వారు నెట్‌వర్క్‌ను నిర్వహించే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. అక్టోబర్ 19న నగరంలోని బన్‌పోరా నౌగామ్ ప్రాం తంలోని వివిధ ప్రదేశాలలో పోలీసులను, భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకుని జెఇఎం పోస్టర్లు వెలిశాయి. ఇది దర్యాప్తునకు తొలి అడుగు పడగా, అంతర్‌రాష్ట్ర ఉగ్రవాద నెట్‌వర్క్‌ను బహిర్గతం చేయడానికి దారితీసింది. దర్యాప్తులో వైట్ కాలర్ టెర్రర్ ఎకో సిస్టమ్ బయటపడింది, పాకిస్తాన్, ఇతర దేశాల నుండి పనిచేస్తున్న విదేశీ హ్యాండ్లర్లతో సంప్రదింపులు జరుపుతున్న రాడికలైజ్డ్ నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారని జమ్ముకశ్మీర్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బృందం బోధన, సమన్వయం, నిధుల తరలింపు, లాజిస్టిక్స్ కోసం ఎన్‌క్రిప్టెడ్ ఛానెల్‌లను ఉపయోగిస్తోందని పేర్కొంది. 'సామాజిక/ధార్మిక కారణాల ముసుగులో ప్రొఫెషనల్, అకడమిక్ నెట్‌వర్క్‌ల ద్వారా నిధులు సేకరించారని, నిందితులు తీవ్రవాదం చేయడం, వారిని ఉగ్రవాద శ్రేణుల్లోకి చేర్చుకోవడం, నిధులను సేకరించడం, లాజిస్టిక్స్ ఏర్పాటు చేయడం, ఆయుధాలు/మందుగుండు సామగ్రిని సేకరించడం, ఐఇడిలను తయారు చేయడానికి సామగ్రిని సేకరించడంలో పాల్గొన్నట్లు తేలిందని తెలిపారు.

' ఈ కేసు దర్యాప్తులో భాగంగా జమ్ముకశ్మీర్‌లోని ఆయా ప్రాంతాలతో పాటు హర్యానాలోని ఫరీదాబాద్, ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్‌లో స్థానిక పోలీసులతో కలిసి సోదా లు నిర్వహించాం. ఈ క్రమంలోనే కొంతమంది నిందితుల పాత్ర బయటపడింది. వారినీ అరెస్టు చేస్తాం. వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నాం. నిధులకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతోంది' అని జమ్ముకశ్మీర్ పోలీసు ప్రతినిధి తెలిపారు.

## కూలిన ఇంటి పైకప్పు

### ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం



**న్యూఢిల్లీ :** ఇంటి పైకప్పు కూలి ఒకే కుటుంబానికి ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. బిహార్ రాష్ట్రంలోని పట్నా రెవెన్యూ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. అకిల్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మనాస్ గ్రామంలో ఆదివారం రాత్రి 9.45 గంటల సమయంలో ఓ ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. వారిలో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. అందరూ నిద్రలో ఉండగా ఇంటి పైకప్పు కూలడంతో పడుకున్నవాళ్లు పడుకున్నట్లే ప్రాణాలు విడిచారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. శిథిలాల నుంచి మృతదేహాలను తొలగించి పోస్టుమార్టానికి పంపించారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు. పైకప్పు కూలిన ఇల్లు 30 ఏళ్ల క్రితం నాటిదని, శిథిలావస్థకు చేరుకుని ఉండటంతో అకస్మాత్తుగా కూలిపోయిందని తెలిపారు.

## తమిళనాడులో 'సర్' చెల్లుబాటును సుప్రీంకోర్టులో సవాలు చేసిన సిపిఐ(ఎం)

**న్యూఢిల్లీ:** తమిళనాడులో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (సర్)ను వ్యతిరేకిస్తూ సిపిఐ(ఎం) సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తమిళనాడులో 'సర్' అమలుపై ఇప్పటికే అధికార డిఎంకె సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రంలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం చేపట్టాలని కేంద్రఎన్నికల సంఘం ఇచ్చిన మార్గదర్శకాలకు ఉన్న రాజ్యాంగబద్ధమైన చెల్లుబాటును సిపిఐ(ఎం) సవాలు చేసిం ది. ఈ ప్రత్యేక సవరణ ఏకపక్షం, అన్యాయం, రాజ్యాంగ విరుద్ధమని విమర్శించింది. ఈ విషయంపై డిఎంకె దాఖలు చేసిన పిటిషన్ మంగళవారంనాడు విచారణకు వస్తున్నందువల్ల తమ పిటిషన్‌ను కూడా ఆదే రోజు (నవంబరు 11) కలిపి విచారణ జరపాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రంలతో కూడిన ధర్మాసనానికి సిపిఐ(ఎం) తరపున వాదనలకు హాజరైన న్యాయవాది విజ్ఞప్తి చేశారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, ''మేం పరిశీలిస్తాం'' అని సమాధానం ఇచ్చింది. తమిళనాడులో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణను సవాలు చేస్తూ గతవారంలో డిఎంకెపార్టీ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై నవంబరు 11న విచారణ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. తాజాగా తమిళనాడు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.షన్ముగం పార్టీ తరపున 'సర్'పై పిటిషన్ దాఖలు చేశారు. ఒక నెలరోజుల వ్యవధిలో తమిళనాడులో ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణను పూర్తిచేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది అక్టోబరు 27వ తేదీన ఇచ్చిన ఆదేశాలను షన్ముగం సవాలు చేశారు. ఎన్నికల సంఘంఏకపక్షంగావ్యవహరిస్తోందని,అక్రమంగా, రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని పిటిషన్‌లో విమర్శించారు. ఐతే ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేయాలన్న లక్ష్యం విషయంలో ఎన్నికల సంఘంతో తమకు ఎలాంటి భేదాభిప్రాయాలులేవని స్పష్టం చేస్తూ,ప్రత్యేక సరవణకు విధించిన గడువు,అనుసరిస్తున్నపద్ధతిఆచరణాత్మకంగా లేదన్నారు.

ప్రజాపక్షం
మంగళవారం, 11 నవంబరు

# దోహా రాజకీయ డిక్లరేషన్

'సామాజిక అభివృద్ధికోసం' రెండవ ప్రపంచ సమ్మిట్ (అగ్రనాయక సమావేశం) తొలిరోజునే (నవంబర్ 4–6) దోహా రాజకీయ డిక్లరేషన్‌ను ఆమోదించటం ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమందిలో ఆశలు నింపుతుంది. అయితే దారిద్ర్యం, అసమానత, మంచి ఉపాధులు, అభివృద్ధికి నిధులు ప్రధాన ఆందోళనలుగా ఉన్నందున ఏ డిక్లరేషన్ అయినా విజయవంతంగా అమలు కావాలంటే సత్వర చర్యలు కీలకం. మనం అనేక అంతర్జాతీయ సమ్మిట్లలో అగ్రనాయకుల వాగ్దానాలతో కూడిన డిక్లరేషన్‌లు చూస్తుంటాం. ఉదాహరణకు ఈ మిలీనియం (శత సహస్రాబ్ది) ప్రారంభంలో వెనుకదేశాల అభివృద్ధికై శాశ్వత లక్ష్యాలపేరుతో సంపన్నదేశాల వాగ్దానాలతో కూడిన 'మిల్లీనియం డిక్లరేషన్' అమలు అసంపూర్తిగా వుంది. కాలావధి పొడిగించబడినా నెరవేరుతుందన్న గ్యారంటీ లేదు. ఎందుకంటే ఈ దోపిడీ ప్రపంచ వ్యవస్థల్లో అసమానత అగాథాలు పెరుగుతూనే ఉంటాయి. అయినా సమ్మిట్లు – డిక్లరేషన్‌లు మనిషిలో ఆశను సజీవంగా ఉంచుతాయి. శక్తి ఉంటే వాటిని నెరవేర్చాలని పోరాడేందుకు ప్రాతిపదికగా పనిచేస్తాయి.

దోహా రాజకీయ డిక్లరేషన్‌కూడా ఆ కోవలోకే వస్తుంది. మరింత న్యాయమైన, సమ్మిళిత సమాజాల నిర్మాణానికి ప్రపంచ నిబద్ధతను అది తెలియజేస్తున్నది. దారిద్ర్యం నిర్మూలన, మంచి ఉపాధులు కల్పించటం, అసమానతను తగ్గించటం, మానవ హక్కులను కాపాడటం అటువంటి సమాజాల నిర్మాణానికి ఆవశ్యకం. అందువల్ల సామాజిక అభివృద్ధి నైతిక ఆవశ్యకత మాత్రమే కాదు, శాంతి–సుస్థిరత, నిలకడైన అభివృద్ధికి తప్పనిసరి. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరెస్ ప్రారంభ పత్రికాగోష్టిలో ఇలా అన్నారు : ''సామాజిక అభివృద్ధికి అర్థం కొద్దిమంది సంపన్నులు కావటం కాదు, సామాజిక న్యాయం, పూర్తి ఉపాధి, మానవ గౌరవంతో అనేకమందికి అవకాశాలు''. దోహా రాజకీయ ప్రకటన ''అభివృద్ధికి బూస్టర్ షాట్,' ''ప్రజల ప్రణాళిక'' అని ఆయన అన్నారు. ఇది మాటలతో జరిగేది కాదు. ఇందుకు ప్రపంచ వ్యవస్థల్లో సంస్కరణలు, రుణభారం నుంచి ఉపశమనం, అందరి అభివృద్ధి, సమాజం అంచుల్లోని వారి సాధికారత సాధించటం అవసరం.

40కి పైగా దేశాల, ప్రభుత్వాల అధిపతులు, 170మంత్రుల స్థాయి ప్రతినిధి వర్గాలు, అంతర్జాతీయ సంస్థలు, యువజన, పౌరసమాజ అధిపతులు – మొత్తం 14 వేలమంది ప్రపంచం నలుమూలలనుంచీ పాల్గొన్నారు. సామాజికాభివృద్ధికి ఉద్దేశించిన తొలి ప్రపంచ సమ్మిట్ 1995లో కోపెన్‌హేగన్‌లో జరిగింది. ఆ సభ నిర్దేశించుకున్న లక్ష్యాలకు ప్రపంచాన్ని పునర్‌నిబద్ధం చేయటం, వాటిని శాశ్వత అభివృద్ధి (ఎస్‌డిజిఎస్) 2030 గమ్యాలతో సంధానించటానికి ఈ రెండవ సమ్మిట్ ఉద్దేశించింది. దోహా రాజకీయ డిక్లరేషన్ ఈ సమ్మిట్ ముఖ్య పత్రం. న్యూయార్క్‌లో అంతర్ ప్రభుత్వ సంబంధాల ద్వారా ముందుగా ఆమోదించిన డిక్లరేషన్‌ను సమ్మిట్ ఆమోదించింది. దారిద్ర్యం నిర్మూలన, సంపూర్ణ–ఉత్పాదక ఉపాధి/గౌరవప్రదమైన పని, సామాజిక సమైక్యత అనే అంతర్ సంబంధంగల మూడు ప్రాధాన్యతలను డిక్లరేషన్ వక్కాణించింది. ఇది రాజకీయ సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తూ, ఎజండా నిర్దేశిస్తున్నది. 1995 డిక్లరేషన్‌లో చేసిన వాగ్దానాలను సభ్య దేశాలకు గుర్తు చేసింది. వాటిలో వేటికి ప్రాధాన్యత ఇవ్వాలో నొక్కి చెప్పింది. డిజిటల్ పరివర్తన, ఎఐ, వాతావరణం, స్థితిస్థాపకత, అందరినీ చేరుకునే టెక్నాలజీలు, జెండర్ స్పందన దృక్పథాలు వగైరా కొత్త సమస్యలను జోడించింది.

సామాజికంగా అందరి అభివృద్ధి, మంచి ఉపాధులు, అసమానతల తగ్గింపు లక్ష్యాల సాధనలో వెనుకబడి ఉన్నందున రాజకీయ సంకల్పాలకు కొత్త ప్రోత్సాహం ఇస్తున్నదీ డిక్లరేషన్. సమగ్రమైన, తాజా పరిచిన ఎజండాలో దోహా డిక్లరేషన్ బలం ఇమిడి ఉంది. నిర్ణయాల అమలును సమీక్షించే ఏర్పాటు కూడా ఉంది. ఈ లక్ష్యాలు నెరవేర్చే దిశగా ప్రయాణించటానికి అనేక దేశాలకు ఆర్థిక వనరులు అవసరం – అంతర్జాతీయ సహకారం (ద్రవ్య వ్యవస్థ నిర్మాణంలో మార్పులు సహా) అవసరం. 'సామాజికాభివృద్ధికి ద్రవ్య సహాయం' పట్ల నిబద్ధత పునరుద్ఘాటన ఈ అవసరాన్ని, తమ బాధ్యతను సంపన్న దేశాలు గుర్తించినట్లే భావించాల్సి ఉంటుంది. ఏమైనా ప్రకటనలు, హామీలకన్నా కార్యాచరణ ప్రధానం. డిక్లరేషన్‌లు లీగల్‌గా శిరసావహించాల్సిన ఒడంబడికలు కావు. అందువల్ల వీటి అమలు ఆయా ప్రభుత్వాల సుముఖత, నేతల దృష్టి దృక్పథం, దేశ శక్తి సామర్థ్యాల మీద ఆధారపడి ఉంటుందని వేరే చెప్పనవసరం లేదు.

# భవిష్యత్ పౌరులను తీర్చిదిద్దే ప్రయోగశాలలే పాఠశాలలు



విద్యా దానం మహాదానం. విద్య లేనివాడు వింత పశువు. చీకటిని పారద్రోలి జ్యోతి వెలిగించేది విద్య మాత్రమే. మనిషి ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి విద్య దోహదం చేస్తుంది. భారతదేశానికి తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు, విద్యావేత్త, తత్వవేత్త, మైనారిటీ నాయకుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్. స్వాతంత్ర్యానంతరం భారతదేశం లో విద్యావ్యాప్తికి ఎనలేని కృషికి గుర్తింపుగా మౌలానా జన్మదినం సందర్భంగా నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవంగా భారత ప్రభుత్వం 2008లో ప్రకటన చేసింది. ఆయన 1947 నుండి 1958 వరకు విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. మౌలానా ఒక సంఘ సంస్కర్త, విద్య ద్వారానే దేశాన్ని నిర్మించడానికి కట్టుబడి ఉన్న నాయకుడు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్, మౌలానా సయ్యద్ అబుల్ కలాం గులాం ముహియుద్దీన్ అహ్మద్ బిన్ ఖైరుద్దీన్ అల్ హుస్సేన్ ఆజాద్ అనే పేర్లతో పిలుస్తారు. నవంబర్ 11,1808 లో జన్మించాడు. 11సం.ల వయస్సులో తల్లి మరణం తీరని లోటు. తన 13వ ఏట యువ జులేఖా బేగం తో వివాహం అయింది. అబుల్ కలాం గొప్ప పండితుడు, జర్నలిస్టు, భారతదేశానికి ఆయన చేసిన అతిపెద్ద సహకారం విద్య బహుమతి. అందుకే 1920 లో ఉత్తరప్రదేశ్‌లోని అలీగడ్ జామియా మిలియా ఇస్లాం మిక్ ఫౌండేషన్ కమిటీకి సభ్యుడిగా ఎన్నికైనాడు. అతి చిన్న వయసు 30 సంవత్సరాలకే భారత జాతీయ కాంగ్రెస్‌కు 1940 నుండి 1945 మధ్యకాలంలో అధ్యక్షుడైనాడు. ప్రారంభంలో తన తండ్రి తనకు గురువు. ఉర్దూలో అనేక కవితలు రాశాడు. 1912లో మౌలానా ముస్లింలలో దేశభక్తిని పెంపొందించుటకు, బ్రిటిష్ ప్రభుత్వ విధానాలపై దాడి చేయుటకు మౌలానా 'అల్ హిలాల్' అనే ఉర్దూ వార పత్రికలు ప్రారంభించాడు.

ఆధునిక ఐఐటి లు మౌలానా అబ్దుల్ కలాం ఆలోచనలే, 1951లో భారతదేశంలోని మొట్టమొదటి ఐఐటి (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)ఖరగ్‌పూర్‌లో స్థాపించాడు. ఢిల్లీలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, 1934లో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఏర్పాటుకు ఆయనే బాధ్యత వహించాడు. బెంగళూరులో ఇండియన్ ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సి) ఏర్పాటుకు కృషి చేసాడు. వీటి ఏర్పాటు భారతదేశం సాంకేతిక విద్య, పరిశోధన పురోగతిలో మైలురాయిగా చెప్పవచ్చును.

1948 జనవరి 16న ఒక సందర్భంలో ఆయన మాట్లాడుతూ, మనం ఒక్క క్షణం కూడా మర్చిపోకూడదు, కనీసం ప్రాథమిక విద్యను పొందడం ప్రతి వ్యక్తి జన్మహక్కు, అది లేకుండా పౌరుడిగా తమ విధులను నిర్వర్తించలేడు అన్నాడు. దేశాభివృద్ధిలో విద్య పోషించే ప్రాథమిక పాత్ర అని అన్నారు.

అంతేకాకుండా సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్‌గా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వయోజన విద్య, అక్షరాస్యతకు ఉత్సా హం ఇచ్చాడు. అలాగే విద్య, సంస్కృతిని ప్రోత్సహించుటకు సంగీత నాటక అకాడమిని 1953 లో స్థాపించాడు, 195 లో లలిత కళా అకాడమీ ని స్థాపించాడు. స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ ను స్థాపించిన ఆయన 14 సం.ల వయసు వరకు పిల్లలందరికీ ఉచిత మరియు తప్పనిసరి విద్య అవసరమని చాటి చెప్పాడు. మైనారిటీ విద్య బలోపేతానికి విద్యార్థులకు సహాయం రూపం లో అందించుటకు ఫెలోషిప్ లను ప్రవేశపెట్టాడు.

''భవిష్యత్తు పౌరులను ఉత్పత్తి చేసే ప్రయోగశాలలే పాఠశాలలు'' అన్న ఆయన దేశంలో మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖకు వన్నె తెచ్చాడు. ఆయన మరణానంతరం 1992 లో భారతదేశ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న' బిరుదు ఇవ్వడం జరిగింది. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా నవంబర్ 11న పాఠశాలలు, కళాశాలల్లో వ్యాస రచన, ర్యాలీలు, ఉపన్యాస పోటీలు, సెమినార్లు నిర్వహిస్తూ, స్వతంత్ర భారతంలో విద్యావ్యాప్తికి చేసిన కృషిని స్మరించుకుందాం.

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యాశాఖ మంత్రిగా మౌలానా అన్నట్లుగా విద్య పోషించే స్థాయిలో ఉండాలంటే విద్యారంగం మొత్తం ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలి. విద్య సామాన్యునికి భారం కాకుండా ఉన్నప్పుడే దేశాభివృద్ధిలో విద్య ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పవచ్చును. విద్యారంగంలో సమూల మార్పులు రావాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ల లో అధిక నిధులు కేటాయించాలి. అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ప్రతీ పాఠశాలకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి. విద్యారంగంలో, అక్షరాస్యతలో తెలంగాణ రాష్ట్రం ముందజ లో నిలపడానికి అందరం కృషి చేద్దాం.

**(నేడు తొలి విద్యామంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం )**

**కామిడి సతీష్ రెడ్డి,**
స్కూల్ అసిస్టెంట్ బయాలజీ,
9848445134.

# 'జయజయహే తెలంగాణ' స్వరానికి మరణం లేదు!

తెలంగాణ నేలపై అక్షరంతో, స్వరంతో చైతన్యాన్ని రగిలించిన ఉద్యమకవి, గేయ రచయిత అందెశ్రీ.

'జయజయహే తెలంగాణ' అంటూ కొత్త రాష్ట్ర ఆకాంక్షను ఆకాశానికి ఎత్తిన ఆ గొంతు నేడు మూగబోయినా, ఆయన అక్షరానికి, ఆ స్వరానికి మాత్రం మరణం లేదు. కవిత్వం ద్వారా, పాటల ద్వారా సమాజాన్ని ప్రశ్నించిన ఆయన ధిక్కారస్వరం, తరాలు మారినా, పాలకుల తీరు మారినా ఎప్పుడూ ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది.

అందెశ్రీ కవిత్వానికి, పాటలకు తెలంగాణ ఉద్యమంతో విడదీయరాని బంధం ఉంది. ప్రత్యేకించి 'జయజయహే తెలంగాణ' గీతం కేవలం ఒక పాట కాదు; అది తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షకు, పోరాట త్యాగాలకు ప్రతీకగా నిలిచిన ఉద్యమ గీతం. ఆయన పాట తెలంగాణ సంస్కృతిని, చరిత్రను, పోరాట పటిమను ప్రతిబింబించింది. ఆ పాటలోనే ఆయన చిరంజీవిగా నిలిచి ఉంటారు.

తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన పదేళ్ల తరువాత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చొరవతో ఈ ఉద్యమ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించడం అనేది అందెశ్రీ సాహిత్యానికి దక్కిన అత్యున్నత గౌరవం. ఆ విధంగా, ఆయన గళం శాశ్వతత్వం పొంది, తెలంగాణ చరిత్ర ఉన్నంత కాలం మార్మోగుతూనే ఉంటుంది. ఈ నిర్ణయం ఆయన రచనల ప్రాముఖ్యతను నేటి తరానికి, భావితరాలకు బలంగా చాటి చెబుతుంది.

**స్వార్థంపై ధిక్కార స్వరం**

అందెశ్రీ కేవలం ఉద్యమ కవి మాత్రమే కాదు, సమాజంలోని స్వార్థాన్ని, మానవత్వం లేని మనుష్యుల గురించి నిశితంగా ప్రశ్నించిన కవి. 'మాయమైపోతున్నడమ్మా' అంటూ తన పాట ద్వారా నేటి బీరకాయలాంటి మానవ సమాజంలో పెచ్చుపెరిగిన స్వార్థాన్ని, డబ్బు, పదవుల కోసం కళను తాకట్టు పెట్టి దొరలకు ఊడిగం చేసిన కవులు, రచయితలు, కళాకారుల ధోరణిని ఆయన నిస్సంకోచంగా ధిక్కరించారు. పదవుల కోసం కళను, సిద్ధాంతాన్ని పణంగా పెట్టేవారికి వ్యతిరేకంగా ఆయన గళం ఎప్పుడూ ధైర్యాన్ని, చైతన్యాన్ని అందించేది. ఆయన పాట ప్రజలకు గుణపాఠం నేర్పేది, అన్యాయాన్ని ప్రశ్నించే స్ఫూర్తిని నింపేది.

**భావితరాలకు నిలిచే ఆదర్శం**

ఆయన కవితా అందెల స్వరానికి మరణం లేదు. ఎందుకంటే ఆయన పాటలు కేవలం వర్తమానం కోసం రాసినవి కావు; అవి నాటికి, నేటికి, రేపటికి కూడా సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాయి. నేటి యువత, కళాకారులు పదవుల వ్యామోహంలో పడకుండా, నిజాయితీగా కళా సేవ చేయాలనే గొప్ప ఆదర్శాన్ని అందెశ్రీ తన జీవితం ద్వారా, సాహిత్య వారసత్వం ద్వారా చూపించారు. పాట రూపంలో ప్రశ్నించే ఆ గొంతుక మూగబోయినా, ఆ పాట మాత్రం సజీవంగా ఉండిపోయింది. ఇది తెలంగాణ కళాకారులకు, రచయితలకు ఎప్పటికీ ప్రేరణగా, చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆయన అందించిన సాహిత్య వారసత్వం అజరామరం, అది తెలంగాణ గడ్డపై ఎప్పటికీ మార్మోగుతూనే ఉంటుంది.

**వెంకగారి భూమయ్య,** 9848559863

## మానవత్వాన్ని పునర్జీవింపజేసిన కవి కానీ...

ప్రజాజీవనం, ప్రకృతి సౌందర్యం, మానవ సంబంధాలు, నదులు, గ్రామీణ జీవితం వంటి అంశాల నేపథ్యంగా కవిత్వాన్ని అల్లిన సహజ కవి అందెశ్రీ. జయజయహే.. అంటూ తెలంగాణ కీర్తిని ప్రపంచానికి చాటిన అందెశ్రీ గొంతు మూగబోయింది.'పల్లె నీకు వందనాలమ్మో' అన్న గాత్రం ఇక వినిపించకుండా పోయింది. 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు' అంటూ ఆధునిక యుగ పోకడను ప్రశ్నించిన ఆ స్వరం మౌనంగా ఉండిపోయింది. 'జనజాతరలో మన గీతం' అంటూ దద్దరిల్లిన కంఠం కనుమరుగైంది. ఇలా తన రచనలతో సమాజాన్ని జాగృత పరిచిన అందెశ్రీ గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. తెలంగాణ సాహితీ శిఖరం, ప్రజల కవి అందెశ్రీ మరణం తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను కలిగించింది. అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. 1961 జూలై 18న సిద్దిపేట జిల్లా రేబర్తిలో జన్మించాడు. ఆశువు కవిత్వం చెప్పడంలో అందెశ్రీ దిట్ట. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. తన అక్షరాన్ని ఇంధనంగా మార్చి ప్రజల్లో నిత్య చైతన్యాన్ని జ్వలింపచేసిన గొప్ప యోధుడు. నిత్యం పేదల పక్షాన గొంతును వినిపించిన నిస్వార్థ తెలంగాణ మట్టి మనిషి. నిరుపేద కుటుంబంలో పుట్టిన ఆయన అసలు బడికి వెళ్ళలేదు. అక్షరాలు నేర్చుకోలేదు. పశువుల కాపరిగా జీవనం సాగించారు. తరువాత కొన్ని రోజులు తాపీపని చేశారు. నిజామాబాద్‌లో శృంగేరి మఠానికి సంబంధించిన స్వామీ శంకర్ మహారాజ్ ఆయనను చేరదీసి ఆయన పేరును అందె శ్రీగా మార్చారు. అక్కడ నుంచి ఆశువుగా పాటలు పాడారు. తరువాత రాయడం నేర్చుకున్నారు. కొద్దిగా చదువుకున్నారు.

**తెలంగాణ ఉద్యమ గీతం ఆవిర్భావం**

మొదట యలమంచిలి శేఖర్ సినిమాల్లో పాటలు రాసే అవకాశాన్ని కల్పించారు. అలా ఆయన విప్లవ సినిమాలు తీసే నారాయణ



మూర్తి సినిమాలలో పాటలు రాశారు. బతుకమ్మ అనే సినిమాకి మాటలు కూడా అందించారు. తెలంగాణా ఉద్యమ సమయంలో తెలంగాణ ధూం.. ధాం పేరుతో ఆయన తన పాటలతో ఉద్యమాన్ని ఉరకలెత్తించారు. ఆ సమయంలో 2003 మార్చి 2న కామారెడ్డిలో జరిగిన తెలంగాణ ధూంధాంలో మనకంటూ ప్రాంతీయ అస్తిత్వంకై ఒక పాట ఉండాలని భావించాడు. ఆ ఆలోచన నుంచి పురుడు పోసుకున్న పాటే 'జయ జయహే తెలంగాణ'. దానిని ఆదిలాబాద్‌లో 2003 నవంబరు 11న నిర్వహించిన ధూం.. ధాంలో మొదటిసారిగా పాడారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఆ పాట తెలంగాణలో ఏ మీటింగ్ జరిగినా.. స్కూల్స్, కాలేజీలోనైనా మారు మోగింది. నిజానికి ఇది తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో 9 డిసెంబర్ 2009 తరువాత బాగా అందరికీ తెలిసింది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ఈ పాటను రాష్ట్ర పాటగా గుర్తిస్తారని అందరు భావించారు. కానీ, ఎందుకో ఏమో కానీ అది జరగలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పాటను రాష్ట్రగీతంగా ప్రకటించింది. దేశ స్వతంత్ర ఉద్యమంలో వందేమాతరం విముక్తి గీతం అయితే... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంత విముక్తి గీతంగా జయ జయహే తెలంగాణ కీర్తి గడించిందనీ చెప్పవచ్చు. అందెశ్రీ భౌతికంగా మన మధ్య లేకపోయినా తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతమైన 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' గేయం రూపంలో నిత్యం ప్రజల గుండెల్లో నిలిచి ఉంటారు.

**మానవత్వం పరిమళించే కవి కానీ...**

ప్రజాకవి, ప్రకృతి కవిగా గుర్తింపు పొందిన అందెశ్రీకి ఎన్నో పురస్కారాలు పొందాడు. కాకతీయ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందాడు. 2006లో గంగ సినిమాకు అందెశ్రీకి నంది పురస్కారం అందుకున్నాడు. 2015లో దాశరథి సాహితీ పురస్కారం, 2015లో రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం అందుకున్నాడు. 2024లో దాశరథీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారం, లోక్ నాయక్ పురస్కారం అందుకున్నారు. చారిత్రకంగా దళిత సమాజం చుట్టూ అల్లుకున్న వివక్షత, బాధనే కవులు, కళాకారులు, రచయితలను పుట్టిస్తుంది. తమ జాతిని గమ్యాన్ని చేర్చే తాత్వికచింతన కలిగిన రచనలు చేయకపోవడం గమనార్హం. ఇది అందెశ్రీలో కూడా కనబడుతుంది. ఆయన మొదట్లో సహజంగానే మానవత్వం పరిమళించి, సమాజ విముక్తిని కోరుకున్నాడు. కానీ ఆధిపత్య వర్గాల వశీకరణతో తన పాటలు, కవిత్వం దారితప్పింది. యుద్ధ స్వభావాన్ని కోల్పోయి కాలాన్ని వృధా చేశాడు. ప్రపంచంలోని మిసిస్సిపి, మిస్సోరీ, అమెజాన్, నైల్ లాంటి మహానదుల వెంట ప్రయాణిస్తూ నదులపై కవిత్వం రాయాలని ప్రపంచమంతా తిరగడమే దీనికి నిదర్శనం. దళిత జాతిలో పుట్టిన అందెశ్రీ దళిత విముక్తికి పాటుపడిన అంబేద్కర్, పూలే వంటి మహనీయుల పోరాట తత్వం తన కవిత్వం, పాటల్లో ప్రజ్వరిల్లలేకపోయింది. అగ్రకుల పార్టీల ఉద్యమాలకు, అధికారానికే తన శ్రమనంత ధారపోసారు. ఇప్పటికీ అనేకమంది కవులు, కళాకారులు ఇదే ఒరవడితో కొనసాగిస్తున్నారు. స్వశక్తితో నడిచే అట్టడుగు అణగారిన వర్గాల విముక్తి కోసం సాగే ఉద్యమాలకు తోడుగా రచనలు, కవిత్వం సాగాలి. లేదంటే నిష్ప్రయోజనమే. సమాధానం లేని మరణమే అవుతుంది. ఏది ఏమైనా తన పాటలతో నిరంతరం సమాజాన్ని చైతన్యంచేసి మనిషిని, మానవత్వాన్ని తిరిగి చిగురింపచేయాలని పరితపించిన కవి, గాయకులు అందెశ్రీ కి అశ్రునివాళి.

**సంపతి రమేష్ మహారాజ్**
7989579428

## కవిత్వంతో ఉద్యమాన్ని రగిలించిన లోక కవి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఆ గొంతుక, ఆ కలం నుంచి వెలువడిన పాటలు జీవనాడిలా, ఊపిరిలా నిలిచాయి. 'మాయమై పోతున్నడమ్మా మనిషన్న వాడు' అనే పాట ఆధునిక సమాజంలో మానవీయ విలువలు, నైతిక ప్రమాణాలు ఎలా పతనమవుతున్నాయో, మనిషి కేవలం స్వార్థంతో ఎలా జీవిస్తున్నాడో లోతుగా విశ్లేషిస్తూ యావత్ ప్రజానీకాన్ని ఆత్మవిమర్శ చేసుకునేలా ఆలోచింపజేసింది. ఆ పాటలోని ఆర్తి, సందేశం ఆయన రచన ఎంత గొప్పదో చాటుతుంది. అనుక్షణం ప్రజల మధ్యనే జీవిస్తూ, తాను నడియాడిన నేలను విడిచి బ్రతకలేనంటూ తన తుది శ్వాస వరకు ఒక సామాన్య మానవుడిగానే జీవించి, తన సాహిత్యంతో కోట్ల ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నాడుఆ అద్వితీయ వాగ్గేయకారుడు అందెశ్రీ.

ఆయన రచనలు చరిత్రపుటల్లో శాశ్వతంగా నిలిచిఉంటాయి. అందుకు నిలువెత్తు నిదర్శనం ఈ పాట 'జయ జయహే తెలంగాణ' గీతం. ఈ గీతం తెలంగాణ రాష్ట్ర ప్రజల ఉద్యమ స్ఫూర్తికి, చరిత్రకు, సంస్కృతికి, గొప్పదనానికి సజీవ రూపంగా అద్దం పడుతుంది. దీని ప్రాధాన్యతను గుర్తించి, ఇది తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించబడింది.

మలిదశ తెలంగాణ ఉద్యమంలో కవిగా, సాంస్కృతిక సారథిగా అందెశ్రీ నిరుపమానమైన, మహోన్నతమైన పాత్ర పోషించారు. ఆయన పాటలు, కవిత్వం తెలంగాణ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని, అంతర్గత చైతన్యాన్ని నింపాయి. తెలంగాణ ధూంధాం కార్యక్రమాలకు రూపకల్పన చేసి, రూపశిల్పిగా ఉండి ప్రజల్లో రాజకీయ అవగాహన కల్పించారు. ఆయన రచనలు తెలంగాణ ప్రజల సామ్యవాద ఆకాంక్షలకు ప్రతిబింబాలుగా నిలిచాయి.

అందెశ్రీ జీవితం, కవిత్వం సాహిత్యానికి పాఠశాల విద్య అడ్డంకి కాదని, కేవలం అనుభవం, నిబద్ధత, ప్రజలపై నిస్వార్థమైన ప్రేమ ఉంటే సరికొత్త చరిత్రలు సృష్టించవచ్చని నిరూపించింది. ఆయన పాటలు తరతరాలకు తెలంగాణ సంస్కృతి, ఉద్యమ స్ఫూర్తిని అందిస్తూనే ఉంటాయి. ఆయన కేవలం కవి కాదు, తెలంగాణ ఆత్మగౌరవానికి శాశ్వత ప్రతీకగా నిలిచిన ప్రజాకవి, యుగపురుషుడు.

**కొండేటి ప్రకాష్,**
7981781086

## జోహార్

*తెలంగాణ*
చెలకల్ల తంగేడు పూవు నేల రాలింది

*తెలంగాణ*
గుట్టల్ల రాళ్ళు డప్పులై మోగుతున్నాయి

*తెలంగాణ*
మోదుగులు నేల కూలి చితిని పేరుస్తున్నాయి

*తెలంగాణ*
ఒర్రెల్లో నీళ్ళు చివరి మజిలీ నీళ్ళు తాపుతున్నాయి

*తెలంగాణ*
కామంచి గునుగు గోగు గుమ్మడి కట్ల పూలు
సీత జడపూలు దారెంట పాన్పులౌతున్నాయి
తెలంగాణ చరిత్రను పుక్కిట పట్టిన
ఆశు కవి ఇక చాలని పోరాటం ఆపేసాడు
చరిత్రలో నిలిచి పోయాడు
జయజయహే తెలంగాణ గొంతు
మూగబోయింది! జోహార్!! అందెశ్రీ!!

**గిరి ప్రసాద్ చెలమల్లు**
9493388201

# 8వ వేతన సంఘం చివరిదా : ఉద్యోగులకు ముప్పు ఉందా?



ఎం.కోటేశ్వరరావు

కేంద్ర ప్రభుత్వం ఎనిమిదవ వేతన కమిషన్ నియామకం చేసింది. ఈమేరకు నవంబరు మూడవ తేదీన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ రోజు నుంచి పద్దెనిమిది నెలల్లో నివేదికను సమర్పించాలని దానిలో నిర్దేశించారు. నరేంద్ర మోదీ సర్కార్ ఏర్పాటు చేసిన తొలి సంఘం ఇది. ఈ క్రమాన్ని చూసినపుడు ప్రతిదాన్నీ ఓట్లకోసం ఎలా వినియోగించుకుంటున్నారో దీన్లో కూడా చూడవచ్చు. ఏడవ వేతన సంఘాన్ని 2014 ఫిబ్రవరిలో నియమించగా 2015 నవంబరులో నివేదిక సమర్పించింది. ఈ లెక్కన ఈ పాటికి ఎనిమిదవ వేతన సంఘ నివేదిక కేంద్ర ప్రభుత్వానికి అందాల్సి ఉంది. దూరాలోచన లేదా దురాలోచనతో ఎన్నికల కోసం ఆలస్యం చేశారనిపిస్తోంది. సరిగ్గా ఢిల్లీ ఎన్నికలకు ముందు ప్రకటన చేశారు. ఇప్పుడు బిహార్ ఎన్నికల సందర్భంగా కమిషన్ నియామకాన్ని ప్రకటించారు. దీని సిఫార్సులు, కేంద్రం పరిశీలించి అమలు చేయాల్సిన సమయానికి లోక్‌సభ ఎన్నికలు వస్తాయి. ఈ కమిషన్ సిఫార్సులు 2028లోగా అమల్లోకి వచ్చే అవకాశం లేదని సీనియర్ అధికారులు చెబుతున్నారంటే దాని అర్థం అదే. మరొక ప్రమాదం ఏమిటంటే బకాయిలను ఎగవేసే అవకాశం కూడా ఉందని చెబుతున్నారు. ఎన్నికల ముందు అమలు చేసి చూశారా మీకు ఎంత మేలు చేశామో, దానికి మాకేమిటి అని అడిగేందుకు ఒక ప్రచార అస్త్రంగా ఉండనుంది. ఏడవ వేతన కమిషన్ 2015 నవంబరులో నివేదికను అందచేస్తే 2016 జూన్‌లో కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఒకవైపు డిజిటల్ రంగంలో ముందున్నాం అంటారు. వివరాలు తెప్పించుకొనేందుకు ఎన్ని సంవత్సరాలు కావాలి? అసలు విషయం ఏమిటంటే ప్రతి వేతన సంఘం వేసినపుడు వేతనాలు, పెన్షన్లు, బకాయిల చెల్లింపుకు బడ్జెట్ కేటాయింపులు జరపాల్సి ఉంటుంది. ఎన్నికల ముందు అది ప్రభుత్వానికి పెద్ద అగ్ని పరీక్షే. బీహార్‌లో బిజెపి చంకనెక్కిన నితీష్ కుమార్ దశాబ్దాల పాలనలో కనీసం ఆలోచించని అంశాలను కూడా ఆఘమేఘాల మీద అమలు చేశారు. చంద్రబాబు నాయుడు 2019 ఎన్నికల సమయంలో మహిళలను ఆకట్టుకొనేందుకు పసుపు కుంకుమల పేరుతో చేసిన మాదిరి రెండు కోట్ల మంది మహిళలకు తలా పదివేల చొప్పున వారి ఖాతాలకు బదిలీ చేశారు. సామాజిక పెన్షన్ల పెంపు ప్రకటన చేశారు. ఇవన్నీ సరిగ్గా అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు కొద్ది రోజుల ముందు జరిగాయి. ఓట్లకోసం మేము ఏదీ చేయం అని నరేంద్రమోడీ చెప్పేదానికి ఆచరణకు ఇది నిదర్శనం. అయితే కూటి కోసం కోటి విద్యలు అన్నట్లుగా వేస్తున్న వేషాలను చూసి జనం ఓట్లేస్తారా ? నిజంగా అలా జరిగి ఉంటే అయోధ్యలో బిజెపి ఎందుకు ఓడిపోయింది, కాశీ విశ్వనాధుని సన్నిధిలో 4.79లక్షల నుంచి 1.52లక్షల ఓట్లకు మోడీ మెజారిటీ ఐదేండ్లలో ఎందుకు తగ్గిపోయింది ? పదేండ్లకు ఒకసారి నియమిస్తున్న వేతన సంఘం ఉద్యోగులు, పెన్షనర్ల మీద ఖర్చు ఎలా తగ్గించాలా అని చూస్తున్నది, అయితే సంఘటితంగా ఉద్యోగులు ఉన్న కారణంగా వాటి అజెండా పూర్తిగా అమలు చేయటం సాధ్యం కావటం లేదు. ఇప్పుడు కూడా అదే జరగనుందా ?

వేతన, పెన్షన్ బిల్లుల గురించి గుండెలు బాదుకుంటూ మీడియాలో విశ్లేషణలు రాస్తున్నారు. వంది మాగధులు రాజుగారి మనసెరిగి వ్యవహరిస్తారన్నది తెలిసిందే. ఇదీ అంతే ! వేతనాలకు మించి పెన్షన్ బిల్లు పెరిగిపోతోందన్నది వాటిలో ఒకటి. భవిష్యత్‌లో ఉద్యోగులకు వార్షిక ఇంక్రిమెంట్లను వారు అందించిన సేవలు, డిజిటల్ పాలన మైలురాళ్లు, పౌరుల సంతృప్తి సూచికల ప్రాతిపదికన ఇవ్వాలని ఆర్థికవేత్తలు సలహా ఇస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగ చరిత్రలో ఎనిమిదవ వేతన సంఘ కసరత్తు పెనుసవాళ్లతో కూడిన వాటిలో ఒకటిగా రూపుదిద్దుకుంటున్నదట. కోటీ ఇరవై లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లే కాదు, అంతకంటే ఎక్కువగా ఉండే రాష్ట్రాల సిబ్బంది మీద కూడా ఈ కమిషన్ సిఫార్సుల ప్రభావం పడనుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 50లక్షల మంది వరకు ఉండగా పెన్షనర్లు 69లక్షల మంది ఉన్నారని, రాబడిలో 18శాతం వేతనాలు, పెన్షన్లకే పోతున్నదని, ఒకవైపు పొదుపు మరోవైపు న్యాయమైన వేతన సవరణ డిమాండ్ల మధ్య పోరు జరగనుందని చెబుతున్నారు. ప్రైవేటు రంగానికి నిపుణులైన వారు వెళుతున్నందున ప్రభుత్వ రంగానికి వారిని ఆకర్షించేందుకు 1990దశకం నుంచి ప్రతి వేతన కమిషన్ సిఫార్సులలో వేతన వృద్ధి దేశ తలసరి ఆదాయ వృద్ధి రేటుకంటే ఎక్కువగా ఉంటున్నదట. వేతన, పెన్షన్ ఖర్చు పెరిగిపోవటం వలన మౌలిక సదుపాయాలు, విద్య,ఆరోగ్య రంగాలకు నిధుల కొరత ఏర్పడుతున్నదట. ఒక ఏడాది కాగానే ఇంక్రిమెంట్, కరువు భత్యం వాయిదాలు చెల్లించటం కాకుండా సామర్ధ్యం, ఉత్పాదకత ప్రమాణాలు దాటిన తరువాతే ఇవ్వాలని కొందరు సూచిస్తున్నారు.దానికి అనుగుణంగానే జస్టిస్ రంజనా దేశాయ్ ఆధ్వర్యంలోని ఎనిమిదవ వేతన కమిషన్‌కు ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు ఉన్నాయి. వీటిని చూసిన తరువాత ఇదే చివరి వేతన సంఘం అన్న వారు కూడా ఉన్నారు.

గతంలో బిజెపి నేత వాజ్‌పాయి నాయకత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం 2004లో అమల్లోకి తెచ్చిన నూతన పెన్షన్ పథకం(ఎన్‌పిఎస్) తరువాత కూడా పెన్షన్ బిల్లు పెరగటానికి సగటు జీవిత కాలం పెరగటం ఒక కారణం. ఈ పెన్షన్ విధానం ద్వారా బిల్లు తగ్గాలంటే 2040 వరకు ఆగాల్సిందే,ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ వార్షిక పెన్షన్ బిల్లు రు.2.6లక్షల కోట్లు దాటింది. విదేశీ కంపెనీలు, స్వదేశీ కార్పొరేట్లకు ఇచ్చే రాయితీలు మొత్తం తిరిగి దేశంలో పెట్టుబడులుగా రావటం లేదు, ఇతర దేశాలకు చేరుతున్నాయి. విదేశీ పెట్టుబడుల ముసుగులో మరిన్ని రాయితీలు పొందేందుకు తిరిగి ఇక్కడికే చేరుతున్నాయి లేదా ఎక్కడ లాభసాటిగా ఉంటే అక్కడికి వెళుతున్నాయి. కానీ ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చే మొత్తాలు అలాంటివి కాదే, నల్లధనంగా మారి స్విస్ వంటి పన్ను స్వర్గాలకు చేరటం లేదు. ఇక్కడే వస్తు, సేవల వినియోగానికి జీవితకాలంలో ఒక స్వంత ఇంటిని, పరిమితంగా బంగారం, ఇతర ఆస్తులను కూడబెట్టుకొనేందుకు వినియోగపడుతుంది. జిఎస్‌టి రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తిరిగి చేరుతున్నది.

ప్రకటించిన వివరాల మేరకు పద్దెనిమిది నెలల్లో నివేదిక అంటే సమర్పణకే 2027 ఏప్రిల్ వరకు ఆగాల్సిందే. ఇతర కారణాలు చూపి ఆలస్యం చేస్తే చేయగలిగిందేమీ లేదు. మధ్యంతర నివేదికను కూడా ప్రకటించవచ్చు. నూతన వేతనాలు 2026 జనవరి ఒకటి నుంచి అమల్లోకి రావాల్సి ఉంది. వేతన కమిషన్ ఇంతవరకు ఉద్యోగుల ముందు ఎలాంటి ప్రతిపాదనలు చేయలేదు. అయితే ఫిట్‌మెంట్ ఫాక్టర్ 2.86ప్రకారం రు.19వేల వరకు వేతనాలు పెరగవచ్చని కొందరు చెబుతున్నారు. గత వేతన కమిషన్ 2.57ను తీసుకుంది. దాని ప్రకారం మూల వేతనం రు.7 నుంచి 18వేలకు పెరిగింది. ఇప్పుడు రు.18వేల నుంచి రు.46,260, పెన్షన్ రు.9 వేల నుంచి రు.23,130కి పెరగవచ్చని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. అయితే కేంద్ర మాజీ ఆర్థిక శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 1.92గా ఉండవచ్చని, కనీస వేతనం రు.34,500 అవుతుందని చెప్పారు. మధ్య స్థాయిలో ఉండే ఉద్యోగి వేతనం ప్రస్తుతం రు. ఒక లక్ష ఉన్నదని, వేతన పెంపుదల శాతాన్ని బట్టి దానికి అదనం అవుతుందని భావిస్తున్నారు.ఉదాహరణకు ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్ 2.5 అనుకుంటే అది రెండున్నర లక్షలు అవుతుంది. కమిషన్ ఎలాంటి సిఫార్సులు చేసినప్పటికీ దాన్ని ప్రభుత్వం సవరించవచ్చు.

దేశంలో తొలి వేతన కమిషన్ 1946లో ఏర్పాటు చేశారు. శ్రీనివాస వరదాచారి చైర్మన్. కనీస వేతనంగా రు.55, గరిష్టవేతనం రు.2,000 సిఫార్సు చేశారు. ఏడవ వేతన సంఘం కనీస, గరిష్ట వేతనాలు రు.18,000 మరియు రు.2,50,000గా ఉన్నాయి. ధరల పెరుగుదల కారణంగా 1957లో ఏర్పాటైన రెండవ కమిషన్ కరువు భత్యాన్ని సిఫార్సు చేసింది. 1983 ఐదవ వేతన కమిషన్ ఇంటి అద్దెను సిఫార్సు చేసింది. నాలుగవ వేతన సంఘం అంతకు ముందు ఏడాదికి నాలుగుసార్లు డిఏ ప్రకటించే విధానాన్ని రద్దు చేసి ఏడాదికి రెండు సార్లు ప్రకటించేట్లు సిఫార్సు చేసింది. నూతన వేతన సంఘనియామకానికి ముందు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు పదిహేను డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచాయి.వాటిని వేతన సంఘం పరిగణనలోకి తీసుకొని మధ్యంతర సిఫార్సులు చేస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది. జీవన వేతన అవగాహనకు అనుగుణంగా కనీస వేతన నిర్ణయం ఉండాలని, ఒకటి నుంచి 4వ స్థాయి వరకు విలీనం చేయాలని, మధ్యంతర భృతి, నూతన పెన్షన్ విధాన రద్దు వంటివి వాటిలో ఉన్నాయి. ఎనిమిదవ వేతన సంఘం గురించి ఒక్క ముక్కలో చెప్పాలంటే వేతన సంఘం అంటే వేతనాలు, పెన్షన్లు, అలవెన్సులను సిఫార్సు చేయటమే కాదు.ఇప్పుడు దేశంలో అమలు జరుగుతున్న విత్త నమూనా తట్టుకొని నిలుస్తుందా లేదా అన్నది కూడా తేలాల్సి ఉంటుందని కొందరు విశ్లేషకులు పేర్కొన్నారంటే ఏదో ముప్పు మూడినట్లే కనిపిస్తోంది. 2026 జనవరిలోగా ఉద్యోగవిరమణ చేసే వారికి నూతన వేతనాలు, పెన్షన్లు వర్తిస్తాయా లేదా అన్నది అనుమానమే. అందువలన ఈ వేతన సంఘం 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి దాని మిత్రపక్షాలకు ఒక అగ్ని పరీక్షగా మారనుందని కూడా చెప్పవచ్చు.

## ఫార్మాసిటి భూముల్లో వేసిన పంట కొంటాం

**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల పరిధిలోని ఫార్మాసిటీ గ్రామాలైన మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని భూముల్లో రైతులు పత్తి, వరి, ఇతర పంటలు వేశారు. వ్యవసాయం పైనే రైతులు అధారపడి జీవిస్తున్నారు. ఫార్మా సిటీకి భూములు ఇవ్వని రైతులు పండించిన వరి, పత్తి పంటను ప్రభుత్వం కోనదని వచ్చిన వార్తల్లో ఎలాంటి నిజం లేదని మండల వ్యవసాయాధికారి అర్.రవినాథ్ తెలిపారు. సోమవారం యాచారం మండల కేంద్రంలో అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తనను అడుగ కుండానే కొంతమంది ఇష్టా రాజ్యంగా పత్రికల్లో కథనాలు రాస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండల వ్యవసాయాధికారి పేర్కొన్నారు. ఆ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని అన్నారు. అవిషయాన్ని రైతులెవ్వరు నమ్మవద్దని తెలిపారు. పత్తి, వరి పంట వేసిన రైతులు తమ వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి పత్తి, వరి పంటను అన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి తెలిపారు. పత్తి పంటను కాపాసు కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. వరి పంటను కోనుగోలు కేంద్రాలకు తీసుకేళ్లి విక్రయించాలన్నారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వనస్థలిపురం డివిజన్‌లోని నాగార్జున కాలనీలో సిసి రోడ్డు పనుల కోసం రూ.16 లక్షల వ్యయంతో మంజూరు చేసిన పనులను సోమవారం వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి కాలనీ వాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో ప్రతి కాలనీలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు చంద్రరెడ్డి, కార్యదర్శి వి. రామ్ కృష్ణరెడ్డి, లక్ష్మ ణ్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీసామ, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, బాలరాజు గౌడ్, చంద్రశేఖర్ గుప్త, రవికుమార్, దయకర్‌చాయారి తదితరులు పాల్గొన్నారు.



## రాజీమార్గమే లక్ష్యంగా కేసుల పరిష్కారానికి కృషి చేయండి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** రాజీమార్గమే రాజమార్గం లక్ష్యంగా కేసులు పరిష్కారం అయ్యే విధంగా పోలీసులు కృషి చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ సర్పన్, 16 జిల్లా అదనపు మరియు సెషన్స్ జడ్జి స్వాతిరెడ్డి సూచించారు. సోమవారం షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీ నారాయణ సారధ్యంలో డివిజన్‌లోని వివిధ పోలీస్ స్టేషన్ల పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ స్వాతిరెడ్డి మాట్లాడుతూ కేసుల పరిష్కారం దిశగా కొనసాగుతున్న జాతీయ లోక్ ఆదాలత్‌లో పోలీసుల ప్రమేయం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈసారి నిర్వహించన్న లోక్ ఆదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు పోలీసులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవి, షాద్‌నగర్ సిఐ విజయ్‌కుమార్, కేశంపేట సిఐ నరహరి, కొందుర్గు ఎస్ఐ రవీందర్‌నాయక్, చౌదరిగూడ ఎస్ఐ విజయ్‌కుమార్, కొత్తూరు ఎస్ఐ గోపాలకృష్ణ, నందిగామ ఎస్ఐ యాదయ్యతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## గీత కార్మికులకు న్యాయం చేయాలి



**ప్రజాపక్షం/షాబాద్:** గీత కార్మికులకు న్యాయం చేయాలని ఎక్సైజ్ శాఖ చేవెళ్ల అధికారులకు సోమవారం జిల్లా గీత కార్మిక సంఘం అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ సంఘం సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం గీత కార్మికులకు చెల్లించవలసిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గీత వృతిదారులకు సంక్షేమం ఆధనీకరణ అభివృద్ధి కోసం 10 ఎకరాల భూమి కేటాయించి వృత్తి నైపుణ్యాన్ని అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు సూబాన్ గౌడ్, కృష్ణ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి : సత్యం



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో వరి ధాన్యం కోనుగోలు కేంద్రాన్నిఏర్పాటు చేయాలని చింతపట్ల గ్రా మ సిపి(ఐ)యం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శులు సిహెచ్ సత్యం, గిరికాంత్‌లు డిమాండ్ చేశారు. సోమవారం ధాన్యం కోనుగోలు కేంద్రం వద్దకు వెళ్ళి పరిశీలించారు. ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సకాలంలో ధాన్యం కోనుగోలు కేంద్రాలను ఎర్పాటు చేయక పోవడంతో రైతులు మధ్య ధళారిలను అశ్రయించాల్సిన దుస్థితి నేలకోందన్నారు. కార్యక్రమంలో అర్ క్రిష్ణ,గిరి, ప్రభాకర్,మచ్చ జంగయ్య,ఎ. రమేశ్,ఎం. గణేశ్, కె. రమేశ్, మస్కు ప్రేమ్,రైతు తకొండ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అందెశ్రీకి నివాళి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అందెశ్రీ మరణం సాహితీ లోకానికి తీరని లోటని నేతలు పేర్కొన్నారు. సోమవారం కేశంపేట జడ్పిటిసి తాంద్ర విశాల శ్రావణ్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఫరూఖ్‌నగర్ మాజీ జడ్పిటిసి సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డిలు అందెశ్రీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోపియేషన్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దొడ్డి రవీందర్, నేతలు రవికుమార్ గౌడ్, అదెట్ల రాజు, మేకల వెంకటేష్, రావుఫ్, రాఘవేందర్, అదిత్యరెడ్డి, తంగెడుపల్లి శంకర్, జువ్వు సుధాకర్, మదాసి కుర్వ సంఘం నేత డాక్టర్ విఠల్, శేఖర్‌లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం



**ప్రజాపక్షం/కేశంపేట:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు నిర్వాహకులు కృషి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని మండల విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని పాటిగడ్డలో ఉన్న కెజిబివి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు సక్రమంగా అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన్నా పరిశీలించి వంట మనుషులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఇఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు శుద్ధమైన తాగునీరు అందించాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అంధించాలని, విద్యార్థుల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రవి చంద్రకుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మల్లయ్య ఉన్నారు.

# ముమ్మరంగా తమ్మిడికుంట పునరుద్ధరణ

### ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతున్న హైడ్రా

### పనులు పరిశీలించిన కమిషనర్ రంగనాథ్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మురుగు నీటిని దుర్గంధాన్ని వదిలించుకుని సహజ సరస్సుగా తమ్మిడికుంట రూపొందుతోంది. ముళ్లపొదలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, మీటర్ల మేర పేరుకుపోయిన పూడికను తొలగించి చెరువుకు సహజత్వాన్ని హైడ్రా అందించింది. చెరువులో ఆక్రమణలతో పాటు పూడికను తొలగించి విస్తీర్ణం పెంచడంతో ఇప్పుడా పరిసరాలు ఎంతో విశాలంగా మారాయి. శిల్పారామం వైపు ప్రధాన ప్రవేశ మార్గంతో నయన మనోహరంగా మారుతోంది. ఈ అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. చెరువు చుట్టూ పటిష్టమైన బండ్ నిర్మాణంతో పాటు ఇన్‌లెట్లు, ఔట్‌లెట్ల నిర్మాణ పనులు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. ఐటి కారిడార్‌లో ఉన్న ఈ చెరువును ఓ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. శిల్పారామం వద్ద వరద నీరు నిలవకుండా ఇన్‌లెట్ అభివృద్ధి చేయాలని సూచించారు. 14 ఎకరాల చెరువును 29 ఎకరాలకు విస్తరించడం జరిగిందన్నారు. విస్తీర్ణంలో నీరు నిలిచేలా చెరువు అభివృద్ధి చేయాలన్నారు.

**సందర్శకులు సేదదీరేలా...** దేశం నలుమూలల నుంచి వచ్చిన ఐటి నిపుణులు నడియాడే ప్రాంతం ఇది. అత్యధిక జనసాంద్రత ఉన్న ప్రాంతం కూడా ఇదే. ఇలాంటి చోట ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని హైడ్రా కమిషనర్ సూచించారు. తమ్మిడికుంటలో స్వచ్ఛమైన నీరు ఎంత ముఖ్యమో ఆ పరిసరాలు కూడా అంతే పరిశుభ్రమైన వాతావరణంలో ఉండడానికి చర్యలు తీసుకోవాలన్నారు. చెరువు చుట్టూ దాదాపు 2 కిలోమీటర్ల మేర ఉన్న బండ్‌పై ప్రాణ (ఆక్సిజన్) వాయువు అందించడంతో పాటు చల్లటి నీడనిచ్చే చెట్లు పెంచాలన్నారు. చెరువు ప్రధాన ప్రవేశమార్గంలో పార్కులను అభివృద్ధి చేయాలని సూచించారు. తమ్మిడికుంట పరిసరాలలో పిల్లలకు ఆటవిడిపుగా క్రీడా స్థలాలను తీర్చిదిద్దాలన్నారు. వృద్ధులు కూర్చునేందుకు వీలుగా సిమ్మెంట్, రాతికుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓపెన్ జిమ్‌లు, కూర్చొని మాట్లాడుకోడానికి ఏర్పాటు చేయాలని తెలిపారు. అదనపు కమిషనర్ ఎన్.అశోక్ కుమార్, హైడ్రా ఎసిపి శ్రీకాంత్‌తో పాటు పలువురు అధికారులు హైడ్రా కమిషనర్ వెంట ఉన్నారు.

## ఆరోగ్యకేంద్రాల్లో వైద్యుల పోస్టుల భర్తీ



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్(పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రా)లలో ఎనిమిది మంది మెడికల్ ఆఫీసర్ పోస్టులు వాక్ ఇన్ ఇంటర్వ్యూస్ ద్వారా భర్తీ చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలిత దేవి తెలిపారు. ఎంబిబిఎస్ పూర్తి చేసిన వారు నవంబర్ 13 స్వయం గా సర్టిఫికెట్ తీసుకుని హాజరు కావాలని తెలిపారు. అర్హత గల అభ్యర్థులు వారి దరఖాస్తుతో పాటు వారి బయోడేటా, సెల్ఫ్ అటెస్టెడ్ జిరాక్స్ సర్టిఫికెట్లు, ఒకటి నుండి ఏడవ తరగతి వరకు చదివిన బోనఫైడ్ సర్టిఫికెట్లతో రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం శివరాం పల్లిలోని వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయంలోహాజరు కావలసిందిగా ఆమె పేర్కొన్నారు.

**డాటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంటెంట్ భర్తీ...** రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పోస్టుల భర్తీ నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 14 డాటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంటెంట్, భర్తీకి అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి తెలిపారు. అర్హత గల అభ్యర్థులు వారి దరఖాస్తుతో పాటు వారి బయోడేటా, సెల్ఫ్ అటెస్టెడ్ జిరాక్స్ సర్టిఫికెట్లు, ఒకటి నుండి ఏడవ తరగతి వరకు చదివిన బోనఫైడ్లు, స్వయంగా గాని పోస్ట్ ద్వారా గాని నవంబర్ 13 తేదీ ఐదు గంటలలోపు జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయం శివరాంపల్లిలో సమర్పించాలని ఆమె తెలిపారు. వివరాలు కావాల్సినవారు www.rangareddy.telangana.gov.in లో డౌన్లోడ్ చేసుకోవచ్చు అని పేర్కొన్నారు.

# మహిళల భద్రత విషయంలో రాజీపడేదే లేదు



హైదరాబాద్ సిపి విసి సజ్జనర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో రాజీపడేదే లేదని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనర్ స్పష్టం చేశారు. మహిళల భద్రత, రక్షణ అనేది సామాజిక బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఐసిసిసి ఆడిటోరియంలో సోమవారం మహిళా భద్రత విభాగం పనితీరుపై సజ్జనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులను ఆరా తీశారు. షీటీమ్స్, భరోసా, యాంటీ హుమన్ ట్రాఫికింగ్, జువైనల్, తదితర విభాగాల పోలీస్ అధికారులతో మాట్లాడి.. వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళా భద్రత విషయంలో వ్యవహారించాల్సిన తీరుపై దిశానిర్దేశం చేశారు. మహిళలు బాధతో పోలీస్ స్టేషన్లకు వస్తారని, వారితో మానవత దృక్పథం వ్యవహారించాలని సూచించారు. అన్యాయం జరిగిందని వచ్చే బాధిత మహిళకు తాము అండగా ఉన్నామనే భరోసా కల్పించాలన్నారు. కేవలం కేసులు నమోదు చేసి వదిలేయొద్దని, సమగ్రంగా దర్యాప్తు చేయాలన్నారు. పోక్సో, అత్యాచార కేసుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నపిల్లలకు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, స్వీయరక్షణ విషయాలు నేర్పాలని సూచించారు. ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ అప్పుడే కాకుండా మిగతా సమయాల్లోనూ వీధి బాలలు, వెట్టిచాకిరి, పరిశ్రమల్లో మగ్గుతున్న బాలకార్మికులను రక్షించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు సిపి (క్రైమ్స్) శ్రీనివాస్ , మహిళా భద్రత డిసిపి లావణ్య నాయక్, తదితరులు పాల్గొన్నారు.



**అందెశ్రీకి నివాళి...** హైదరాబాద్ లాలాపేటలోని ఆచార్య జయశంకర్ గ్రౌండ్‌లో ప్రముఖ కవి అందెశ్రీ భౌతికకాయానికి హైదరాబాద్ సిపి విసి సజ్జనర్ నివాళులు అర్పించారు. అనంతరం అందెశ్రీ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

## బాల్యవివాహాల నిర్మూలనకు సమష్టి కృషి

### కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** బాల్యవివాహాల నిర్మూలనకు చేపట్టిన ప్రత్యేక ప్రచార కార్యక్రమాలలో అన్నిశాఖల అధికారులు సమష్టిగా పనిచేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. బాల్య వివాహల నిర్మూలనకు సంబందించిన పోస్టర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఐసిడిఎస్ సిబ్బంది బాల్యవివాహాలు జరగడానికి అవకాశమున్న గ్రామాలను గుర్తించి అవగాహన కార్యక్రమాలు, కళాజాతాలు నిర్వహించాలని చెప్పారు. విద్యాశాఖ అధికారులు పాఠశాల మాని వేసిన విద్యార్థులను గుర్తించి, తిరిగి స్కూల్స్‌లో జాయిన్ చేయాలని తెలిపారు. ప్రతి స్కూల్ లో ఇంటర్మీడియట్ కాలేజీలలో వ్యాసరచన, పోటీలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, చైల్డ్ లైన్ 1098, డిసిపియు, సిఎంపిఒలకు వచ్చిన అన్నీ ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా పోలీసు శాఖ,ఇతర లైన్ డిపార్ట్మెంట్స్ లతో సమన్వయం చేస్తూ విలేజ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేసి వాటికి సహకరించాలని, డిహెచ్ఇడబ్ల్యూ, వన్ స్టాప్ సెంటర్లు అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్ సేవలు నిర్వహించాలన్నారు. పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుని,గ్రామస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, డిఆర్‌డిఒ ఇంచార్జ్ జిల్లా సం క్షేమ శాఖ అధికారిణి ఎల్.శ్రీలతతో పాటు జిల్లా అధికారులు వున్నారు.

## బహుజన కూటమితోనే రాజ్యాధికారం

### గాలి వినోద్‌కుమార్, తీగల ప్రదీప్ గౌడ్



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** బహుజనులకు రాజ్యాధికారం తేవటమే తెలంగాణ బహుజన కూటమి లక్ష్యమని కూటమి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల ప్రదీప్‌గౌడ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయమే తెలంగాణ బహుజన కూటమి అని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల వైఫల్యాల వల్లే జనాభా దామాషా ప్రకారం అన్ని వర్గాలకు రాజ్యాంగబద్ధమైన వాటా దక్కడం లేదన్నారు. సుప్రీంకోర్టులోని 9 జడ్జిల తీర్పుతో సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా కూటమి నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా విజిఆర్ నారగోని, నల్లా సూర్యప్రకాశ్‌రావు (బిఎల్ఎఫ్), రాష్ట్ర అధ్యక్షులుగా ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ( ఆర్‌పిఐ), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తీగల ప్రదీప్‌గౌడ్ (తెలంగాణ మహాజనసేన పార్టీ), కన్వీనర్లుగా డాక్టర్ ఈద శేషగిరి రావుగౌడ్( ఆధార్ పార్టీ), గాదగోని రవి (ఎంసిపిఐ), బొంగు ప్రసాద్ (బ్లూ ఇండియా), పోతు అశోక్ (ఎంటిఆర్ఎస్), దండి వెంకట్ (బిఎల్‌పి), లాలు నాయక్ (బిఆర్‌పి), నూనె వెంకటస్వామి (పిఆర్‌పిఎస్)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## చెరుకూరి గ్రూప్ అధినేత రామారావు కన్నుమూత



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ప్రముఖ వ్యాపార వేత, సామాజిక, ఆర్థిక నేత చెరుకూరి రామారావు సోమవారం వనస్థలిపురంలోని ఆయన నివాసంలో తుది శ్వాస విడిచారు. చెరుకూరి రామారావు (76) గుండె శస్త్రచికిత్స చేయించుకున్న అనారోగ్యం కారణంగా ఇంట్లోనే ఉంటూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామారావు చెరుకూరి గ్రూప్‌ను 1994లో స్థాపించారు. రియల్ ఎస్టేట్ రంగంలో అనేక మంది కష్టమర్లను అకట్టుకునే విధంగా చొరవ చూపారు. వ్యాపార రంగంలో ఎంతో పేరు ప్రఖ్యాతతలో ప్రజల నుంచి మన్ననలు పొందారు. వ్యాపార రంగంలో రాణిస్తూ, ప్రజల కోసం సామాజిక సేవలు ,అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన చెరుకూరి అధినేత మరణం విన్న తోటి ఉద్యోగులు, వనియోగదారులు శోకసంద్రంలో మునిగిపోయారు. వనస్థలిపురం, బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని హరిహరపురం కాలనీలో వారి నివాసం ఉంది. అంత్యక్రియలు చౌటుప్పల్‌లో నిర్వహించారు. చెరుకూరి భార్య విజలక్ష్మి , కుమారులు గోపినాథ్, ప్రసాద్ మనవలు ఉన్నారు.



చెరుకూరి రామారావు మృతిదేహానికి ప్రముఖులు, వివిధ పార్టీ నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాశులు ఘన నివాళి అర్పించారు. చెరుకూరి రామారావు మృతిదేహాన్ని సిపిఐ నాయకులు ఆందోజు రవీంద్రచారి, ముత్యం రెడ్డి, సామిడి శేఖర్‌రెడ్డి, అజ్మీర హరిసింగ్ నాయక్, లక్ష్మ ణ్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

## ఎస్‌సిల రిజర్వేషన్ల పెంపునకు మరో ఉద్యమం : పిడమర్తి

**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** జనాభా దామాషా ప్రకారం ఎస్‌సిలకు 20శాతం వరకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్‌తో ఐక్యంగా ఉద్యమిస్తామని ఎస్‌సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎస్‌సి రిజర్వేషన్ పోరాట సమితి(ఎస్‌సిఆర్‌పిఎస్) ఆవిర్భావ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్‌సిఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పులిజాల గెల్వయ్యను నియమించారు. సమావేశంలో దీపక్‌కుమార్, గజ్జల మల్లికార్జున్, స్టాలిన్, మీసాల మల్లేశ్, బోర్లెల్లి సురేశ్, వరలక్ష్మీ పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తుకు శ్రమించాలి

### మాజీ మంత్రి జానారెడ్డి

**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** గ్రామీణప్రాంత విద్యార్థులను కార్పొరేట్ వ్యవస్థకు ధీటుగా విద్యనందించి సమాజానికి డాక్టర్లను అందజేస్తున్న అపోలో మెడికల్ అకాడమీ సేవలు ప్రశంసనీయమని, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు శ్రమించాలని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. చైతన్యపురిలోని అపోలో మెడికల్ అకాడమీని జానారెడ్డి సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో మెడికల్ విద్యార్థులను అందిస్తున్న డైరెక్టర్ పోసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అకాడమీ ప్రిన్సిపల్ మధుసూదన్, కె.వి.ఆర్, హరి, సునీల్, శ్రీధర్, శ్రీనివాస్, శ్రీను, సాయి, హరికృష్ణ, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.



# పేదల సొంతింటి కల నెరవేర్చాలన్నదే ధ్యేయం



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** పేదల సొంతింటి కల నెరవేర్చాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, అందుకే అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. సోమవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని రాంనగర్ కాలనీలో లబ్దిదారుడు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే ప్రారంభించి లబ్దిదారుడికి నూతన వస్త్రాలను అంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నేరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజలకు వచ్చిన మాటకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుపడి పని చేస్తుందని, పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, నేతలు చెంది తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ రాజేందర్‌రెడ్డి, బాల్‌రాజ్ గౌడ్, శ్రీనునాయక్, మాధవులు పాల్గొన్నారు.

**అందెశ్రీకి నివాళి...**పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో దివంగత అందెశ్రీ చిత్రపటానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందెశ్రీ మరణం సాహిత్య లోకానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, బస్వం, ముబారక్, చంద్రశేఖర్, గోదా మాధవులు, సయ్యద్ ఖదీర్, దిలీప్, చిన్న, మురళీమోహన్, లింగారెడ్డిగూడ అశోక్, జాంగారి రవి పాల్గొన్నారు.

## కార్తీక సోమవారం అన్నదాన కార్యక్రమం

ప్రజాపక్షం/నిజాంపేట్ : నిజాంపేట్‌లో వెలిసినటువంటి శివాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయాన్ని దర్శించుకుని అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ పితాని శ్రీనివాసరావు, లక్ష్మణ్, రమణ, రామచంద్రనాయక్, బాలకృష్ణ, దాని నాయుడు, ఆర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.



## సిఎంఆర్ చెక్కులు పంపిణీ చేసిన స్పీకర్

ప్రజాపక్షం/వికారాబాద్: వికారాబాద్ మండలానికి చెందిన లబ్దిదారులకు మంజూరైన నాలుగు కళ్యాణలక్ష్మి , ఆరు సిఎంఆర్ చెక్కులను వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన డబ్బులను వృథా చేయకుండా అవసరాలకు వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు





## రైతులకు బోనస్ చెల్లించేలా కృషి చేస్తా

### టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు బోనస్ చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. సోమవారం మూడుచింతలపల్లిలోని లక్ష్మాపూర్, ఉద్దెమర్రి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలను అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రూ.15కోట్లతో మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో సమస్యలను గుర్తించి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సకాలంలో డబ్బులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తుందన్నారు. దళారుల బారిన పడకుండా రైతులు నేరుగా దాన్యాన్ని దాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని చెప్పారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు చేయాలని పార్టీలకతీతంగా అన్ని రాజకీయ పార్టీలు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మూడుచింతలపల్లి కాంగ్రెస్ అద్యక్షుడు దోసకాయల వెంకటేష్, ఏ బ్లాక్ అద్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, విష్ణుగౌడ్, రాజేంద్రప్రసాద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు

ప్రజాపక్షం/శామీర్‌పేట : తెలంగాణ మంత్రివర్గంలో నూతన మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ అజారుద్దిన్‌కు రాష్ట్ర హాజ్ కమిటీ మెంబర్ మహ్మద్ ముజుబుద్దిన్ శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన భారత మాజీ క్రికెట్ కెప్టెన్ మహ్మద్ అజారుద్దిన్‌ను సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసిన మహ్మద్ ముజుబుద్దిన్ శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి పదవులు మరెన్నో వరించాలని ఆకాంక్షించారు.



## పేదలకు అండగా డాక్టర్ సంపత్‌కుమార్


ప్రజాపక్షం/తాండూరు: తాండూరులోని ప్రముఖ వైద్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీవిజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సంపత్‌కుమార్ ఓ నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. తాండూరు పట్టణ పరిధి 33వ వార్డు పవారే శ్రీనివాస్‌రావు సోమవారం మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న డాక్టర్ సంపత్‌కుమార్ ఆ నిరుపేద కుటుంబానికి సానుభూతి తెలియ చేయడంతో పాటు అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ లింగదలి రవికుమార్ ద్వారా అందజేశారు. ఆపద సమయంలో ఆర్థికంగా అండగా నిలిచిన డాక్టర్ సంపత్‌కుమార్ వారు కృతజ్ఞతలు తెలిపారు.



## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్వర్ డౌన్

### క్రయ, విక్రయదారుల ఇబ్బందులు

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్వర్ డౌన్, డాక్యుమెంట్ రైటర్లను లోపలికి అనుమతించకపోవడం వల్ల క్రయ విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డాక్యుమెంట్లు ఎక్కడ సమర్పించాలి, ఏ కౌంటర్ లో పనులు జరుగుతాయి అన్న స్పష్టత లేక ప్రజలు అయోమయానికి గురయ్యారు. సాంకేతిక సమస్యల కారణంగా స్లాట్ బుకింగ్ చేసినవారి సమయం ముగిసి, స్లాట్లు రద్దయ్యా యి. దూర ప్రాంతాల నుండి లక్షల రూపాయలు వెచ్చించి, అవసరమైన పత్రాలు సిద్ధం చేసుకుని వచ్చినవారు తిరిగి వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ప్రతి సారి ఇలా వస్తూ పోతూ మాకు ఆర్థిక భారం, సమయ నష్టం జరుగుతోందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని క్రయ విక్రయదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కార్యాలయంలో సిబ్బంది తక్కువగా ఉండటంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశా రు. సిబ్బంది సంఖ్యను పెంచకుండా ప్రజలను ఇక్కట్లు పడేలా చేస్తున్నారు. డాక్యుమెంట్ రైటర్లకు తిరిగి పని అనుమతులు ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పార్కింగ్ సదుపాయం లేక కార్యాలయం బయట వాహనాలు నిలివేస్తే ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధిస్తున్నారు. రూ.100 పని కోసం వస్తే రూ.1000 చలానా పడుతోంది. ఇది ప్రజలపై అదనపు భారమని వాపోతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



## ఆర్‌టిసి బస్సు ఢీ కొని వ్యక్తి మృతి

ప్రజాపక్షం/పరిగి: పరిగి డిపోనందు ఆర్టీసీ బస్సు నెంబర్ ఏపి29జడ్ 3489 గల బస్సు డ్రైవర్ వెంకటేష్, అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా నడుపుకుం టూ సెక్యూరిటీ కార్యాలయం ముందు నిలబడ్డ అబ్దుల్ కుదుస్ 59 సం.ల వ్యక్తి మెకానికల్ సెక్షన్‌లో పని చేస్తుండేవారు. బస్సు ఢీ కొట్టడంతో తలకు బలమైన గాయాలు తగిలి కిందబడి, ప్రభుత్వ అసుపత్రికి తీసుకొని వెళ్లగా డాక్టర్ పరీక్షించి మృతిచెందడం జరిగింది అని తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందన్నారు.



# ఎయిర్‌పోర్టు తరహాలో...

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ :సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయిలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలో నిర్మాణం చేపడుతున్నామని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఇందు కోసం రూ.715 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను సోమవారం ఆయన రైల్వే అధికారులతో కలిసి సందర్శించి పునర్‌నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ రైల్వే స్టేషన్‌కు ప్రతి రోజు 1.97 లక్షల మంది, ప్రతి గంటకు 22 వేల మంది ప్రయాణికులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వస్తున్నారన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండానే నిర్మాణం వేగవంతంగా చేపడుతున్నామన్నారు.

వచ్చే ఏడాది దశల వారీగా ఈ నిర్మాణం అందుబాటులోకి రానుందని స్పష్టం చేశారు. నాలుగు నెలల్లో సౌత్ బ్లాక్, డిసెంబర్ నాటికి రైల్వే స్టేషన్ పూర్తి కానుందని తెలిపారు. 3 వేల మంది ప్రయాణికులు కూర్చునేలా 3 ఎకరాల్లో వెయిటింగ్ హాల్, క్యాం టిన్ వంటి సదుపాయాలు నిర్మిస్తున్నామన్నారు. ఈ స్టేషన్‌కు నేరుగా మెట్రో అనుసంధానం చేపడుతున్నాం. బస్ స్టేషన్‌కు కూడా నేరుగా చేరుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. 26 లిఫ్టులు, 32 ఎస్కలేటర్లు, రెండు సబ్‌స్టేషన్లు, అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ సిస్టమ్ స్టేషన్‌లో ఉంటాయి. రోజుకు 5 లక్షల లీటర్ల మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పూర్తయితే ప్రతి రోజు 2.7 లక్షల మంది, గంటకు 32 వేల మంది ప్రయాణికులు వచ్చినా ఇబ్బందులు కలగకుండా తీర్చిదిద్దుతున్నామన్నారు. 1.65 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ నిర్మాణం జరుగుతోందన్నారు. డిసెంబర్ 25 నాటికి మల్టి లెవల్ పార్కింగ్ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించాను. తెలంగాణకు రైల్వే బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం 2014–15లో రూ.258 కోట్లు, 2025–26 నాటికి రూ.5,337 కోట్లకు పెరిగాయన్నారు. ప్రధాని మోదీ హయాంలో దాదాపు 21 రెట్లు పెరిగిందని గుర్తు చేశారు. 201415 నుంచి 2025–26 వరకు 11 సంవత్సరాల కాలంలో తెలంగాణకు జరిగిన రైల్వే బడ్జెట్ కేటాయింపుల మొత్తం రూ.30,832 కోట్లు. 2004–14 మధ్య 10 సంవత్సరాలలో తెలంగాణలో 136 కి.మీ.ల కొత్త లైన్ల నిర్మాణం జరిగితే, 2014–25 మధ్య 11 సంవత్సరాల కాలంలో 346 కి.మీ.ల కొత్తలైన్ల నిర్మాణం జరిగిందని స్పష్టం చేశారు. ఇఅలాగే పెద్దపల్లి–నిజామాబాద్, జగ్గయ్యపేట–విష్ణుపురం, భద్రాచలం–సత్తుపల్లి, దేవరకద్ర–కృష్ణా, అక్కన్నపేట–మెదక్ వంటి కొత్త ప్రాజెక్టులను పూర్తి చేశామని తెలిపారు. 2004–14 మధ్య తెలంగాణలో 759 కి.మీ.ల రైల్వేలైన్ల విద్యుద్దీకరణ జరగగా, 2014–25 మధ్య 1,959 కి.మీ.ల రైల్వేలైన్ల విద్యుద్దీకరణ జరిగిందన్నారు. గత పదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా 293 రోడ్ అండర్ బ్రిడ్జిలు, 43 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, 49 ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం జరిగిందన్నారు. సికింద్రాబాద్‌లో 2 పిట్‌లైన్లు, కాచిగూడలో 1 పిట్ లైన్ ఏర్పాటు చేసి వందేభారత్ మెయింటెనెన్స్ సౌకర్యాన్ని కల్పించనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాష్, డివిజనల్ మేనేజర్ డాక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ, అధికారులు రణదీర్‌రెడ్డి, ఎ.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## అందెశ్రీ అంత్యక్రియల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: ప్రముఖ కవి.రచయిత అందెశ్రీ అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఘట్‌కేసర్‌లోని ఎంఎల్‌ఏ క్యాంప్ కార్యాలయ సమీపంలో ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తాతో కల్సి జిల్లా కలెక్టర్ మనుచౌదరి సోమవారం రాత్రి పరిశీలించారు. ప్రభుత్వ సంబంధిత శాఖాధికారులు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ప్రముఖుల రాకపోకల రహదార్లతో పాటు ఎన్‌ఎఫ్‌సి కాలనీలోని అందెశ్రీ నివాస గృహం వద్ద అవసరమైన ఏర్పాట్లు చూదాలని తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. అవసరమైన బందోబస్తులో పోలీసు శాఖ, నిర్మాణ పనుల్లో ఆర్ అండ్ బి శాఖాధికారులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు.

**నేడు ఘట్‌కేసర్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు**

అనారోగ్యంతో కన్నుమూసిన ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు మంగళవారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో ప్రభుత్వ లాంఛనాలతో జరుగనున్నాయి. తార్నాక సమీపంలోని లాలాపేట ప్రాంతం వినోబానగర్‌లో ఉన్న ఆయన స్వగృహంలో స్థలాభావం కారణంగా లాలాపేట స్టేడియంకు ప్రజలు, అభిమానుల సందర్శనార్థం పార్థివదేహాన్ని తరలించారు. సోమవారం రాత్రి ఘట్‌కేసర్‌లోని ఎన్‌ఎఫ్ సి నగర్‌కు అందెశ్రీ భౌతికదేహాన్ని తరలించి మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

## పోలీసులకు సాంకేతికపరమైన శిక్షణ అవసరం

### డిజిపి బి.శివధరరెడ్డి




ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : చోరీలు చేయటంలో రోజురోజుకు నేరస్తులు అవలంబిస్తున్న సరికొత్త విధానాలకు కళ్లెం వేసే రీతిలో పోలీసు సిబ్బందికి అధునాతన సాంకేతికపరమైన శిక్షణ ఇవ్వనున్నామని రాష్ట్ర డిజిపి బి.శివధర రెడ్డి తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లిలో ట్రైనింగ్ సెంటర్ నిర్మాణ భవనానికి సోమవారం శంకుస్థాపన చేసారు. తొలుత ఆయన పోలీసు గౌరవ వందనం స్వీకరించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్దికాలంగా వినియోగంలోకి వచ్చిన మొబైల్ ఫోన్లు, సాంకేతికను నేరస్తులు సైతం ఉపయోగించుకొని సులభరీతిలో నేరాలకు పాల్పడటం, పరారీ అవటం జరుగుతోందదని, నేరాలను అరికట్టటంతో పాటు నేరపరిశోధనల్లోనూ పోలీసులు సైతం అధునాతన టెక్నాలజీ వినియోగించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీంతోపాటు రోడ్ సేఫ్టీ ప్రజలు తెలిసి చేసే తప్పుల కారణంగా రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతూ పెద్ద సంఖ్యలో ప్రాణాలను కోల్పోవటం, క్షతగాత్రులవటం జరుగుతోందని, ఇలాంటి వాటిని నివారించటానికి సైతం సరైన శిక్షణ పోలీసులతో పాటు ప్రజలకు అవసరం ఉందన్నారు. నూతనంగా నిర్మిస్తున్న శిక్షణా భవనానికి గాను దివిస్ లాబరెటరీస్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ మురళీకృష్ణ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ ఫండ్స్ ద్వారా ఉదారంగా 4 కోట్ల రూపాయలు అందచేయటం అభినందనీయమన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఏర్పడి పదేళ్లు అయినప్పటికి నేటికీ పూర్తిస్థాయి భవనంతో పాటు సిటి ట్రైనింగ్ సెంటర్ లేకపోవటం కొంత లోపంగానే ఉందని, శిక్షణా సంస్థ భవనం పూర్తయితే ఈ సమస్య ఉండదని డిజిపి అన్నారు. ఈ కార్యక్రమంలో రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు తదితర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/వికారాబాద్:ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలనుండి 65దరఖాస్తులు స్వీకరించామని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. వాటిని త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్‌డిఓ వాసుచంద్ర, విఆర్‌ఓ మంగ్లీలాల్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**ఇవిఎం గోడౌన్ పరిశీలన**

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న ఇవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. సాధారణ పరిశీలనలో భాగంగా క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఇవిఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, సిసిటివి లో బ్యాలెట్ యూనిట్లు , కంట్రోల్ యూనిట్లు, వివిప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీచేశారు. ఇవిఎం గోడౌన్ వద్ద పోలీసు బదోబస్తు తీరును పరిశీలించారు. రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు.కలెక్టర్ తోపాటు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తహసీల్దార్ లక్ష్మి నారాయణ, ఎన్నికల విభాగం పర్యవేక్షులు నేమత్‌హలి, తదితరులు పాల్గొన్నారు.

**వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ :**

ధాన్యం కొనుగోలు పై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో పాల్గొని మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా రైతులకు సంబంధించిన ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్య లు తీసుకోవాలని,ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా వ్యావసాయ అధికారి రాజారత్నం, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, సుదర్శన్, సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.



## సుగుణ ఐరన్ కంపెనీపై గ్రామస్థులు ఫిర్యాదు

ప్రజాపక్షం/పరిగి: పరిగి మండలంలోని లక్ష్మి దేవి పల్లి గ్రామ శివారులో ఉన్న సుగుణ ఐరన్ కంపెనీని రాకంచర్ల లోని పారిశ్రామిక వాడకు మార్చాలని రాఘవపూర గ్రామస్తులు అదనపు కలెక్టర్ మంగీలాల్‌కువినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సుగుణ ఐరన్ కంపెనీ నుండి నల్లనీ పొగ ప్రమధాకరంగా వదులుతున్నారని చుట్టుపక్కల పొలాలలో పంట దగుబడి తగ్గడమే కాకుండా ప్రజలు అనారోగ్యాల బారినపడుతున్నారన్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు మృతి చెందడం జరిగిందని తెలిపారు. సామాజిక న్యాయ దృక్పథంతో అలోచించి ఈ కంపెనీని రకంచర్లలోని పారిశ్రామిక వాడకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాములు ,బాలయ్య ,నర్సింలు ,రాములు , కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి వ్యతిరేక కమిటీకి అఖిల పక్ష కమిటీలు హాజరు

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్

ప్రజాపక్షం /కుత్బుల్లాపూర్: గంజాయి వ్యతిరేక కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ కోరారు. నేడు సిపిఐ కార్యాలయంలో నిర్వహించబోతున్న అఖిల పక్ష, బస్తీ కమిటీల సమావేశాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరుతూ జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, కార్పొరేటర్ జగన్, కాంగ్రెస్ నాయకులు సాయి పంతులు, జగద్గిరిగుట్ట బస్తి పెద్దలకు, మైసమ్మ నగర్ ఏ.బి. బ్లాక్ శ్రీనివాస్ నగర్, లెనిన్ నగర్, మక్దుమ్‌నగర్ బస్తి పెద్దలను కలిసి ఆహ్వాన, కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచి కార్యక్రమానికి ఇలాంటి సమావేశాలను నిర్వహించడం శుభపరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, ఎఐటియుసి అధ్యక్షులు హరినాథ్, ప్రజానాట్య మండలి బాబు, పార్టీ నాయకులు వెంకటేష్, జంబూ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ భక్తిభావన కలిగి ఉండాలి

ప్రజాపక్షం/చర్లపల్లి: సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావన కలిగి ఉండాలని ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డి,మల్కాజ్‌గిరి ఎంపి ఈటెల రాజేందర్‌లు అన్నారు.చర్లపల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మి నగర్ కాలనీలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి,శ్రీ అంభయాంజనేయస్వామి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రత్యేక చేశారు.ఈ సందర్భంగా వారిని కమిటీ సభ్యులు కండువాలతో సత్కరించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, నాయకులు రుద్రగోని రాంచందర్ గౌడ్, మహేష్‌గౌడ్, మల్లేష్, సభ్యులు కొండ జంగారెడ్డి, ఎం శ్రీనివాస్,శేఖర్‌రెడ్డి,కొండల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న రైతుల నిలువు దోపిడీ

* తక్కువ ధరకే కొనుగోలు * రాత్రివేళ్ళలో తూకాలు
* పట్టించుకోని అధికారులు

ప్రజాపక్షం/తాండూరు:గ్రామాలలో దళారులు రాజ్యమేలుతున్నారు.మొక్కజోన్న రైతులను నిలువున దోచుకుంటున్నారు. గ్రామాలలో తిష్టవేసిన దళారులు తక్కువ ధరలకే మొక్కలు కొనుగోలు చేస్తూ మీ ఇంటి వద్ద తూకాలు చేసుకుంటామంటూ రైతులను తూకాల్లో మోసాలు చేస్తూ దంటుకుంటున్నారు. మొక్కజోన్నలను కొనుగోలు చేసిన దళారులు మార్కెట్ కమిటి ఆదాయానికి భారిగా గండి కొడుతున్నారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ తక్ పట్టీలు ఇవ్వకుండా తెల్లకాగింతపై వ్రాసి ఇస్తున్నారు. మార్కెట్ కమిటిలకు రావాల్సిన ఆదాయానికి దళారులు గండి కొడుతున్న దళారులన నియంత్రిచండంలో అధికారులు విఫలమవుతున్నారు. దీనిని అసరాగా చేసుకున్న దళారులు గ్రామాలలో తిష్టవేసి రాత్రివేళ్ళలో మొక్క జోన్నలను తూకం చేస్తూ రైతలను నిలువున దోచుకుంటున్నారు. ధరలో మోసం... తూకంలో దగా చేస్తూ రైతుల రక్తం తాగుతున్నారు. మొక్క జోన్నలు 50కిలోల బస్తాలను తూకం చేస్తున్నారు. క్వింటాళ్ళ మొక్క జోన్నల తూకానికి రెండు మార్లు తూకా చేయాల్సి వస్తుంది. ఇలా తూకం చేసిన సమయంలో క్వింటాళుకు ఐదు కిలోల చోప్పున అధికంగా తూకం చేస్తూ రైతులను మోసం చేస్తున్నారు. 50 కిలోల బస్తా తుకానికి తరుగు పేరిటా కిలో, సంచి తూకం పేరిటా మరో కిలో ఇలా ఐదు క్వింటాళ్ళ తుకానికి ఐదు కిలోల చోప్పున అధికంగా తూకం చేస్తూ రైతులను నిలువున దోచుకుంటున్నారు. తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్, తాండూరు, యాలాల మండలల పరిధిలో మొక్కజోన్ననను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మొక్కజోన్నల సీజన్ కావడంతో దళారులు గ్రామాలలో మాకం వేసి మొక్కజోన్న రైతులను దోచుకుంటున్నారు. ఇప్పటికైన వ్యవసాయ మార్కెట్ కమిటి అధికారులు స్పందించిగ్రామాలో తిష్టవేసిన దళారులను నియంత్రించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

## జగదాంబ మాత ఆలయానికి ఆరు లక్షల విరాళం

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : జగదాంబ మాత సంత్ సేవాలాల్ మహరాజ్ నూతనంగా నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పోచారం బిఆర్‌ఎస్ నాయకుడు ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సామల సందీప్ రెడ్డి పాల్గొని



ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సామల సందీప్ రెడ్డి జగదంబ మాత శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ అభివృద్ధి కోసం 6 లక్షల రూపాలయలను కమిటీ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా సందీప్ రెడ్డి మాట్లాడుతూ సమాజ అభ్యున్నతికి ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం అందించానని ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గూగుల్ గోవింద్ నాయక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యా నాయక్,జితేందర్ నాయక్, రాకేష్, ప్రశాంత్, వేణు, ఎస్‌వైఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## హలో ఛాంపియన్లు

# తస్మాత్ జాగ్రత్త..

### ఆ కంపెనీల 'పీఆర్' మాయలో పడకండి.. : గవాస్కర్



వరల్డ్ కప్ విజేతగా యావత్ భారతాన్ని సంబురాల్లో ముంచెత్తిన మహిళా క్రికెటర్లపై కానుకలు కురుస్తున్నాయి. ఓవైపు రాష్ట్ర ప్రభుత్వాలు భారీ నగదు ప్రోత్సాహకాలతో అభినందిస్తుంటే.. మరోవైపు ప్రచారకర్తలుగా మీరే కావాలని పలు కంపెనీలు కోరుతున్నాయి. ప్రపంచకప్ ఛాంపియన్లతో తమ బ్రాండ్ వాల్యూ పెంచుకునేందుకు పలు సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత క్రికెటర్లను సునీల్ గవాస్కర్ హెచ్చరించాడు. ప్రచారం కోసం పాకులాడే కొన్ని కంపెనీల పీఆర్ (పబ్లిక్ రిలేషన్స్) మాయలో పడొద్దని.. తస్మాత్ జాగ్రత్త అని సన్నీ సూచించాడు. ప్రపంచ కప్ విజయోత్సాహంలో ఉన్న భారత క్రికెటర్లతో ఒప్పందం కోసం పలు బ్రాండ్లు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని సంస్థలు స్టార్ ప్లేయర్లను సంప్రదించాయి కూడా. పేరుకు పేరు ఆదాయానికి ఆదాయం వచ్చే అవకాశముండడంతో క్రికెటర్లు ఓకే చెప్పడం ఆలస్యం కాకపోవచ్చు. అయితే.. కొన్ని కంపెనీలు అబద్ధపు వాగ్దానాలు చేస్తాయని, ఆశపడి మోసపోవద్దని హర్మన్‌ప్రీత్ కౌర్ బృందాన్ని గవాస్కర్ హెచ్చరిస్తున్నాడు. అతడు ఊరికనే భారత క్రికెటర్లకు సూచనలు చేయడం లేదు. 1983లో తొలిసారి విశ్వ విజేతగా నిలిచిన తమకు ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని 'జాగ్రత్త సుమా' అని చెబుతున్నాడు.

**ఏండ్లు గడిచినా సున్నా..**

'కపిల్ దేవ్ సారథ్యంలో భారత జట్టు 1983 వరల్డ్ కప్ విజేతగా నిలిచింది. అప్పటి జట్టులోని క్రికెటర్లను మీడియా ఆకాశానికెత్తేసింది. పలు కంపెనీలు కొన్ని హామీలు ఇచ్చాయి. కానీ, చివరకు అవేమీ మా చేతికి అందలేదు. అలాఅనీ మీడియాను తప్పుపట్టను. ఎందుకంటే వాళ్లకు మా ద్వారా మరింత ప్రచారం వచ్చింది. అందుకే చెబుతున్నా మీకు ప్రామిస్ చేసిన కొన్ని అవార్డులు రాలేదని నిరాశ చెందకండి. భారత్‌లోని కంపెనీలు, ప్రకటన సంస్థలు, కొందరు వ్యక్తులు ఉచిత పబ్లిసిటీ కోసం కాచుకొని ఉంటారు. వరల్డ్ కప్ విజేతలను ప్రచారకర్తలుగా నియమించుకుంటామని చెప్పి.. తమ ఉత్పత్తులను అమ్ముకోవాలని చూస్తారు. అంతేకాదు ఛాంపియన్లను అభినందిస్తూ పలు బ్రాండ్‌లు పెద్ద పెద్ద హోర్డింగ్‌లు పెడుతుంటాయి. అలా అనీ వారికి, క్రికెటర్లతో ఏ సంబంధమూ ఉండదు. పరోక్షంగా తమ కంపెనీ ప్రచారం కోసం సదరు సంస్థలు సిగ్గు లేకుండా అలా చేస్తుంటాయి. కానీ, కొందరు మాట తప్పకుండా అంబాసిడర్‌గా నియమించుకుంటారు. అందుకే.. ప్రకటనల విషయంలో కాస్త ఆచితూచి అడుగేయండి' అని విశ్వ విజేతలకు గవాస్కర్ కీలక సూచనలు చేశాడు. వరల్డ్ కప్ విజయంతో భారత మహిళా క్రికెటర్ల బ్రాండ్ వాల్యూ రెండింతలు పెరిగింది. సెమీఫైనల్లో అజేయ సెంచరీ బాదిన జెమీమా రోడ్రిగ్స్ బ్రాండ్ వాల్యూ రూ.60 లక్షల నుంచి రూ.1.5 కోట్లకు.. ఫైనల్ స్టార్ షఫాలీ బ్రాండ్ వాల్యూ రూ.1 కోటికి చేరిందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

## నా కలల టోర్నీ అదే..



# అవకాశమిస్తే రఫ్ఫాడిస్తా..

**అభిషేక్ శర్మ**

టీ20లు అంటేనే చిచ్చర పిడుగుల హవా. ఈ ఫార్మాట్‌లో దంచి కొట్టే ఆటగాళ్లు చాలామందే ఉన్నా తానే టాప్ అని చాటుకుంటున్నాడు భారత ఓపెనర్ అభిషేక్ శర్మ. ఐపిఎల్ నుంచి ఈ ఏడాది అంతర్జాతీయ మ్యాచ్లలోనూ అదరగొడుతున్న అభి పొట్టి క్రికెట్‌ను ఏలుతున్నాడు. ప్రత్యర్థి ఎవరైనా సరే దంచుడే పరమావధిగా ఆడుతున్న ఈ యంగ్‌స్టర్ నంబర్ 1 ర్యాంక్‌లో తిష్ట వేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన అభిషేక్ తన కలల టోర్నీ కోసం ఎదురుచూస్తున్నాని అంటున్నాడు. ఇంతకు అతడి డ్రీమ్ టోర్నీ ఏంటో తెలుసా..? పొట్టి క్రికెట్‌లో భీకర ఫామ్‌తో బౌలర్లకు దడ పుట్టిస్తున్న అభిషేక్ శర్మ ఓపెనర్‌గా స్థిరపడిపోయాడు. మెరుపు బ్యాటింగ్‌తో శుభారంభాలు ఇస్తూ టీమిండియాకు ప్రధాన అస్త్రంగా మారిన అతడు వరల్డ్ కప్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ కోసం తాను సిద్ధమవుతున్నట్టు చెప్పాడీ సూపర్ స్ట్రయికర్.

'వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ నా కెరీర్లోనే అతిపెద్ద టోర్నీ కానుంది. చెప్పాలంటే అది నా కలల టోర్నమెంట్. నేను వరల్డ్ కప్ కోసం సిద్ధంగా ఉన్నాను. ఒకవేళ నాకు ఈ మెగా ఈవెంట్‌లో ఆడే అవకాశం వస్తే రఫ్ఫాడిస్తా' అని తన మనసులోని మాట చెప్పేశాడీ డాషింగ్ ఓపెనర్. ఆసియా కప్‌లో 314 రన్స్‌తో చెలరేగిన అభిషేక్.. ఆసీస్ గడ్డపై విధ్వంసక ఆటతో రెచ్చిపోయాడు. అభిషేక్ 28 ఇన్నింగ్స్‌లోనే వెయ్యి పరుగుల క్లబ్‌లో చేరాడు.

టీ20ల్లో అత్యంత వేగంగా ఈ మైలురాయికి చేరిన భారత క్రికెటర్‌గా అవతరించాడీ లెఫ్ట్ హ్యాండర్. కంగారూలతో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌లో 163 పరుగులతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడీ డేరింగ్ బ్యాటర్. 200ల స్ట్రయిక్ రేటుతో ఆడుతున్న అభి.. ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే వరల్డ్ కప్ ఆడడం పక్కా అంటున్నారు విశ్లేషకులు. ప్రస్తుతం 925 రేటింగ్ పాయింట్స్‌తో అభిషేక్ టీ20ల్లో నంబర్ 1 ఆటగాడిగా కొనసాగుతున్నాడు.

**భారత్‌లో 5, లంకలో 2**

వచ్చే ఏడాది పురుషుల టీ20 ప్రపంప కప్ పోటీలకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న విషయం తెలిసిందే. పొట్టి ప్రపంచ కప్ బెర్తులు ఖరారు కావడంతో షెడ్యూల్‌పై కసరత్తు చేస్తోంది ఐసీసీ. మొదటగా వేదికల్ని ఖరారు చేయాలి కాబట్టి.. ఆతిథ్య దేశాలైన భారత్‌లో ఐదు, లంకలోని రెండు నగరాలను ఎంపిక చేసింది ఐసీసీ. అహ్మదాబాద్, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, ముంబై.. శ్రీలంకలో కొలంబో, క్యాండీ సిటీల్లో ప్రపంచ కప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అహ్మదాబాద్‌లోనే మార్చి 8న ఫైనల్ జరుగనుంది. సెమీఫైనల్స్ కోసం ఒకటి కోల్‌కతా, అహ్మదాబాద్ నగరాలను ఆడించాలని షార్ట్ లిస్ట్ చేశామని ఐసిసి తెలిపింది. అయితే.. ముంబైలోని వాంఖడే స్టేడియం పేరు కూడా పరిశీలనలో ఉన్నట్టు సమాచారం.

# యువతరంగం

**ఫోకస్**


# ఉద్యోగాలు మాయం!




చేస్తున్న ఉద్యోగం హఠాత్తుగా ఒక్క మాటతో ఊడిపోవడం ఎవరినైనా తీవ్ర మానసిక వేదనకు గురి చేస్తుంది. ఇలాంటి ఘటనలు విన్నవారు, తమకు కూడా ఇలాంటి పరిస్థితి వస్తుందేమోనన్న అనుమానంతో చాలా మంది వణికిపోతుంటారు. ఇప్పుడు అమెరికాలో ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. మీటింగ్ అంటూ పిలిచి ఉద్యోగం తీసేశారంటూ ఒకరు తనకు ఎదురైన అనుభవాన్ని సోషల్ మీడియా వేదిక రెడిట్ పోస్ట్‌లో పంచుకోగా, అది వైరల్‌గా మారింది. అమెరికాలోని పలు కంపెనీల్లో పని చేస్తున్న ఎంతో మంది ఈ పోస్టుపై తీవ్రంగా స్పందించారు. సదరు అమెరికా సంస్థ, ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా, ఒక భారతీయ ఉద్యోగిని కేవలం ఒకే ఒక మాటతో ఉద్యోగం నుంచి తొలగించడం చర్చనీయాంశమైంది. ఒక అమెరికాకు చెందిన కంపెనీలో పనిచేస్తున్న ఆ ఉద్యోగి తనకు ఎదురైన ఈ చేదు అనుభవాన్ని పంచుకున్నారు. అంతేకాదు, తన సంస్థలోని చాలా మంది భారతీయులకు ఇదే తరహా పరిస్థితి ఎదురైందని వివరించారు. ఉద్యోగం చేజార్చుకున్న వ్యక్తి రెడిట్ పోస్టులో తన అనుభవాన్ని వివరిస్తూ, 'నాకు అది మామూలు రోజులాగే మొదలైంది. ఉదయం 8:30 గంటలకు నిద్ర లేచాను. 9 గంటలకు పనిలోకి లాగిన్ అయ్యాను. 11 గంటలకు నా క్యాలెండర్‌లో ఒక మాండెటరీ మీటింగ్ (తప్పనిసరి సమావేశం)లో పాల్గొనాలనే ఆహ్వానం కనిపించింది. భారతదేశంలోని ఉద్యోగులందరికీ మా సీఓఓ (చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్)తో ఆ సమావేశం ఉందని తెలిసింది. నేను 11 గంటలకు జాయిన్ అయ్యాను. ఆయన 11:01కి జాయిన్ అయ్యారు. వెంటనే అందరి కెమెరాలు, మైకులు నిలిపివేశారు. భారతదేశంలోని ఉద్యోగుల్లో చాలా మందిని తొలగించాలనే కఠినమైన నిర్ణయం తీసుకున్నాం' అని ప్రకటించారు అని వాపోయాడు. ఉద్యోగం కోల్పోయిన వారికి ఇ–మెయిల్ వస్తుందని సిఓఓ చెప్పారని, ఆ తర్వాత ఎలాంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండానే సమావేశం నుంచి తప్పుకున్నారని ఆ ఉద్యోగి వివరించాడు. ఈ పోస్ట్‌పై సోషల్ మీడియాలో చాలా మంది సానుభూతి వ్యక్తం చేస్తూ, సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఏదిఏమైనా ఒకే ఒక మాటతో ఉద్యోగం నుంచి తీసివేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతుంది. ఒకప్పుడు 'వాన రాకడ.. ప్రాణం పోకడ' ఎవరికీ తెలియదని అనేవారు. ఇప్పుడు 'పింక్ స్లిప్ రాకడ.. ఉద్యోగం పోకడ' ఎవరికీ అర్థం కావడం లేదు.

# సరైన ప్రతీకారం!

తనను తాను 'ది గ్రేటెస్ట్' అని చెప్పుకున్న ప్రపంచ మేటి బాక్సర్ మహమ్మద్ అలీ గురించి తెలియనివారు అరుదు. 1964 సెప్టెంబర్‌లో, మైనెలోని లెవిస్టన్ వేదికగా జరిగిన ఫైట్‌లో అతను సోనీ లిస్టన్‌ను చిత్తుచేసి, ప్రపంచ హెవీవెయిట్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. 22 సంవత్సరాల అతని పేరు అప్పట్లో కేషియస్ క్లే. ఒక నల్లజాతీయుడు ఈ ఘనతను అందుకోవడాన్ని జీర్ణించుకోలేకపోయిన శ్వేత జాతీయులు పదేపదే హేళన చేయడం మొదలు పెట్టారు. దీనితో, 1964 మార్చి 6న అతను క్రిస్టియానిటీ నుంచి ఇస్లామ్‌లోకి మారాడు. పేరును కాషియస్ క్లే నుంచి మహమ్మద్ అలీగా ప్రకటించుకున్నాడు. ఈ మార్పును కొంత మంది గుర్తిస్తే, చాలా మంది అపహాస్యం చేశాడు. బాక్సర్ ఎర్నీ టెర్రెల్ అవధులు దాటి ప్రవర్తించాడు. అలీని పదేపదే 'కేషియస్ క్లే' అని సంబోధిస్తూ, రెచ్చగొట్టాడు. అయితే, అలీ అదును కోసం ఓపిగ్గా వేచి చూశాడు. 1967 ఫిబ్రవరి 6న జరిగిన ఫైట్‌లో టెర్రెల్‌ను ఢీకొన్నాడు. మొదటి గంట మోగిన క్షణం నుంచే అలీ ఆధిపత్యం చూపించాడు. మెరుపు వేగంతో కదులుతూ, ప్రత్యర్థిపై పంచ్‌లు విసురుతూ విశ్వరూపం చూపించాడు. తాను అనుకుంటే, టెర్రెల్‌ను నాకౌట్ చేసి ఉండేవాడు. కానీ, అలా చేయకుండా, పదిహేను రౌండ్లపాటు ఫైట్‌ను కొనసాగించాడు. బలమైన పంచ్ విసిరిన ప్రతిసారీ 'నా పేరు ఏమిటి?' అని ప్రశ్నించడం అతని గౌరవం, ధర్మం, స్వభావాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. ప్రతీకారం అంటే కుట్రలు, కుతంత్రాలు చేయడం కాదని, ధైర్యంగా నిలబడి, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడమని అలీ నిరూపించాడు. అందుకే, ఆ ఫైట్ జరిగినప్పుడు రింగ్‌లో అలీ కేవలం ఒక ఛాంపియన్‌గా కాకుండా, ఒక స్వరంగా, ఒక ప్రకటనగా కనిపించాడు. ధైర్యం, పట్టుదలతో గుర్తింపును తిరిగి గెల్చుకునే అజేయుడి ఆత్మవిశ్వాసానికి చిహ్నంగా నిలిచాడు.



ఫైట్ అనంతరం... ముఖమంతా గాయాలతో టెర్రెల్

# పెండింగ్ ఎక్స్‌గ్రేషియా బకాయిలు చెల్లించాలి

### గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి సాయిల్ గౌడ్ డిమాండ్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా రూ.13 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి సాయిల్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం గీత పనివారల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నా కార్యక్రమానికి సాయిల్‌గౌడ్ హాజరై మాట్లాడుతూ ప్రమాదవశాత్తు తాటి, ఈత చెట్టుపై నుండి పడి మరణించిన, దివ్యాంగులైన గీత కార్మిక కుటుంబాలకు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, గీత వృత్తిలో చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెంచాలని కోరారు. ధర్నా కార్యక్రమంలో గీత పనివారల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు గోదా శ్రీరాములు, జిల్లా అధ్యక్షుడు చాపల అంజయ్య, ప్రధానకార్యదర్శి పబ్బు యాదయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి ఎండి ఇమ్రాన్, బిసి హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి ఏషాల అశోక్, నాయకులు పుట్ట రమేష్, అన్నెపు వెంకట్, గనబోయిన వెంకటేష్, సామల శోభన్ బాబు, దాసరి లక్ష్మయ్య, పందుల యాదగిరి ఎర్ర రమేష్, బత్తిని నరేష బాలగోని సత్యనారాయణ, బోలగాని లక్ష్మీనారాయణ, సీసా కృష్ణ, గాజుల బాలరాజు, నేతి కృష్ణయ్య, వీరమల్ల యా దయ్య, పులిపలుపుల మల్లేష్, జక్కర్ల వెంకటేష్, జిల్లా వెంకటయ్య, భీమవరం నరసింహ, బత్తిని శ్రీనివాస్, గుండు వెంకటేష్, బోలగాని జహంగీర్, తాళ్లపల్లి వెంకటయ్య, పల్లె వెంకన్న, సుదగాని వెంకన్న, దుర్గాపతి నరసింహ, గోపగాని రాజు తదితరులు పాల్గొన్నారు.



యాదాద్రిభువనగిరిలో..

### స్కిల్ యూనివర్సిటీలో గీత కార్మికులకు కోర్సులు : నాగభూషణం

**కరీంనగర్ సిటీ :** గీత పనివారల సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో న్యాలపట్ల రాజు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా గీత పనివారల సంఘం రాష్ట్ర కో కన్వీనర్ బొమ్మగాని నాగభూషణం హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కల్లుగీత వృత్తిపై ఆధారపడి లక్షలాదిమంది గీత కార్మికులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని, పరిశ్రమగా గీత వృత్తి రూపొందకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మరణాలు సంభవిస్తే, వికలాంగులైతే వారి కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం అందించే ఎక్స్‌గ్రేషియాను రూ.10లక్షలకు పెంచి తక్షణమే విడుదల చేయాలన్నారు. వన పెంపకాలకు 10 ఎకరాల భూమి ఇవ్వాలని, వృత్తి రక్షణ కోసం రక్షణ కవచాలు పంపిణీ చేయాలని, అన్ని సహకార సంఘాలకు ఆర్థిక సహాయం అందించాలని, రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీలో గీత కార్మికులకు ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టాలని, ఏజెన్సీ జిల్లాలలో గీత వృత్తిదారులకు సొసైటీలు ఏర్పాటు చేసి టిఎఫ్‌టిలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో గీత పనివారల సంఘం పునర్నిర్మాణం చేయడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు గొడిసెల తిరుపతిగౌడ్, పైడిపల్లి రాజు, బండారుపల్లి తిరుపతి, నేరెళ్ల సదానందం, తాళ్లపల్లి చంద్రయ్య, మాదారపు రత్నాకర్, బుర్ర మల్లయ్య, రాములు, బుర్ర అశోక్, రంగు శ్రీనివాస్, కుమార్, మార్క శ్రీకాంత్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రమాదవశాత్తు తాటి, ఈత చెట్టుపై నుండి పడి మరణించిన గీత కార్మికులకు చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియా బకాయిలను వెంటనే విడుదల చేయాలని గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రేగట్టి లింగయ్య, కొండ కోటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గీత కార్మికులందరికీ వృత్తి రక్షణ కవచాలు పంపిణీ చేయాలని, గీత పనివారల సంఘం జాతీయ నాయకులు, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మబిక్షం విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని, సూర్యాపేట జిల్లాకు ధర్మబిక్షం పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్, జిల్లా నాయకులు పాలకూరి బాబు, దోరేపల్లి శంకర్, బూర వెంకటేశ్వర్లు, తొట్ల ప్రభాకర్, బొడ్డు రామచంద్రు, బండారు లక్ష్మయ్య, రెడ్డిమల్ల శ్రీను, పెద్ది వెంకన్న పాల్గొన్నారు



కరీంనగర్‌లో..



సూర్యాపేటలో..

# 15 నుంచి సిపిఐ రాష్ట్రవ్యాప్త బస్సు జాత



### విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు, అభిమానులకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపు

**ప్రజాపక్షం/చౌటుప్పల్ మున్సిపల్ :** సిపిఐ వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే బస్సు జాతను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పార్టీ శ్రేణులకు, అభిమానులకు పిలుపునిచ్చారు. సోమవారం యాదాద్రి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన మండల కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా నెల్లికంటి సత్యం హాజరై మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మంనగరంలో పెద్దఎత్తున సిపిఐ ముగింపు ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ సభ విజయవంతం కోసం రాష్ట్రవ్యాప్తంగా మూడు బస్సు జాతాలు నిర్వహించి విస్తృత ప్రచారం నిర్వహించనున్నామన్నారు. ఈ జాతాలలో రెండవ విడత బస్ జాత ఎమ్మెల్సీ నెల్లికండ్ సత్యం ఆధ్వర్యంలో 15న గద్వాలలో ప్రారంభమై 19న చౌటుప్పల్ పట్టణానికి జాత 19న చౌటుప్పల్ పట్టణానికి జాత రావడం జరుగుతుందని, ఈ జాతకు పార్టీ శ్రేణులు శ్రేయోభిలాషులు పెద్దఎత్తున స్వాగతం పలకాలని కోరారు. వంద సంవత్సరాల త్యాగాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని, భారత స్వాతంత్రోద్యమంలో అనేకమంది వీరులను దేశం కోసం అర్పించిన పార్టీ సిపిఐ అన్నారు. పేద ప్రజల హక్కుల కొరకు, వారి గొంతుగా నిలబడ్డ సిపిఐ ఈ దేశంలో అట్టడుగువర్గాల ప్రజల తరపున, దోపిడీ, పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూర్చే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నిర్వహించిందన్నారు. ఈశతాబ్ద కాలంలో ఎన్నో పోరాటాలు, ఎన్నెన్నో త్యాగాలు, ఎంతో మంది రక్తతర్పణతో ఎన్నో విజయాలు సాధించి సిపిఐ తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. ఈ తరుణంలో నిర్వహించే సిపిఐ శతజయంతి ముగింపు ఉత్సవాలకు అన్నివర్గాల వారు సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్‌రెడ్డి, మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, సహాయకార్యదర్శి ఉడుత రామలింగం, ఎఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరు వెంకటేష్, ఎల్లంకి మహేష్, టంగుటూరి రాములు, దాసరి అంజయ్య, రోషణగారి అంజయ్య, బద్దుల సుధాకర్, నీళ్ల బిక్షపతి, రొండి నర్సింహా, కడవేరు కౌసల్య, కుంటి పాపయ్య, బోయిని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకిచ్చిన హామీలు ఒక్కటీ అమలు చేయలే!

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి విమర్శించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా మణికంఠ రెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి వద్ద విద్యాశాఖ ఉన్న సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమిస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. విద్యను వ్యాపారంగా మారుస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, లాప్‌టాప్‌లు, ప్రతి విద్యార్థి ఇంటింటికి ఉచిత వైఫై, ఐదు లక్షల విద్య భరోసా కార్డు వంటి అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 23 నెలలైనా ఒక్క హామీ అమలు చేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి లు, స్కాలర్‌షిప్ ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ హాస్టళ్లు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. హాస్టల్ విద్యార్థులందరికీ చలి కాలం దృష్ట్యా ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆదిత్య, బండి ప్రణయ్, తాలూక శివసాయి తదితరులు పాల్గొన్నారు.




# మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు ఇవ్వొద్దు

### ఎఐటియుసి వినతి

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ :** మధ్యాహ్న భోజన పథకాన్ని సుప్రీం కోర్టు గైడ్లైన్స్ ప్రకారం ప్రైవేటు సంస్థలకు ఇవ్వరాదని, సెంట్రలైజ్ కిచెన్ విధానాన్ని కొడంగల్ నియోజకవర్గంలో అక్షయపాత్రకు ఇవ్వడాన్ని ప్రభుత్వం విరమించుకొవాలని ఎఐటీయూసి రాష్ట్ర కమిటీ సభ్యులు కుంటాల రాములు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం పెండింగ్‌లో ఉన్న కొడిగుడ్డు, అల్పాహారం బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, అధ్యక్షురాలు ప్రేమ్ పావని, సత్యమ్మ, బి.సునిత, లక్ష్మీ, గజేందర్, కళాబాయి, యశ్వంతరావు, గంగమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.






**నిజామాబాద్ అర్బన్ :** సెంట్రలైజ్డ్ కిచెన్ ఆలోచనను ఉపసంహరించుకోవాలని, ఎండిఎం నిర్వాహకులకు ప్రతినెల సకాలంలో బిల్లులు చెల్లిస్తు, ప్రభుత్వ హామీలో భాగంగా వేతనాలు ఇస్తు కొనసాగించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఎఐటియుసి ఆద్వర్యంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఏజెన్సీల ద్వారా కొనసాగించాలని అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓమయ్య, ఎండిఎం జిల్లా కార్యదర్శి టి.చక్రపాణి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని యథాతథంగా ఏజెన్సీల ద్వారా కొనసాగించాలని డిమాండ్ చేశారు. మొండిగా ప్రయివేటు సంస్థలకు అప్పజెప్పే కుట్రలు చేస్తే ఎఐటియుసి తీవ్రమైన పోరాటాలకు సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాయమ్మ, లావణ్య, సరస్వతి, పోసాని, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## నేడు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ప్రారంభించనున్న జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో నేడు జరగబోయే అండర్ 14,19 జిల్లా స్థాయి క్రీడా పోటీలకు అన్ని ఏర్పాటు పూర్తయినట్లు ప్రిన్సిపల్ రవికుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపూలే బిసి గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 8 వరకు అండర్ 17 విభాగంలో క్రీడలు నిర్వహించడం జరిగిందని నేటి నుంచి అండర్ 14,19 విభాగంలో క్రీడా పోటీలను ఈ నెల 13 వరకు ఇదే పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.క్రీడా పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,జిల్లా విద్యాధికారి బిక్షపతి, ఆర్ సి ఓ స్వప్న,డిసిఓ సంధ్య తదితరులు పాల్గొంటారని ఈ క్రీడా పోటీలలో ఉమ్మడి జిల్లాలోని 14 కళాశాలలతో పాటు 16 పాఠశాలలకు చెందిన 600 మంది విద్యార్థులు పాల్గొంటారని, క్రీడా పోటీలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.



## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తాళం

కిరాయి ఇవ్వకపోవడంతో యజమాని ఆగ్రహం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తాళం వేసిన సంఘటన సూర్యాపేట పట్టణంలోని తిలక్‌నగర్‌లో చోటుచేసుకుంది. గత మూడు సంవత్సరాలుగా కిరాయి ఇవ్వడంలేదని ఆగ్రహించిన యజమాని పాఠశాల గేట్‌కు తాళం వేశారు. కిరాయి ఇచ్చేంత వరకు తాళం తీయనని అక్కడి నుండి వెళ్ళిపోయాడు. దీంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఆరు బయట, చెట్ల కింద నిలబడిపోయారు. ఈ విషయమై ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పాఠశాలకు సొంత భవనం లేక ప్రైవేట్ భవనంలో నడిపిస్తున్నామని, బిల్లులు ఆగిన మాట వాస్తవమేనన్నారు. ఈ సందర్భంగా రెండు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉందని త్వరలో చెల్లిస్తామని తెలిపారు. డిఈఓకు సమాచారం ఇచ్చామని ఆయన వచ్చిన తరువాత యజమానితో చర్చించి తాళం తీయిస్తామన్నారు. అప్పటి వరకు విద్యార్థులను హైస్కూల్‌కు తరలించి తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

## ప్రజావాణి దరఖాస్తులకు సత్వరం పరిష్కారం



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం చూపాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ భాస్కరరావులతో కలిసి జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల ప్రజల నుండి 50 ఆర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 33, జిల్లా పంచాయతీ 4,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ 2, ల్యాండ్స్ & సర్వే 2, ఇరిగేషన్ 2, మున్సిపాల్టీ 2, వైద్య శాఖ, మార్కెటింగ్, జిల్లా సంక్షేమ శాఖ, సివిల్ సప్లై, హౌసింగ్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ జయమ్మ, జడ్పీ సీఈవో శోభారాణి, డిఆర్డిఏ పిడి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ విజయ సింగ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రత్యేక పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షల కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి చంద్రశేఖర్ తెలిపారు. ఆర్‌బికె వైద్యులు, సిబ్బందితో ఆయన తన కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌బికె బృందాలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బృందాలు ప్రతి రోజు ఉదయం 9 గంటల లోపు తామకు కేటాయించిన పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు పూర్తి చేయాలని ఆదేశించారు. పరీక్షలలో గుర్తించిన రుగ్మతలపై తక్షణమే సంబంధిత రిఫరల్ సెంటర్లకు విద్యార్థులను పంపించాలని సూచించారు. రక్తహీనత (అనీమియా), కుటుంబ పోషణ సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధతో ఫాలోఆప్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కోటిరత్నంతో పాటు డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ సంజీవరెడ్డి, డాక్టర్ అశ్రిత పాల్గొన్నారు.

## పత్తి రైతులను ఆదుకోవాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పత్తి రైతును గోడు గోడున ఏడిపిస్తున్న కేంద్ర ప్రభుత్వ అణాలోచిత నిర్ణయాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడ్డుకుని, రాష్ట్ర పత్తి రైతులను కాపాడాలని ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి డిమాండ్ చేశారు. దెబ్బతిన్న పత్తి పంట చెట్లతో పి ఆర్ పి ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదు ట పత్తి రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కి మెమోరాండం అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెంథా లాంటి అత్యంత ప్రమాదకరమైన తుఫాన్లతో పాటు దీర్ఘకాలంగా కురిసిన వర్షాల వల్ల పత్తి పంట విపరీతంగా దెబ్బతిని రైతులు వలవల ఏడుస్తున్న తరుణంలోకేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సిసిఐ అనాలోచిత నిర్ణయాలు తీసుకొని రైతులను ఇబ్బందికి గురి చేస్తున్నారని అన్నారు.రైతులకు, కౌలు రైతులకు కిసాన్ యోజన యాప్ కింద పెట్టిన స్లాట్ సిస్టం నిరుపయోగ కరంగా ఉన్నందున దానిని వెంటనే దానిని వెంటనే రద్దు చేయాలన్నారు.ఈ ధర్నాలో జిల్లా నాయకులు నాగిల్ల యాదయ్య,ఉయ్యాల లింగస్వామి గౌడ్,సోమ రామిరెడ్డి,తోకల రవీందర్ రెడ్డి,సోమ చంద్రారెడ్డి,వరకాంతం ప్రతాపరెడ్డి,కోమటిరెడ్డి కృష్ణారెడ్డి, పత్తి రైతులు పాల్గొన్నారు.




## పెట్టుబడిదారీ దేశాల్లో కమ్యూనిస్టుల వైపు ప్రజల మొగ్గు

సిపిఐ ప్రచార జాతాను జయప్రదం చేయాలి
ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/మునుగోడు:** పెట్టుబడిదారి దేశమైన అమెరికాలో కమ్యూనిస్టులు గెలవడం శుభసూచికమని రానున్న రోజులలో ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రాబల్యం మరింత పెరగనుందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం మునుగోడు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సిపిఐ100 వసంతాల ప్రయాణంలో ప్రజా సమస్యల పరిష్కార కోసం పోరాడిన చరిత్ర అని గుర్తు చేశారు. డిసెంబర్ 26న ఖమ్మం పట్టణంలో జరిగే భారీ బహిరంగ సభకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. నవంబర్ 15నజోగులాంబ జిల్లా కేంద్రంలో ప్రారంభమవుతున్న సిపిఐ ప్రచార బస్సుజాతను జయప్రదం చేయాలని కోరారు.నల్లగొండ జిల్లా కు 17న డిండి చేరుకొని ఉమ్మడి నల్లగొండ జిల్లా మీదుగా ఖమ్మం జిల్లాలో కొనసాగుతుందని అన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా నష్టపోయిన వరి,పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సిసిఐ అధికారులు పత్తి కొనుగోలులో రైతులను ఇబ్బందులకు గురి చేయరాదని కోరారు. నష్టపోయిన రైతులకు ఎకరాకి 50 వేల నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు,మండల కార్యదర్శి చాపల శ్రీనివాస్,జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, బి.లాలు, గోస్కొండ లింగయ్య, మందుల పాండు,వనం వెంకన్న,బండమీది యాదయ్య, ఉప్పునూతల రమేష్,కాగితం వెంకన్న, మాధగోని సత్తమ్మ,దుబ్బ వెంకన్న, ఉప్పర బోయినసతీష్,బండారు శంకర్,కట్ట దశరథ,గోపగోని ఉదయ్,మోకాళ్ళ పరమేష్, ఎల్లయ్య, అశోక్,కృష్ణయ్య,కృష్ణ పాల్గొన్నారు.



## చివరి గింజ వరకూ కొంటాం

ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/యాదాద్రి :** ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం భువనగిరి మండలం చీమలకొండూరు, చందుపట్ల ఐకేపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ ఎన్ని ఎకరాలు వేశారు. కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు గ్రామంలోకి చెత్త ట్రాక్టర్‌లు రావడం లేదని తెలుపగానే వెంటనే జిల్లా పంచాయతీ అధికారికి ఫోన్ చేసి రేపటి నుండి గ్రామాలకు ట్రాక్టర్లు పంపాలని ఆదేశించారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని కేంద్రం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు ఎన్ని ధాన్యం కుప్పలు కాంటా వేసి కొనుగోలు చేశారన్నారు. ధాన్యం తేమ శాతాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. తేమ శాతం వచ్చిన వెంటనే ధాన్యం నిల్వ ఉంచకుండా కొనుగోలు చేసి లారీల ద్వారా మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం కుప్పలను టార్పాలిన్స్ కవర్లతో కప్పి ఉంచాలని సూచించారు. కొనుగోలు చేసినంత వరకు ట్యాబ్ ఎంట్రీ పూర్తి అయిందా అని అడిగి ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రంలో వచ్చే సీజన్ వరకు రైతులకు కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి వ్యక్తిగత బాధ్యత

మానవ తప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదాలు
నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**ప్రజాపక్షం/నల్లగొండ:** రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరు వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన రోడ్డు భద్రత జిల్లాస్థాయి సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కాలంలో వివిధ కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయి, దీనివల్ల మనుషుల ప్రాణాలు పోయి కుటుంబాలు వీధిన పడుతున్నాయి ,రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. మానవ తప్పిదాల వల్ల రొడ్డు ప్రామాదాలు జరగకుండా చూడాలి, ఇందుకు వివిధ శాఖలు సమన్వయంతో వ్యక్తిగత శ్రద్ధ వహించి పని చేయాలి. ప్రత్యేకించి పోలీస్ శాఖ గుర్తించిన బ్లాక్ స్పాట్లు, సూచించిన ప్రదేశాలలో ప్రమాదాల నివారణకు ఆర్అండ్‌బి,నేషనల్ హైవే,అలాగే ఇతర శాఖలు పూర్తి సహకారం అందించి ప్రమాదాలను నివారించేందుకు సహకరించాలి,స్కూల్ బస్సుల వల్ల ప్రమాదాలు జరగకుండా ప్రతి స్కూలు వాహనానికి సైడ్ మిర్రర్లు ఏర్పాటు చేయడమే కాకుండా,బస్సులో సహాయకున్ని తప్పనిసరిగా ఉంచేలా చర్యలు తీసుకోవాలి,వారి నుండి ఇండెమినెట్ బాండును తప్పనిసరిగా తీసుకోవాలి, ఆర్టీసీ బస్సుల ద్వారా యాక్సిడెంట్లు జరగకుండా ఆర్‌టిసి అధికారులు చర్యలు చేపట్టాలి,ప్రమాదాలను నివారించేందుకు అన్ని వాహనాలకు రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన వివిధ రహదారులపై ప్రమాదాలు జరిగే ప్రదేశాలను పోలీసు శాఖ ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత శాఖ అధికారులకు అధికారికంగా తెలియజేయడం జరుగుతున్నదని, వీటన్నిటిపై తక్షణమే స్పందించి ప్రమాదాలు నివారించాలని,చిట్యాల అండర్ పాస్ వద్ద వర్షపు నీరు నిలిచిపోవడం వల్ల నాలుగైదు రోజులు తీవ్ర ఇబ్బందులకు గురి కావడం జరిగిందని, దీనికి శాశ్వత పరిష్కారం కనుక్కోవాలని జిల్లా కలెక్టర్ తో కోరారు. సర్వీస్ రోడ్లు లేకుండా పెట్రోల్ బంకులు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేసి సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ,ఆర్ అండ్ బి ఈ ఈ శ్రీధర్ రెడ్డి,ఆర్ఎమ్ ఆర్‌టిసి.కె.జానీ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్, డిఎస్‌పి శివరాం రెడ్డి, పోలీస్ అధికారులు, తదితరులు హాజరయ్యారు.

## ఖమ్మం బహిరంగ సభకు వేలాదిగా తరలుదాం

యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి
యానాల దామోదర్ రెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సిపిఐ కార్యాలయంలో మంచాల సైదులు అధ్యక్షతన సీపీఐ మండల సమితి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే సిపిఐ 100 వసంతాల ముగింపు బహిరంగ సభకు వేలాదిగా తరలి బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు అనేక ప్రజా సమస్యలపై పోరాటపటిమను కొనసాగిస్తూ అనేక దశలలో ఉద్యమాలను నిర్వహించిన చరిత్ర ఎర్రజెండాకు మాత్రమే ఉందని అన్నారు. ఈనెల 19న సిపిఐ 100 వసంతాల సందర్భంగా సంస్థాన్ నారాయణపురం కు విచ్చేస్తున్న ప్రచార జాతకు అపూర్వ స్వాగతం పలికి విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కురిమిద్ద శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, మండల కార్యవర్గ సభ్యులు మంచాల జంగయ్య, నరసింహ, పల్లె మల్లారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల అంజయ్య, సిపిఐ శాఖ కార్యదర్శులు కొప్పు సుధాకర్, కొర్ర శంకర్ పాల్గొన్నారు.

## ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు



నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు.సోమవారం నల్లగొండ పట్టణంలోని మెడికల్ కళాశాలలో నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సులో జిల్లా ఎస్‌పి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ అనే విష సంస్కృతికి దూరంగా ఉండాలని తమ తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలని,సీనియర్లు,జూనియర్లు అని బేదం వీడనాడుతూనేటి సీనియర్లు ఒకప్పుడు జూనియర్లుఅనే విషయం మరచిపోవద్దన్నారు. తోటి విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రొహిబిషన్ ర్యాగింగ్ యాక్ట్ ప్రకారం, ర్యాగింగ్‌కు పాల్పడితే ఒకసారి కేసు నమోదైతే,6 నెలల నుండి 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుందని చెప్పారు. ర్యాగింగ్ అనగా వ్యక్తులను, మానసికంగా లేదా శారీరకంగా అవమానపరచడం, భయపెట్టడం, భయం కలిగేటట్లు చేయడం,వారి పట్ల అమర్యాదగా ప్రవర్తించడం, కొట్టడం తదితర అంశాలు ర్యాగింగ్ చట్టంలోకి వస్తాయని పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. సరదా కోసం చేసే ర్యాగింగ్ వల్ల అనర్థాలు జరుగుతాయని, చట్టాలు కూడా చాలా పటిష్టంగా ఉన్నాయని, ర్యాగింగ్ చేస్తే కేసులు నమోదు చేయబడతాయని వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తూ ర్యాగింగ్ అనే భూతాన్ని కళాశాల నుండి తరిమేయాలనిసూచించారు.ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100 ద్వారా సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్పి కె శివరాం రెడ్డి, ఎస్బి సిఐ రాము,వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ సైదులు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## చట్టాలు అమలులో అలసత్వం వద్దు

**ప్రజాపక్షం/సూర్యాపేట :** చట్టాలను అమలుపర్చడంలో పోలీసులు అలసత్వం చూపరాదని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డేలో వివిధ సమస్యలతో బాధపడుతున్న వారి నుండి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమకందిన ఫిర్యాదులను పారదర్శకంగా అధికారులతో విచారణ చేయించి న్యాయం చేస్తామని చెప్పారు.

## ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత

సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ సీతారామారావు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. తేమ శాతం 17 రాగానే కాంటా వేసి లారీల ద్వారా మిల్లులకు ఎగుమతి చేయడంతోపాటు ట్యాబ్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి కార్యాలయంలో ప్రజావాణిలో వచ్చే దరఖాస్తుల కొరకు ఒక రిజిష్టర్ ఏర్పాటు చేసుకొని ప్రతి దరఖాస్తును నమోదు చేయాలని అలాగే దరఖాస్తు యొక్క స్టేటస్‌ని లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 44 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి అప్పారావు, డిఎఫ్‌ఓ సతీష్ కుమార్, డిపిఓ యాదగిరి, డిఇఓ అశోక్, సిపిఓ కిషన్ రెడ్డి, డిడబ్ల్యుఓ నరసింహారావు, సంక్షేమ అధికారులు శంకర్, శ్రీనివాస్, నరసింహారావు, దయానందరాణి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్, హౌజింగ్ పిడి సిద్ధార్థ, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## పార్వతి సుబ్రహ్మణ్యస్వామిల విగ్రహ ప్రతిష్ట

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని మహాదేవపూర్ గ్రామంలో గల శ్రీ అక్కన్న మాదన్న పర్యవేక్షణలో వెలసిన శ్రీ వేణుగోపాలస్వామి ఉమామహేశ్వర ఆలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న పునఃప్రతిష్ట కార్యక్రమంలో సోమవారం పార్వతీ అమ్మవారు, గణపతి స్వామి, సుబ్రహ్మణ్యస్వామి, వీరభద్ర, నంది, బలిపీఠం ప్రతిష్ట మహోత్సవాన్ని పాలెపు రామకృష్ణ, శ్రీమన్నారాయణ, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య భక్తుల కరతాల ధ్వనులమధ్య ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కవాడి శివారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతిష్ట కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి రుద్ర వెంకటేష్, మాజీ సర్పంచ్ దేవరకొండ వేణుగోపాల్, ధర్మకర్తలు దండం ప్రభాకర్, కందాడి రమణమ్మ బాల్‌రెడ్డి, దండెం రవిందర్ పాల్గొన్నారు.

## దొంగల ముఠా అరెస్టు

రూ.5 లక్షల విలువైన బంగారం..
రూ.50వేల వెండి స్వాధీనం
జిల్లా ఎస్‌పి కె నరసింహ వెల్లడి





**ప్రజాపక్షం/సూర్యాపేట :** రాత్రి ఆరుబయట నిద్రిస్తున్న వారే లక్ష్యంగా చేసుకొని గత కొన్ని రోజులుగా సూర్యాపేట, నల్లగొండ, జనగామ జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని మరికొన్ని జిల్లాలో బంగారు ఆభరణాలు దొంగతనం చేస్తున్న నలుగురు సభ్యుల దొంగల ముఠాను అర్వపల్లి మండల, జిల్లా సిసిఎస్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీలలో పట్టుకున్నారు. వీరి నుండి రూ. 5 లక్షల విలువైన బంగారం, రూ.50వేల విలువైన వెండి, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి కె నరసింహ సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం సిసిఎస్, అర్వపల్లి పోలీసులు సంయుక్తంగా అర్వపల్లి మండల కేంద్రంలోని జంక్షన్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులను ఆపి విచారించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారిగా వారిని గుర్తించి తనిఖీ చేశారు. వారి వద్ద రూ.5 లక్షల విలువైన బంగారం (4.25 తులాలు), రూ.50విలువైన వెండి లభ్యమైంది. దీంతో వారిని అదుపులోకి తీసుకొని వారి ప్రయాణిస్తున్న రెండు వాహనాలు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, పోలవరం మండలం, ఎదురులంక గ్రామానికి చెందిన ఓలేటి మహాలక్ష్మాల రావు అలియాస్ మహా, అదే రాష్ట్రంలోని వెస్ట్ గోదావరి జిల్లా, పెనుగొండ మండలం, చిన్నమల్ల గ్రామానికి చెందిన గద్దెడ సురేంద్ర, అదే జిల్లాకు చెందిన తణుకు మండలం, వీరభద్రాపురం గ్రామానికి చెందిన అల్లేటి రాజేష్, వేదులూరు గ్రామానికి చెందిన వెంద్ర రాఘవేంద్రరావు లుగా చెప్పారు. గత నెలలో అర్వపల్లి, నాగారం, తుంగతుర్తి, శాలీగౌరారం పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రిపూట దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. గతంలో ఏ1 నింధితుడుగా ఉన్న ఓలేటి మహాలక్షాల రావు పై 37 కేసులు ఉన్నట్లు తెలిపారు. కాకినాడ జైలు నుండి ఇతను తప్పించుకొని తిరుగుతున్నాడు. ఏ2 నింధితుడైన గద్దెడ సురేంద్రపై 16 కేసులు, ఏ3 నిందితుడు అల్లేటి రాజేష్, ఏ4 నిందితుడు వెంద్ర రాఘవేంద్రరావుపై 4 కేసు లు ఉన్నట్లు చెప్పారు. ఈ దొంగల ముఠాను పట్టుకోవడంలో చాకచక్యం ప్రదర్శించిన సిసిఎస్ పోలీసులతోపాటు అర్వపల్లి ఎస్ఐ సైదులును అభినందిస్తూ ఎస్‌పి రివార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ప్రసన్న కుమార్, నాగారం సిఐ నాగేశ్వర్ రావు, సిసిఎస్ ఎస్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## మైనారిటీ అర్బన్ కెజిబివిని సందర్శించిన రెవెన్యూ అదనపు కలెక్టర్



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ మహబూబ్ పట్టణంలో గల మైనారిటీ కేజీబీవీ ని సందర్శించారు. అక్కడ వంట గదిని పరిశీలించి అక్కడ ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని సూచించారు. నిత్యావసర వస్తువులు నిల్వ వుండే స్టోర్ రూమ్ పరిశీలన చేశారు. సరుకుల నాణ్యత, కూరగాయలు తాజాగా ఉన్నాయా అని చూసారు. తరువాత పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిలతో వారికి చదువుతో ఉన్నత మార్కులు ఏ విధంగా సాధించాలో మెలకువలు చెప్పారు.

## రేపు మహబూబ్‌నగర్ జిల్లా సమితి సమావేశానికి కూనంనేని

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : ఈనెల 12వతేదిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో జయప్రదాన్ని కోరుతూ నిర్వహించనున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సమితి సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మాలు హాజరు కానున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ ఎండి ఫయాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా సిపిఐ శతాబ్ది ఉత్సవాల కార్యక్రమాలపై చర్చించి అనేక నిర్ణయాలు తీసుకుంటారని ఈ సమావేశాలలో మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్, నారాయణపేట జిల్లాల కార్యదర్శిలతో పాటు రాష్ట్ర సమితిసభ్యులు జిల్లా కార్యవర్గ కౌన్సిల్‌సభ్యులు మండలాల కార్యదర్శిలు , ప్రజాసంఘాల జిల్లా బాద్యులు పాల్గొంటారని ఆయన తెలిపారు. సభ్యులందరూ సకాలంలో హాజరుకావాలని సమావేశం ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

## అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాదం అందించిన పోలీస్ సిబ్బంది



ప్రజాపక్షం/పెబ్బేరు : పెబ్బేరు శ్రీ దర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్య అన్నదాన కార్యక్రమంలో అయ్యప్ప స్వాములకు భిక్షా కార్యక్రమం ఏర్పాటు చేస్తుంటారు. అందులో భాగంగానే కార్తీక 3వ సోమవారం ఎస్సై యుగంధర్ రెడ్డి, ఎస్సై దివ్య రెడ్డి, ఏఎస్సై శ్రీనివాస్ గౌడ్, వారి సిబ్బంది సౌజన్యంతో అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములకు పోలీసులు బిక్షా కార్యక్రమం వడ్డించి సేవలో పాల్గొన్నారు. అన్న ప్రసాద వితరణ అనంతరం అయ్యప్ప స్వాములకు తాంబూలం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు అయ్యప్ప స్వామి దీక్షితులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



ప్రజాపక్షం/ఆత్మకూరు : ఆత్మకూరు మున్సిపల్ కేంద్రంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ శశిధర్ తెలిపారు. వీధి కుక్కల వల్ల ప్రమాదాలు జరగకుండా ప్రజలు ముఖ్యంగా పిల్లలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కుక్కలు నిద్రిస్తున్నప్పుడు ఆహారం వాటి పిల్లల దగ్గర ఉన్నప్పుడు కుక్కలను భయ పెట్టకూడదని సూచించారు. కరిచిన సందర్భంలో సబ్బుతో ఆ ప్రదేశాన్ని కడిగి ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. రేబీస్ టీకా వేయించాలని సూచించారు. ఇదివరకు మున్సిపల్ పట్టణంలో దాదాపు 40 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి వదిలి వేసినట్లు ఆయన తెలిపారు.

## వృద్ధాశ్రమాన్ని సందర్శించిన జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : బిజినేపల్లి మండలం గ్రామశివారులోని ప్రశాంతి నిలయం వృద్ధాశ్రమాన్ని జిల్లాసాంఘిక సంక్షేమశాఖ అధికారి ఉమాపతి, డిఇఓ రమేష్‌కుమార్‌లు సందర్శించారు. ఆశ్రమంలోని వంటగది, స్టోర్‌రూం, డైనింగ్ హాల్‌లను పరిశీలించారు. అనంతరం వృద్ధులతో అప్యాయంగా మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు చలినుండి రక్షణపొందేలా ఏర్పాటు చేయాలని నిర్వాహాకులను ఆదేశించారు. సరుకులు, స్టోర్‌రూంలను పరిశీలించి రికార్డులను తనిఖీచేశారు. అంతకుముందు డిఇఓ రమేష్ కుమార్ బిజినేపల్లి మండలపరిధిలోని మంగనూరు ప్రాథమిక ఉన్నత పాఠశాలలను తనిఖీచేశారు. విద్యార్థుల సమాచారాన్ని పరిశీలించిరానున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధంచేసేలా ప్రత్యేక తరగతులను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయులు పాఠశాలలకు సమయపాలన పాటించాలని ఆయన సూచించారు. ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు.

## ప్రజావాణికి 27 ఫిర్యాదులు



ప్రజాపక్షం/నారాయణపేట్ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్ అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 27 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి వనరుల గణనకు జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ

కలెక్టర్ విజయేందిర బోయి

ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ : రాష్ట్ర ఆర్థిక, గణాంక శాఖ డైరెక్టరేట్ ఆదేశాల అనుసరించి 7వ చిన్న నీటి పారుదల గణన, రెండవ నీటి వనరుల గణన 2023–24 సంవత్సరం కు జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజావాణి అనంతరం జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా సాగునీటి పారుదల అధికారి, ఎస్.ఈ, విద్యుత్ శాఖ, ఎస్.ఈ పంచాయతీ రాజ్, డి.డి. భూగర్భ నీటి పారుదల శాఖ, డి.ఆర్.డి ఓ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఈ.ఈ, ఇరిగేషన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సభ్యులుగా, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మెంబర్ కన్వీనర్‌గా జిల్లా స్థాయి స్టీరింవ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా ఇరిగేషన్ గణన అధికారిగా జిల్లా కలెక్టర్, అదనపు ఇరిగేషన్ గణన అధికారిగా జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి, మున్సిపల్ గణన అధికారిగా మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్ మండల ఛార్జీ అధికారిగా ఉంటారని తెలిపారు. గ్రామ ఎన్యూమరేటర్‌లుగా వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ పాలన అధికారులు, పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా పని చేస్తారని తెలిపారు. ఇరిగేషన్ ఏ. ఈ.ఈ, మండల ప్రణాళిక గణాంక అధికారి సూపర్‌వైజర్‌లుగా ఉంటారని తెలిపారు. తహశీల్దార్‌లు వారం రోజుల్లో చార్జి రిజిస్టర్ తయారు చేసి శిక్షణ తరగతుల పూర్తి చేయాలని ఆదేశించారు. శిక్షణ అనంతరం చిన్న నీటి వనరుల గణన ప్రారంభం కానుందని తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ పాల్గొన్నారు.



**ప్రజావాణి దరఖాస్తులు సత్వరం పరిష్కరించాలి**

**ప్రజావాణికి 95 దరఖాస్తులు**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అందజేసిన దరఖాస్తులు సంబంధిత అధికారులు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన ప్రజలు తమ వినతులు, ఫిర్యాదులు సమర్పించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న కలెక్టర్ దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించి, పరిధిలో పరిష్కరించగలిగిన వాటిని వెంటనే పరిష్కరించాలి. ఈ కార్యక్రమంలో మొత్తం 95 దరఖాస్తులు స్వీకరించబడ్డాయని, వాటిని సంబంధిత శాఖలకు పంపించినట్లు కలెక్టర్ వివరించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు స్పెషల్ ఆఫీసర్‌లు సందర్శించి కొనుగోళ్లలో సమస్యలకు తావు లేకుండా చూడాలని సూచించారు. రెవెన్యూ అవనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ కలెక్టర్ ప్రజావాణి కార్యక్రమంలో సి.ఎం.ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన పెండింగు దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తొలుత సమావేశంలో ప్రముఖ కవి అందెశ్రీ మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ వెంకటరెడ్డి, డిఆర్‌డిఓ నర్సింహులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో అక్షయపాత్రను రద్దు చేయాలని వినతి



ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వెంకటేష్

ప్రజాపక్షం/ ధన్వాడ : ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న అక్షయపాత్రను వెంటనే రద్దు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వెంకటేష్ అన్నారు. సోమవారం నాడు ధన్వాడ మండల కేంద్రంలో మధ్యాహ్న భోజనం కార్మికులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరిచి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేద బడుగు బలహీనవర్గాల పేద విద్యార్థులకు పౌష్టిక ఆహారంతో పాటు మంచి భోజనాన్ని అందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నుండి ఎన్నో ఆలోచనలతో గతంలో ఇచ్చిన హామీలను మేరకు కార్మికుల వేతనాలు పెంచాలని ఆదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న అక్షయపాత్ర పథకాన్ని తొలగించాలన్నారు. ఈనెల 11న నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు మధ్యహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా ఈనెల 24 న రాష్ట్ర కమిషనర్ ఆఫీసర్ ముందు మధ్యాహ్న భోజన కార్మికులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు రేఖమ్మ, సునీతమ్మ, ఎల్లమ్మ, అనురాధ, అంజమ్మ, సాహిదా బేగం, నూర్జాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## కక్షిదారులు స్పెషల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం

ఎస్పీ డాక్టర్ వినీత్



ప్రజాపక్షం/నారాయణపేట్: ఈ నెల 15 వ తేదీన స్పెషల్ లోక్ అదాలత్ ఉన్న సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రజలు, కక్షిదారులు పూర్తిగా ఈ స్పెషల్ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, లోక్ అదాలత్ అనేది ఇరు పక్షాల సమ్మతితో కేసులను త్వరగా, తక్కువ ఖర్చుతో పరిష్కరించే ప్రజలకు ఉపయోగకరమైన అవకాశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజీ చేసుకునే అవకాశం ఉన్న కేసులు క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, వైవాహిక, కుటుంబ సమస్యలు, డ్రంకన్ డ్రైవ్, మోటార్ వాహన చట్ట ఉల్లంఘనలు, చెక్ బౌన్స్, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం వంటి వివిధ కేసులలో మాజీ కూర్చుకోవచ్చు అని తెలిపారు. చిన్న చిన్న కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృథా చేసుకోరాదు. రాజీ అనేది శాంతికి, పరిష్కారానికి సరైన మార్గం అని పేర్కొన్నారు. న్యాయశాఖ అందిస్తున్న ప్రత్యేక అవకాశాన్ని ప్రతి కక్షిదారు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిధిలోని పోలీసు అధికారులు, ఎస్‌ఎచ్‌ఓలు, కోర్టు డ్యూటీ కానిస్టేబుల్‌లు, సంబంధిత సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. తమ కేసులు రాజీ చేసుకోవాలనుకునే వారు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని ఎస్పీ తెలిపారు.

## ఇవిఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : జిల్లాకేంద్రంలోని నాగర్‌కర్నూల్ పట్టణంలో ఉన్న ఇవిఎం గౌడౌన్‌ను జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సోమవారం సమగ్రంగా పరిశీలించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా ఆయన క్షేత్రస్థాయి సందర్శన నిర్వహించారు. ఇవిఎం గోడౌన్‌వద్ద వేసిన సీల్స్‌ను, భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ అక్కడ ఏర్పాటుచేసిన పోలీసు బందోబస్తు తీరును గమనించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతినెల ఇవిఎం గోడౌన్‌ను తప్పనిసరిగా తనిఖీచేయాలి. ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలమేరకు ఈతనిఖీలను కచ్చితంగా అమలు చేస్తున్నామని తెలిపారు. తనిఖీ సమయంలో కలెక్టర్ ఇవిఎంల నిల్వ పరిస్థితులు, గోడౌన్‌లో ఏర్పాటుచేసిన సిసి కెమెరాల పనితీరు, సీల్స్ వివరాలు, భద్రత ఏర్పాట్లలో ఎటువంటిలోపం లేకుండా కఠినచర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్‌వెంట కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

**ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి**

ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు పి.అమరేందర్, దేవసహాయంతో కలిసి దరఖాస్తుదారుల నుంచి ఆర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 51 ఆర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మకంతో ఎంతో దూరం నుంచి వ్యయ ప్రయాసాల కోర్చి వస్తుంటారని ఈవిషయంలో అధికారులు సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించేలా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లా అధికారులు జాప్యంలేకుండా దరఖాస్తులను పరిష్కరించి దరఖాస్తుదారునికి సమాచారం తెలియపరచాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, డిప్యూటి కలెక్టర్లు హర్షవర్ధన్, అశోక్, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధశాఖల జిల్లా అధికారులు , కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముమ్మరంగా కొనసాగుతున్న కోనేరు పనులు



ప్రజాపక్షం/మక్తల్: మక్తల్ పట్టణంలో ప్రసిద్ధి చెందిన పడమటి ఆంజనేయ స్వామి వారి పుష్కరిణి (కోనేరు) పునరుద్ధరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గత నెల రోజులుగా కొనసాగుతున్న కోనేరు పునరుద్ధరణ పనులు దాదాపుగా చివరి దశకు చేరుకున్నాయి. అపమృత్యు దోష పరిహారకుడిగా కోరిన కోరికలు తీర్చే స్వామిగా భక్తులచే పూజలందుకుంటున్న తీర్చే స్వామిగా భక్తులచే పూజలందుకుంటున్న పడమటి ఆంజనేయస్వామి వారిని స్వయంగా జాంబవంతుల వారి ప్రతిష్ఠించారని ప్రతీతి. పశ్చిమముఖంగా ఆంజనేయస్వామి దేవాలయాలు భారతదేశం మొత్తంలో రెండే దేవాలయాలు భారతదేశం మొత్తంలో రెండే ఉన్నట్లు అందులో దక్షిణ భారతంలో ఉన్న ఆలయం మక్తల్ పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయస్వామి దేవాలయంగా ప్రసిద్ది చెందింది. గత కొన్ని దశాబ్దాలుగా కోనేరు మరుగున పడి చెత్తాచెదారం వేయడంతో మురికి కోపంగా మారిపోయింది. దేవాదాయ శాఖ పూర్తి నిర్లక్ష్య వైఖరి వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్న ఆరోపణలు భక్తుల నుండి వినపడుతున్నాయి. ఈ క్రమంలో శ్రీ పడమటి ఆంజనేయ స్వామి తమ ఇంటి ఇలవేల్పుగా కొలుస్తున్న స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో కోనేరు పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టారు. వచ్చే నెల డిసెంబర్ మాసంలో మొదటి వారంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాల నాటికి కోనేరును పూర్తిస్థాయిలో పునరుద్ధరించి భక్తులకు స్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకునేందుకు అందుబాటులోకి తేవాలన్న మంత్రి సంకల్పంతో నెల రోజులుగా కొనసాగుతున్న పనులు దాదాపుగా చివరి దశకు చేరుకున్నాయి. 15 రోజుల్లోగా పనులు పూర్తి అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద బ్రహ్మోత్సవాలనాటికి పుష్కరిణి భక్తులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో కోనేరు అందుబాటులోకి రానుండడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జడ్చర్ల గురుకులంలో హైటెన్షన్

విద్యార్థిపై ఉపాధ్యాయుడి దాడి, తల్లిదండ్రుల ఆగ్రహం

ప్రజాపక్షం/జడ్చర్ల : జడ్చర్ల పట్టణంలో మరోసారి విద్యాసంస్థలో విద్యార్థులపై హింసా ఘటన కలంకలం రేపింది. స్థానిక శ్రీ స్వామి నారాయణ ఇంటర్నేషనల్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి బొడ్డుపల్లి సిద్ధార్థ చారిపై గణిత శాస్త్ర ఉపాధ్యాయులు అమానుషంగా వ్యవహరించిన ఘనటతో ఉద్రిక్తత నెలకొంది. సమాచార ప్రకారం, చిన్నపాటి తప్పిదానికి గాను ఉపాధ్యాయుడు విద్యార్థి చెంపపై బలంగా కొట్టడంతో ఎడమ చెవి నుండి రక్తస్రావం ప్రారంభమైంది. గాయపడిన విద్యార్థిని ఇతరులు చూసి ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలిసిన వెంటనే విద్యార్థి తల్లిదండ్రులు, బంధువుల ఆగ్రహంతో పాఠశాల వద్దకు చేరుకుని ఉపాధ్యాయుడిని చూపించాలని డిమాండ్ చేశారు. వారి ఆవేశం తీవ్రరూపం దాల్చడంతో పాఠశాల కార్యాలయ తలుపులు బద్దలయ్యాయి. తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంపై ఘాటుగా విరుచుకుపడ్డారు. జరిగిన తరువాత కూడా పాఠశాల అధికారులు తమకు సమాచారం ఇవ్వకపోవడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇదే పాఠశాలలో గతంలో నిశాంత్ అనే మరో విద్యార్థిని కూడా కొట్టడంతో చెవిలో రక్తసావం జరిగినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో ఇలాంటి ఘటనలు పదేపదే జరుగుతుండడం తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. విద్యాశాఖ అధికారులు కూడా విచారణ ప్రారంభించారు. విద్యార్థుల భద్రతలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ ఘటనతో జడ్చర్ల పట్టణంలో విద్యాసంస్థల భద్రత, ఉపాధ్యాయుల ప్రవర్తనపై చర్చ చెలరేగింది. తల్లిదండ్రులు విద్యార్థులపై హింసకు పాల్పడే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 11 మందికి జరిమానా

ప్రజాపక్షం/వీపనగండ్ల : వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించి, మద్యం సేవించి వాహనాలు నడపడం కొనసాగుతుండటంతో పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన 11 మంది వాహనదారులకు వనపర్తి మున్సిపల్ కోర్టు జరిమానా విధించినట్లు ఎస్సై కే రాణి తెలిపారు. వీపనగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహించిన పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని కోర్టుకు హాజరుపరచగా, వనపర్తి మున్సిపల్ కోర్టు మెజిస్ట్రేట్ కార్తీక్ రెడ్డి ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై కె రాణి మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకూ ప్రమాదం కలుగుతుందని మెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పై పోలీసులు భవిష్యత్తులో మరింత కఠిన చర్యలు తీసుకుంటారని, ఎవ్వరూ ఈ నిబంధనలను ఉల్లంఘించవద్దని ఆమె సూచించారు. కార్యక్రమంలో కోర్టు కానిస్టేబుల్ రాజేందర్ ఉన్నారు.

## పొలం విడిపించాలని వినూత్న నిరసన



ప్రజాపక్షం/వెల్దండ : రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్ మండలం వితాయిపల్లి గ్రామానికి చెందిన హైమావతి మండలపరిధిలోని కుప్పగండ్ల రెవెన్యూశివారులో 10ఎకరాల 6గుంటల భూమి మండలానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జాకు పాల్పడుతున్నారని, ఆ కబ్జాదారుల నుండి తమ భూమిని విడిపించాలని సోమవారం కేంద్ర మాజీమంత్రి స్వర్గీయ జైపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాభర్త వీరేశం 2006లో కుప్పగండ్ల రెవెన్యూ శివారులో సర్వేనెంబర్ 237,238లలో 10 ఎకరాల 6గుంటలభూమిని యాద య్య, సత్యనారాయణ, వెంకటయ్య, రామయ్య, యాదమ్మలకు చెందిన 4911/2006 భూమిని 30–01–2006నాడు కొనుగోలు చేశాడని, అట్టిభూమిపై హక్కు, యజమానుదారులుగా తామే ఉన్నామని తెలిపారు. అయితే 2020లో తన భర్త వీరేశం శబరిమల ధరించి దీక్ష విరమించేందుకు శబరిమల బయలుదేరి వెళ్లగా అక్కడే గుండెపోటుతో చనిపోయాడు. ఆతర్వాత కొన్నాళ్లకు ఆభూమికి కుప్పగండ్ల రైతులు తమకు హద్దులు చూపించారని, ఇప్పుడు అదేగ్రామానికి చెందిన కొందరు తమ భూమిపై కన్నేసి నాకు భర్తలేనందున నేను ఏమి చేయలేననే ధీమాతో తమ భూమి కబ్జా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. తన భర్తకు రాజకీయ గురువైన దివంగతనేత జైపాల్‌రెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేసి ఆక్రమణకోసం ప్రయత్నం చేస్తున్న వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకొని భూమి దక్కేలా చూడాలని బాధితురాలు హైమావతి కోరుతున్నారు.

**హైమావతికి న్యాయం చేయాలి : ఎన్నం శేఖర్‌రెడ్డి**

కుప్పగండ్ల రెవెన్యూశివారులో సర్వేనెంబర్ 237,238లలో 10 ఎకరాల 6గుంటలభూమి హైమావతికి చెందినది అని ఆభూమి రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరుచెప్పుకొని మండలపరిధిలోని అజిలాపూర్, కుప్పగండ్ల, చెరుకూర్, కొత్ర గ్రామాల్లో కబ్జాలకు పాల్పడుతున్నారనివారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి హైమావతికి న్యాయం చేయాలని బిజెపితాలుకా కన్వీనర్ ఎన్నం శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు జూలూరి బాలస్వామి, ఆచారి మిత్రమండలి నాయకులు మట్టపరమేష్‌గౌడ్, పరమేష్, హైమావతి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## వైభవంగా స్వర్ణ కవచ పంచలోహ శివలింగ వార్షికోత్సవం



ప్రజాపక్షం/కొత్తకోట : కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీకోటిలింగేశ్వర దత్త దేవస్థానము దగ్గర నూతనంగా నిర్మించిన ధ్యానమందిరంలో ప్రతిష్ఠించిన పాదరస సహిత నవరత్నాలంకృత స్వర్ణ కవచ పంచలోహ శివలింగం మొదటి వార్షికోత్సవం వైభవంగా జరిగింది. వందమంది భక్తులచే వెయ్యి సాలగ్రామాలకు రుద్రాభిషేకం చేయించి వాటిని మఠాధిపతులు అర్చకులకు దానం చేసే అపూర్వమైన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేశారు.

# రీల్

## హీరోగా జయకృష్ణ ఘట్టమనేని



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, దివంగత రమేష్ బాబు కుమారుడు, సూపర్ స్టార్ మహేష్ బాబు అన్న కొడుకు, జయ కృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్నారు. ఒక అద్భుతమైన వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తూ, ఆర్ఎక్స్ 100, మంగళవారం వంటి బ్లాక్ బస్టర్ చిత్రాల ఫిల్మ్ మేకర్ అజయ్ భూపతి దర్శకత్వంలో జయకృష్ణ వెండితెర అరంగేట్రం చేయబోతున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను వైజయంతి మూవీస్ అశ్విని దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు బ్యానర్‌పై పి.కిరణ్ నిర్మిస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణతో కల్ట్ బ్లాక్ బస్టర్ అగ్ని పర్వతం చిత్రాన్ని నిర్మించి, తరువాత రాజకుమారుడుతో ప్రిన్స్ మహేష్ బాబును తెలుగు సినిమాకు పరిచయం చేసిన అశ్విని దత్, ఇప్పుడు మూడవ తరం స్టార్ జయ కృష్ణ ఘట్టమనేనిని పరిచయం చేస్తూ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.జయకృష్ణ ప్రస్తుతం నటన, ఫైట్స్, డాన్స్, డైలాగ్ డెలివరీ వంటి అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. పక్కా తెలుగు హీరోగా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. అద్భుతమైన కొండల మధ్య సాగే సినిమా మనసుకు హత్తుకునే ప్రేమకథ ప్రధానంగా ఉంటుంది. భావోద్వేగాలు, నిజాయితీ, రియలిజం కలగలిపిన ఈ సినిమా కొత్త తరహా ప్రేమకథగా నిలవనుంది. ఈ నెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. టైటిల్‌తో పాటు మిగతా వివరాలు త్వరలో తెలియజేయనున్నారు.

### 2024 తెలంగాణ టివి అవార్డుల కమిటీ
## చైర్మన్‌గా శరత్ మరార్ నియామకం



తెలంగాణ ప్రభుత్వం టెలివిజన్ రంగంలో ప్రతిభను గుర్తించి సత్కరించేందుకు తెలంగాణ టెలివిజన్ అవార్డ్స్ 2024 నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభించింది. ఈ అవార్డ్స్‌కు సంబంధించిన విధానాలు, నియమావళి, లోగో రూపకల్పన వంటి అంశాలను ఖరారు చేయడానికి ఉన్నత స్థాయి కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.15 మంది సభ్యుల కమిటీకి తెలంగాణ ఎఫ్‌డిసి ఎండీ కన్వీనర్‌గా ఉంటారు. నిర్మాత శరత్ మరార్ ఛైర్మన్‌గా, ఈ కమిటీలో టెలివిజన్ పరిశ్రమ నుండి కె.బాపినీడు, మంజుల నాయుడు, పి.కిరణ్ సహా ప్రముఖ సభ్యులు ఉంటారు. అన్ని విభాగాలలో పారదర్శకత, సమగ్రత, సృజనాత్మక నైపుణ్యాన్ని నిర్ధారించడానికి అవార్డుల ఫ్రేమ్ వర్క్, విజన్‌ని రూపొందించే బాధ్యతను ప్యానెల్‌కు అప్పగించారు.

### 13 దేశాల్లో టాప్ ట్రెండింగ్‌లో..
## చికిరి






మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, అస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ కాన్సర్ట్‌లో సందడి చేశారు. రెహమాన్ కాన్సర్ట్ రామోజీ ఫిల్మ్ సిటీలో అట్టహాసంగా జరిగింది. అతిథులుగా హాజరైన రామ్‌చరణ్, జాన్వీ కపూర్, బుచ్చిబాబు సానా ఆడియన్స్‌లో మరింత జోష్ నింపారు. 'పెద్ది' సినిమాలోని చికిరి చికిరి లైవ్ పెర్ఫామెన్స్‌ని ఆడియన్స్ నుంచి అద్భుతమై రెస్పాన్స్ వచ్చింది. ఈ ఈవెంట్‌కు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ సందర్భంగా రామ్ చరణ్ మాట్లాడుతూ.. రెహమాన్ సంగీతంలో భాగమవ్వాలనేది నా చైల్డ్‌హుడ్ డ్రీం. అది నా ప్రాజెక్ట్ 'పెద్ది'తో నెరవేరినందుకు చాలా ఆనందంగా వుంది. జాన్వి కపూర్ మాట్లాడుతూ.. పెద్ది సినిమాలో భాగమయ్యే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. మా ఫస్ట్ సింగిల్ మీకు బాగా నచ్చుతుందని అనుకుంటున్నాను. ఈ సినిమాతో మీకు ఒక డిఫరెంట్, యూనిక్ ఎక్స్పీరియన్స్ ఇవ్వడానికి చాలా హార్డ్ వర్క్ చేస్తున్నాం. చికిరి పాట ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. మొత్తం 13 దేశాల్లో టాప్ ట్రెండింగ్‌లో వుంది. మొదటి 24 గంటల్లోనే చికిరి చికిరి యూట్యూబ్‌లో సెన్సేషనల్‌గా మారింది. దేశవ్యాప్తంగా టాప్ చార్ట్స్‌లో నెంబర్ 1 స్థానం దక్కించుకుంది. నాలుగు భాషల్లో కలిపి 53 మిలియన్ ప్లస్ వ్యూస్ సాధించింది. అంతకుముందు 13 గంటల్లోనే 32 మిలియన్ వ్యూస్ సాధించి సౌత్ ఇండియా రికార్డు క్రియేట్ చేసింది. దాదాపు మిలియన్ లైక్స్‌తో అభిమానుల ప్రేమని అందుకుంది.పెద్ది 2026 మార్చి 27న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కానుంది.

### రవితేజ కొత్త సినిమా
## 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'

మాస్ జాతర సినిమాతో ఇటీవల నిరాశ చెందిన రవితేజ తాజాగా తనదైన ఫామిలీ ఎంటర్టైన్మెంట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. కిషోర్ తిరుమల దర్శకత్వంలో నిర్మిస్తున్న రవితేజ 76వ సినిమాకు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే పేరు ఖరారు చేశారు. ఎస్ఎల్‌వీసి సినిమా బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ సినిమాలో రవితేజ సరసన ఆషిక రంగనాథ్, డింపుల్ హాయతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ రెగ్యులర్‌గా జరుగుతోంది. భీమ్స్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. సినిమాకు సంబధించిన అన్ని పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత సుధాకర్ చెరుకూరి తెలిపారు.






## 'ఆంధ్ర కింగ్ తాలూకా'
## 'ఫస్ట్ డే ఫస్ట్ షో' పాట ఆవిష్కరణ

రామ్ పోతినేని హీరోగా యూనిక్ ఎంటర్టైనర్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి మహేశ్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. టైటిల్ గ్లింప్స్, పాటలు, టీజర్ ప్రతి ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. ఫోర్త్ సింగిల్ ఫస్ట్ డే ఫస్ట్ షో అప్డేట్ ఇచ్చారు. ఫస్ట్ డే ఫస్ట్ షో సెలబ్రేషన్స్‌కి పర్ఫెక్ట్ వుండే ఈ సాంగ్ నవంబర్ 12న విడుదల కానుంది. రామ్ సెలబ్రేషన్స్ మోడ్‌లో వున్న సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ అదిరిపోయింది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ఈ సినిమాలో సూపర్స్టార్గా కనిపించనున్నారు. రావు రమేశ్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేష్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వివేక్, మర్విన్ సంగీతం అందిస్తుండగా, సిద్ధార్థ నూని సినిమాటోగ్రఫ, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ను నిర్వహిస్తున్నారు.'ఆంధ్ర కింగ్ తాలూకా' నవంబర్ 28న థియేటర్లలో విడుదల కానుంది.

## నాలుగు యుగాల కథ
## 'గత వైభవ'



ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఎపిక్ ఫాంటసీ డ్రామా గత వైభవ. సింపుల్ సుని దర్శకత్వంలో సర్వేగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బ్యానర్స్‌పై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 14న విడుదలకు సిద్ధమవుతోంది.ప్రైమ్‌షో ఎంటర్టైన్మెంట్ కే.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమా తెలుగు హక్కులను సొంతం చేసుకున్నారు. తమ సక్సెస్ ఫుల్ ట్రాక్ రికార్డ్, స్ట్రాంగ్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌తో ఈ సినిమాని ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఉత్తర అమెరికా, కెనడాలలో విడుదల చేస్తున్నారు.



## 14న 'జిగ్రీస్' విడుదల

కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో మౌంట్ మెరు పిక్చర్స్ నిర్మిస్తున్న యూత్ఫుల్ క్రేజీ ఎంటర్టైనర్ జిగ్రీస్. హరిష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ వోడపల్లి నిర్మాత. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. జిగ్రీస్ నవంబర్ 14న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా దర్శకుడు హరీష్ రెడ్డి ఉప్పుల మాట్లాడుతూ జిగ్రీస్ 14న రిలీజ్ అవుతుంది.ఇది యూత్ ఫుల్ ఎంటర్టైనర్. ఒక సినిమాలా కాకుండా ఒక ఎక్స్పీరియన్స్ లాగా ఉంటుంది. ఒక కొత్త ఫీల్ ఇవ్వడం కోసం చాలా కేర్ తీసుకున్నాం. ఈ నలుగురిని చూస్తే మీలో ఒకరిగానే అనిపిస్తారు. కచ్చితంగా అన్ని క్యారెక్టర్స్‌తో రిలేట్ అవుతారు. ప్రతి సిన్నీ హిలేరియస్ గా నవ్వుకుంటారు. ప్రొడ్యూసర్స్ చాలా సపోర్ట్ చేశారు. మా యాక్టర్స్ అందరూ అమేజింగ్ పెర్ఫార్మన్స్ ఇచ్చారు. చాలా నేచురల్‌గా చేశారు. అన్నీ అందుతమైన నేచురల్ లోకేషన్స్‌లో చేసిన సినిమా ఇది. మీ ఫ్యామిలీ, జిగ్రీస్ తో వెళ్ళండి. సినిమాకి ఖచ్చితంగా చాలా ఎంజాయ్ చేస్తారు. ఈ ప్రెస్ మీట్ లోమణి వక్కా, కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, నిర్మాత కృష్ణ వోడపల్లి, సహ నిర్మాత చిట్టెం వినయ్ పాల్గొన్నారు.

## అమెజాన్ ప్రైమ్ ట్రెండింగ్‌లో
## మిత్రమండలి

బన్నీ వాస్ సమర్పణలో బివి వర్క్స్, సప్త అశ్వ మీడియా వర్క్స్ బ్యానర్స్‌పై విజయేందర్ రచనా దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'మిత్ర మండలి'. ప్రియదర్శి, నిహారిక ఎన్ ఎం హీరో హీరోయిన్లుగా జంటగా నటిస్తూ వెండి తెరపై ప్రేక్షకులను ఎంతగానో అలరించారు. కళ్యాణ్ మంతెన, భాను ప్రతాప, విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ చిత్రానికి ఆర్ ఆర్ ధ్రువన్ సంగీతాన్ని అందించగా సిద్ధార్థ సినిమాటోగ్రఫీ చేశారు.



ఈ చిత్రంలో బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, సత్య, విష్ణు ఓయు, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా, వీటీవీ గణేష్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ ఏడాది అక్టోబర్ 16వ తేదీన విడుదలైన ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకుల నుండి మంచి ఆదరణ పొందింది. అదేవిధంగా ఇప్పుడు అమెజాన్ ప్రైమ్‌లో టాప్ ట్రెండింగ్‌లో నిలిచింది. ప్రస్తుతం టాప్ ట్రెండింగ్‌లో ఉన్న కాంతార చిత్రానికి పోటీగా నిలుస్తూ మరింత వేగంగా ప్రేక్షకులను అలరిస్తూ మిత్ర మండలి దూసుకు వెళ్తోంది.

### చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లకు
## డిసెంబర్ 10న 'ఒబిసిల చలో ఢిల్లీ'

రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** చట్టసభల్లో బిసిలకు 50శాతం రిజర్వేషన్ల సాధనే ధ్యేయంగా దేశవ్యాప్త ఉద్యమం చేపడుతామని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. అందులోభాగంగా డిసెంబర్ 10న ఢిల్లీలో ఒబిసిల జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సదస్సుకు తెలంగాణ, ఎపి, కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి బిసి ప్రముఖులు హాజరవుతారని వివరించారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో సంఘం జాతీయ కార్యదర్శి బాణాల అజయ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, బిసి ఐక్య వేదిక అధ్యక్షులు అనంతయ్య సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య విచ్చేసి, మాట్లాడారు. 77 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో ఏ పార్టీ ప్రభుత్వం కుల గణన చేయలేదన్నారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో ఎవరి వాటా వారికి దక్కాలని ప్రధాని మోదీ దేశవ్యాప్త కులగణనకు చారిత్రాత్మక నిర్ణయం తీసుకొన్నారని కొనియాడారు. గతంలో బిసిలు బానిసలుగా, కూలీలుగా ఉన్నారని, ఇప్పుడు ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో గురుకులాలు, హాస్టళ్లు, పాఠశాలలు ఉండటంతో బిసి బిడ్డలు చదివి చైతన్యవంతులవుతున్నారని తెలిపారు. సమాజంలో గౌరవంగా బతకాలంటే అది విద్య ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కనుక, అన్ని రాష్ట్రాల్లో పిల్లల చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రం బిసిల అభివృద్ధికి రూ.2కోట్ల బడ్జెట్ ఇవ్వాలని, ప్రత్యేక మంత్రిత్వశాఖ కేటాయించాలని కోరారు. సమావేశంలో బిసి సంఘం నేతలు సి.రాజేందర్, పగిళ్ల సతీశ్, మోదీ రాందేవ్,శివకుమార్, భీంరాజ్, నరేశ్ గౌడ్, టి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### హైదరాబాద్ వేదికగా
## 'కల్చరల్ సావరినిటీ త్రూ సినిమా' ఉత్సవం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ నార్త్ ఈస్ట్ ఇండియా కనెక్ట్, టెక్నో–కల్చరల్ ఫెస్టివల్ – 'కల్చరల్ సావరినిటీ త్రూ' సినిమా అనే విభిన్న సాంస్కృతిక–సినిమాటోగ్రఫీ ఉత్సవం నిర్వహణకు రూ. 55 లక్షల నిధులను మంజూరు చేసిందనీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (టిజిఎఫ్‌డిసి) ఆధ్వర్యంలో ఈ నెలలో హైదరాబాద్‌లోని ప్రసాద్ మల్టీప్లెక్స్, హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణను దేశంలోని కళ, సంస్కృతి, సినిమాటోగ్రఫీ రంగాల కేంద్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ ఫెస్టివల్ ద్వారా ఈశాన్య రాష్ట్రాలతో సాంస్కృతిక, సృజనాత్మక బంధాలు మరింత బలపడతాయి, అన్నారు. ఈ ఫెస్టివల్‌లో జాతీయ అవార్డు గెలుచుకున్న చిత్రాల ప్రదర్శనలు, ప్యానెల్ చర్చలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయి. తెలంగాణ రాష్ట్రం కల్చరల్ ఎక్స్ఛేంజ్‌కి కేంద్ర బిందువుగా ఎదుగుతున్నదని తెలిపారు.

## 3.7 కోట్ల మంది ఓటర్లు

(మొదటి పేజీ తరువాయి)

జెడి(యు) నాయకుడు, రాష్ట్ర మంత్రివర్గంలో అత్యంత సీనియర్ సభ్యుడు బిజేంద్ర ప్రసాద్ యాదవ్ ఉన్నారు. ఆయన తన సుపాల్ స్థానాన్ని రికార్డు స్థాయిలో ఎనిమిదోసారి నిలుపుకోవాలని చూస్తున్నారు. ఇతర మంత్రులలో బిజెపికి చెందిన రేణు దేవి (బెట్టయ్య), నీరజ్ కుమార్ సింగ్ బబ్లూ (ఛాతాపూర్), జెడి(యు)కి చెందిన లేషి సింగ్ (ధమ్దహా), షీలా మండల్ (ఫుల్పరాస్), జామా ఖాన్ (చెయిన్‌పూర్) ఉన్నారు. రెండవ, చివరి దశను ఎన్‌డిఎ చిన్న భాగస్వాములైన కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ నేతృత్వంలోని హిందూస్థానీ అవామ్ మోర్చా (హామ్), రాజ్యసభ ఎంపి ఉపేంద్ర కుష్వా రాష్ట్రీయ లోక్ మోర్చా బల పరీక్షగా కూడా చూస్తున్నారు. ఈ రెండూ చెరో ఆరు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. హామ్ పోటీ చేసిన ఆరు స్థానాలకు రెండవ దశలో ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో నాలుగు ఇమామ్‌గంజ్, బారాచట్టి, టికారి, సికంద్రాల్లో ఆ పార్టీ నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్ళీ తమ అదృష్టాన్ని పరీక్షించుకునే అవకాశం దక్కింది. ఇక రెండేళ్ల క్రితమే స్థాపించబడిన, రాష్ట్ర శాసనసభలో ప్రాతినిధ్యం లేని ఆర్‌ఎల్ఎం అభ్యర్థులలో కుష్వా భార్య స్నేహలత, అతని అత్యంత విశ్వసనీయ సహాయకుడు మాధవ్ ఆనంద్ బరిలో ఉన్నారు. మరో ముఖ్యమైన అభ్యర్థి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ కుమార్, ఆయన కుటుంబ రిజర్వ్‌డ్ స్థానాన్ని వరుసగా రెండవసారి నిలుపుకోవాలని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ రెండవ విడత ఎన్నికలకు 45,399 పోలింగ్ స్టేషన్లను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. వీటిలో 40,073 గ్రామీణ ప్రాంతాలకు చెందినవి. ఓటర్లలో సగానికి పైగా (2.28 కోట్లు) 30–60 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు. 7.69 లక్షల మంది మాత్రమే 18–19 సంవత్సరాల వయస్సు గలవారు ఉన్నారు. 122 నియోజకవర్గాల్లో మొత్తం మహిళా ఓటర్ల సంఖ్య 1.75 కోట్లుగా ఉంది. నవాద జిల్లాలోని హిసువా సీటులో అత్యధిక ఓటర్లు (3.67 లక్షలు) ఉండగా, లౌరియా, చాన్‌పాటియా, రక్సౌల్, త్రివేణిగంజ్, సుగౌలి, బన్మఖిలలో అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు (ఒక్కొక్కటి 22) ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల మొదటి దశలో 121 నియోజకవర్గాలలో జరిగిన పోలింగ్‌లో బిహార్‌లో ఇప్పటివరకు అత్యధికంగా 65 శాతానికి పైగా ఓటర్లు ఓటు వేశారు.

**పటిష్ట భద్రత**

నేడు జరగనున్న రెండవ దశ అసెంబ్లీ ఎన్నికలకు బిహార్ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశామని, 4 లక్షలకు పైగా సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని అధికారులు సోమవారం తెలిపారు. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా చూసేందుకు 4 లక్షలకు పైగా భద్రతా సిబ్బందిని ఎన్నికల విధుల కోసం నియమించినట్లు న్నికల కమిషన్ అధికారి చెప్పారు. దాదాపు 500 కంపెనీలు (సుమారు 50,000) కేంద్ర సాయుధ పోలీసు దళం ముందస్తు ఎన్నికల విధుల్లో నిమగ్నమైందని, తదనంతరం మరో 500 కంపెనీలు సిఎపిఎఫ్ రాష్ట్రానికి చేరుకున్నాయని ఆయన అన్నారు. అక్టోబర్ మూడవ వారంలో ఎన్నికల విధుల కోసం అదనంగా 500 కంపెనీలు వచ్చాయన్నారు. బిహార్ పోలీసులకు చెందిన 60,000 మందికి పైగా సిబ్బంది ఇప్పటికే ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన రిజర్వ్ బెటాలియన్లకు చెందిన సుమారు 2,000 మంది సిబ్బంది, బిహార్ స్పెషల్ ఆర్మ్డ్ పోలీస్‌కు చెందిన 30,000 మంది సిబ్బంది, 20,000 మందికి పైగా హోమ్ గార్డులు, కొత్తగా నియమించబడిన 19,000 మంది కానిస్టేబుళ్లు (శిక్షణ పొందుతున్నారు), దాదాపు 1.5 లక్షల మంది 'చౌకీదార్లు' (గ్రామీణ పోలీసులు) కూడా రెండు దశలకు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నారని ఆయన చెప్పారు.

### కెపిసి ప్రాజెక్టు కార్యాలయంలో
## జిఎస్‌టి సోదాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెపిసి ప్రాజెక్టు కార్యాలయంలో జిఎస్‌టి అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. హైదరాబాద్ పంజాగుట్టలోని నిర్మాణ సంస్థ కెపిసిలో జిఎస్‌టి అధికారులు 5 బృందాలుగా విడిపోయి దాడులు చేస్తున్నారు. వ్యాపార లావాదేవీలు, జిఎస్‌టి చెల్లింపుల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. అయితే ఈ తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ రంగంలోకి దించారు.

## ధిక్కార పిటిషన్ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

ధిక్కార పిటిషన్‌ను అత్యవసర విచారణకు స్వీకరించాలని సోమవారం సుప్రీం కోర్టులో ఒక న్యాయవాది ప్రస్తావించారు. దీనిని వచ్చే సోమవారం లిస్ట్ చేయాలని కోర్టు సిబ్బందికి ఛీఫ్ జస్టిస్ గవాయ్ ఆదేశించారు. ఉద్దేశ్యపూర్వకంగానే (నవంబర్ 23న గవాయ్ పదవీ విమరణ కారణంగానే) ప్రతివాదులు నెలాఖరు వరకు విచారణను సాగదీస్తున్నారని న్యాయవాది పేర్కొన్నారు. అయితే, నవంబర్ 24 తర్వాత సుప్రీంకోర్టు మూసివేయబడదని గవాయ్ వ్యాఖ్యానించారు. జూలై 31న కోర్టు ఆదేశం వెలువడినప్పటి నుండి ఎలాంటి చర్యలు చేపట్టలేదని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు. బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు కె.టి. రామారావు, పాడి కౌశిక్ రెడ్డి, కె.పి.వివేకానంద్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లపై జూలై 31న కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో తాజాగా ధిక్కార పిటిషన్‌ను వారి తరపు న్యాయవాది దాఖలు చేశారు.



## రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య లేదు

భాధితులకు భరోసా ఇచ్చేందుకే కౌన్సిలింగ్ కేంద్రం: డిజిపి

**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** రాష్ట్రంలో ఎలాంటి శాంతి భద్రతల సమస్య లేదని, ప్రశాంత వాతావరణం నెలకొని ఉందని డిజిపి శివధర్‌రెడ్డి అన్నారు. సోమవారం సరూర్‌నగర్ మహిళా పోలీస్‌స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, భరోసా కేంద్రాన్ని రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగిక వేధింపులు, అత్యాచారాలు, గృహహింస, ర్యాగింగ్, దూషణ వంటి వాటికి గురైన బాధితులు ధైర్యంగా వచ్చి పిర్యాధు చేయటంతో పాటు కోర్టులో కేసు నిలబడే విధంగా చేసేందుకే ఈ భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. న్యాయవాదులు సహా వ్యక్తిత్వ వికాస నిపుణులు, కౌన్సిలర్లు సహాయ సహకారాలు అందజేయనున్నారని తెలిపారు. ఉమెన్ సేఫ్టీవింగ్ డిసిపి ఉషారాణి మాట్లాడుతూ బాధితులు నేరుగా వచ్చి పిర్యాధు చేయాలని, భరోసా కేంద్రం వీరికి అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిజిపిఐసిఎస్ ఎండి ఎం.రమేష్, ఎల్‌బినగర్ డిసిపి బి.అనురాధ, ఉమెన్ సేఫ్టీవింగ్ ఎస్పీ షైక్ సలీమా, ఎసిపి పి.వెంకటేశ్వర్లు, ఎ.కృష్ణయ్య గౌడ్, సిఐ సైదిరెడ్డి, సత్తయ్య, ముని. అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమానత్వం లేదు


(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసింది. ఇలాంటి విధానపరమైన విషయాలలో జోక్యం చేసుకునేటప్పుడు న్యాయస్థానానికి చాలా పరిమితులు ఉంటాయని జస్టిస్ నాగరత్న స్పష్టం చేశారు. ''దేశంలోని పౌరులు అందరూ రాజకీయ,సామాజిక సమానత్వానికి అర్హులు అని మన భారత రాజ్యాంగ పీఠిక చెబుతోంది, ఈ దేశంలో అతిపెద్ద మైనారిటీ ఎవరు? వాళ్ళు మహిళలే. వారు దాదాపు 48 శాతంగా ఉన్నారు. ఇదే మన దేశ రాజకీయాలలో మహిళా సమానత్వం'' అని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టులో మహిళా రిజర్వేషన్‌పై పిటిషన్ దాఖలు చేసిన జయా థాకూర్ తరపున సీనియర్ న్యాయవాది శోభాగుప్తా వాదనలకు హాజరయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 సంవత్సరాల తర్వాత తమకు ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరుతూ మహిళలు న్యాయస్థానానికి రావడం విచారకరమైన విషయమని శోభ గుప్తా అన్నారు. మహిళల డేటా ప్రకారం లోక్‌సభ, రాష్ట్రాలలోని చట్టసభల్లో మూడోవంతు సీట్లు మహిళలకు కేటాయించాల్సి ఉందని ఆమె అన్నారు. తాజాగా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ నిర్వహించేవరకూ ఎదురుచూడకుండా, ఇక ఆలస్యం లేకుండా మహిళా రిజర్వేషన్లను చట్టసభల్లో అమలు చేసేందుకు కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయవాది వరుణ్ థాకూర్ ద్వారా జయాథాకూర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద పిటిషనర్ సుప్రీంకోర్టులో ఈ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఆలస్యం లేకుండా 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఆదేశాలివ్వాలని కోరారు, ఈ ప్రయోజనం నెరవేర్చేందుకు పునర్విభజన ప్రక్రియ జరగాలనే ఒక అంశాన్ని కేంద్రం పేర్కొంది. రాజ్యాంగానికి చేసిన 128వ సవరణ ప్రకారం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను తూ.చ.తప్పకుండా అమలు చేయాలని జయా థాకూర్ కోరారు. 2023 సెప్టెంబరు 21వ తేదీన ఈ రాజ్యాంగ సవరణను పార్లమెంటు ఆమోదించింది. ఐతే ఈ చట్టాన్ని అమలు చేయడానికి పునర్విభజనను సాకుగా చెప్పడాన్ని మహిళా సమాఖ్య ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు సుప్రీంకోర్టులో సవాలు చేసింది. 2023లో చేసిన చట్ట సవరణను అమలు చేయడానికి రాజ్యాంగంలోని 334 (1) లేదా క్లాస్ ఫైవ్ (పునర్విభజన)కు ముడిపెట్టడాన్ని ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు సవాలు చేసింది. జయా థాకూర్ మరో వైపు ఆనాడు బిల్లును సవాలు చేశారు.

## ఫిలిప్పీన్స్‌లో సూపర్ టైఫూన్

(మొదటి పేజీ తరువాయి)

కల్మెగీ తుఫాను ఫిలిప్పీన్స్‌ను గడగడలాడించింది. అపారమైన నష్టాన్ని కలగజేసింది. ఈ తుఫానులో చిక్కుకుని 224 మంది మరణించారు. వందలమంది గాయపడ్డారు. ఎక్కడపడితే అక్కడ ఇళ్ళు కూలిపోయాయి. అనేక నగరాలను, పట్టణాలను వరదలు ముంచెత్తియి. వాహనాలు కొట్టుకుపోయాయి. విరిగిన చెట్లు, ధ్వంసమైన ఇళ్లు అలాగే ఉన్న పరిస్థితుల్లో ఇంకా కూడదీసుకోకముందే మరో సూపర్ పవర్ తుఫాను చుట్టుముట్టింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 20కి పైగా భారీ తుఫానులను ఆ దేశం ఎదుర్కొంది. ప్రతి సంవత్సరం 20కి తక్కువ కాకుండా తుఫానులు ఆ దేశాన్ని పట్టి కుదిపివేస్తాయి.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com